సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 26

మంగళవారం 18-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



బెంగళూరు చిన్నబోయింది!

చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో 8 పరుగుల తేడాతో ఓడిన ఆర్‌సీబీ. - 12లో



మూర్ఛ నుండి మిస్ ఇండియా..

మూర్ఛ వ్యాధితో పోరాడి మిస్ ఇండియా ఫైనల్స్‌కు చేరిన స్ట్రెర్లా లువాంగ్. - 11లో




కృత్రిమ మేధతో నిద్రలేని రాత్రులే..

కృత్రిమ మేధను సరిగా వాడకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని అల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ హెచ్చరించారు. - వివరాలు 6లో



సిసోడియా కస్టడీ పొడిగింపు

ఢిల్లీ మద్యం కుంభకోణం, మనీ లాండరింగ్ కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియా కస్టడీని ప్రత్యేక కోర్టు పొడిగించింది. - వివరాలు 6లో



అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్లు షురూ

అమర్‌నాథ్ యాత్రకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలైంది. యాత్రికులు పేర్లను నమోదు చేసుకునేందుకు ఆలయ బోర్డు ఏర్పాట్లు చేసింది. - వివరాలు 6లో



కాంగ్రెస్‌లోకి జగదీశ్ శెట్టర్

ఆదివారం బీజేపీకి రాజీనామా చేసిన కర్ణాటక మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ సోమవారం ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. - వివరాలు 6లో

పంచాయతీలకు అవార్డుల పంట



నెల్లుట్ల పంచాయతీకి సంబంధించిన అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకుంటున్న సర్పంచ్ స్వరూపరాణి. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి

- 9 కేటగిరీలకుగాను ఎనిమిదింటిలో ర్యాంకులు
- నాలుగు విభాగాల్లో మొదటి ర్యాంకు
- 46 జాతీయ అవార్డుల్లో 13 కైవసం
- రాష్ట్రపతి నుంచి అందుకున్న ప్రజాప్రతినిధులు
- ఇదే స్ఫూర్తితో దేశమంతా పల్లెల అభివృద్ధి: కేసీఆర్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ గ్రామ పంచాయతీలు అవార్డుల పంట పండించాయి. జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా ఎన్నికై రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాయి. మొత్తం 9 విభాగాలకుగాను 8 విభాగాల్లో విశేష ప్రతిభ కనబర్చి అవార్డులను సొంతం చేసుకొని రాష్ట్రపతితో ప్రశంసలు అందుకున్నాయి. జాతీయ పంచాయతీ అవార్డులు–2023లో భాగంగా కేంద్రం ప్రకటించిన మొత్తం 46 జాతీయ అవార్డుల్లో 13 అవార్డులను తెలంగాణ గెలుచుకుంది. 9 కేటగిరీల్లో అవార్డుల ఎంపిక జరగగా, 8 కేటగిరీల్లో పంచాయతీలు అవార్డులు సాధించాయి. దీంతో తెలంగాణను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని విజ్ఞానభవన్‌లో సోమవారం జరిగిన పంచాయత్ అవార్డుల కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా మిగతా 10వ పేజీలో ▶

కర్ణాటక ఎన్నికల్లో లింగాయత్ పవర్

- కన్నడనాట వారి ఓట్లే కీలకం
- ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో బీజేపీ, కాంగ్రెస్
- ప్రధాన పార్టీల ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో?

6లో

నిధులు కోసి.. కార్డులు తగ్గించేసి

ఇదేం పని..!

క్రమంగా నిర్వీర్యమవుతున్న ఉపాధి హామీ పథకం

కనీస వేతనంతో కూడిన వంద రోజుల ఉపాధి కల్పనకు తూట్లు

- భరోసా కోల్పోతున్న గ్రామీణ పేదలు
- గత రెండేళ్లతో పోలిస్తే గణనీయంగా తగ్గిన పనులు, పని దినాలు
- బడ్జెట్ తగ్గించిన కేంద్ర ప్రభుత్వం
- రెండేళ్లలోనే రూ.55 వేల కోట్ల మేర కోత
- మార్గదర్శకాలకు భిన్నంగా అమలు చేస్తున్న విధానాలు, విధిస్తున్న కఠిన నిబంధనలూ కారణమనే అభిప్రాయం
- గతంలో అమల్లో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణలోనూ గడ్డురోజులు
- ఈ ఏడాది రాష్ట్రంలో 5 లక్షల జాబ్‌కార్డుల తీసివేత
- 17.3 లక్షల కూలీల పేర్ల తొలగింపు
- పథకం అమలుకు అవరోధంగా సాంకేతికత మార్పు, చేర్పులు
- 'లిబ్‌టెక్' ఇండియా పరిశీలనలో వెల్లడి




సాక్షి, హైదరాబాద్: కరోనా కష్ట కాలంలో, తీవ్రమైన కరువుల్లాంటి ప్రతికూల పరిస్థితుల్లో గ్రామీణ పేదలను ఆదుకుని, వారి జీవితాలకు భరోసాగా నిలిచిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గడ్డు రోజులు మొదలయ్యాయా? పలు రాష్ట్రాల్లో ఇది క్రమంగా నిర్వీర్యమైపోతోందా? పేదలకు కనీస వేతనంతో కూడిన వంద రోజుల ఉపాధి కల్పనకు గుర్తింపు పొందిన ఈ పథకం కాస్తా.. నెమ్మది నెమ్మదిగా తన ప్రాధాన్యతను, గుర్తింపును కోల్పోతోందా?..అంటే అవునన్న సమాధానమే వస్తోంది. ఈ పథకం మార్గదర్శకాలకు భిన్నంగా అమలు చేస్తున్న విధానాలు, కొత్తగా విధిస్తున్న కఠిన నిబంధనలు, బడ్జెట్‌ను గణనీయంగా తగ్గించడం, జాబ్‌కార్డుల కోత.. ఇందుకు ప్రధాన కారణాలనే అభిప్రాయం మిగతా 5వ పేజీలో ▶

అయినా.. సీబీఐ తీరు

మారలేదు

బృందం కొత్తదైనా... మునుపటి తప్పటడుగుల జాడల్లోనే దర్యాప్తు

మునుపటి దర్యాప్తు సమగ్రంగా సాగ లేదని భావించిన సుప్రీంకోర్టు



- అందుకే పిటిషనర్‌తో ఏకీభవించి.. అధికారిని మార్చాలని ఆదేశాలు
- తదనుగుణంగానే కొత్త బృందాన్ని నియమించిన దర్యాప్తు సంస్థ
- మునుపు విస్మరించిన అంశాలకు ఈ బృందమూ దూరమే!
- పిటిషనర్ తులసమ్మ లేవనెత్తిన అంశాలను పట్టించుకోని తీరు
- రాజకీయ కోణాన్ని నిరూపించే ఒక్క ఆధారమూ లేదన్న సుప్రీంకోర్టు.. ఆ కోణంలో దర్యాప్తే చేయని కొత్త బృందం..
- ఒక్క సాక్ష్యమూ లేదు.. కానీ వివేకా– భాస్కర్‌రెడ్డి మధ్య రాజకీయ విభేదాలున్నట్లు కామెంట్లు
- కనీసం విచారించకుండానే ఉదయ్‌కుమార్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి అరెస్టు.. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమంటున్న న్యాయ నిపుణులు - 3లో

నోటీసులిచ్చి అరెస్టులా?

- వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐకి తెలంగాణ హైకోర్టు ప్రశ్న
- నేటి సాయంత్రం 4 గంటల తర్వాతే ఎంపీ అవినాశ్‌రెడ్డిని విచారణకు పిలవాలి.. అప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని దర్యాప్తు సంస్థకు ఆదేశం - 3లో

స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించలేం!

- స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించడం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా తేల్చిచెప్పింది. ఆడ, మగ మధ్య జరిగే వివాహాలకు మాత్రమే వ్యవస్థ నుంచి గుర్తింపు లభిస్తుందని సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న వివాహ వ్యవస్థతో సమానంగా స్వలింగ వివాహాలను గుర్తించలేమని స్పష్టం చేసింది.


- వివరాలు 6లో

హరీశ్.. భజన శాఖ తీసుకో!

రోగులు ఇబ్బంది పడుతున్నా మీకు పట్టదు

కేసీఆర్ భజన కార్యక్రమాలకు మాత్రం ముందు..!

పీపుల్స్ మార్చ్‌లో భట్టి ఫైర్



సాక్షి, పెద్దపల్లి: వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆసుపత్రుల్లో వీల్‌చైర్లు లేక రోగులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదని, సీఎం కేసీఆర్ కు భజన చేసే కార్యక్రమాలకు మాత్రం ముందుంటున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క విమర్శించారు. ఆయన తన శాఖను వదులుకుని ప్రత్యేకంగా భజన శాఖను ఏర్పాటు చేయించుకుని తీసుకోవాలని ఎద్దేవా చేశారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ సోమవారం రామగుండం నియోజకవర్గ పరిధి ఆకేనపల్లిలో కొనసాగింది. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడారు.

మహిళలు రుణం దేనికి తీర్చుకోవాలి..?

'హరీశ్‌రావు.. ఐకేపీ మహిళలు కేసీఆర్ రుణం దేనికి తీర్చుకోవాలి? మిగతా 2వ పేజీలో ▶

ఏం జరుగుతోంది?

- రాష్ట్ర కాంగ్రెస్ నేతలను ఆరా తీసిన రాహుల్‌గాంధీ
- హాథ్ సే హాథ్ జోడో, బీఆర్‌ఎస్‌పై వ్యతిరేకత ఇతర అంశాలపై చర్చ
- మైనార్టీలు మనవైపే ఉండే అవకాశం ఉందన్న నేతలు
- శంషాబాద్ విమానాశ్రయంలో 35 నిమిషాల పాటు భేటీ
- పాల్గొన్న ఠాక్రే, రేవంత్, ఉత్తమ్

2లో

నేడు కాంగ్రెస్ 'సత్యాగ్రహ దీక్ష'

- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై అఖిలపక్ష పార్టీలతో కలిసి ఆందోళన

- వివరాలు 2లో

ఇదండీ సంగతి (cartoon)



..కొన్ని రోజులు నన్ను కర్ణాటకకు ట్రాన్స్‌ఫర్ చేయండి సార్.. ప్లీజ్!

అసమ్మతిపై బీఆర్‌ఎస్ ఆరా!

- ఆత్మీయ సమ్మేళనాలకు దూరంగా ఉంటున్న నేతలపై కేసీఆర్ దృష్టి
- జూపల్లి, పొంగులేటి ఉదంతం నేపథ్యంలో నష్ట నివారణపై నజర్
- అసంతృప్తికి కారణాలను కనుగొనే బాధ్యత జిల్లా ఇన్‌చార్జిలకు..
- 27న పార్టీ సర్వసభ్య సమావేశం



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌లో అసమ్మతిపై అధినేత కేసీఆర్ దృష్టి సారించారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలకు, ఇతర కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నవారి వివరాలు అందజేయాల్సిందిగా జిల్లా ఇన్‌చార్జిలను ఆదేశించారు. ఏడాది చివరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గత నెలలో ప్రారంభమైన ఆత్మీయ సమ్మేళనాలను ఈ నెల 20 వరకు నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. అయితే వీటికి లభిస్తున్న స్పందన దృష్టిలో పెట్టుకుని, కార్యకర్తలతో మొక్కుబడి సమావేశాలు కాకుండా మిగతా 2వ పేజీలో ▶

23న రాష్ట్రానికి అమిత్ షా?

- చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పర్యటించే అవకాశం...
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన అధికారపార్టీ ముఖ్యనేత చేరికపై జోరుగా ప్రచారం..
- కాంగ్రెస్ నేతలూ చేరతారని ఊహాగానాలు
- 'లోక్‌సభ ప్రవాసీ యోజన' అమలు తీరుపై రేపు సమీక్ష



సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా ఈ నెల 23న రాష్ట్రానికి రానున్నట్టు సమాచారం. ఆ రోజు చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పర్యటిస్తారని, ఆ సందర్భంగా జరిగే సభలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన అధికారపార్టీ ముఖ్య నేత ఒకరు బీజేపీలో చేరే అవకాశాలున్నట్టు జోరుగా ప్రచారం సాగుతోంది. ఓ మాజీ మంత్రితో పాటు, మరికొందరు కాంగ్రెస్ నేతలు చేరొచ్చునని పార్టీ నాయకులు చెబుతున్నారు. కాగా, ఇప్పటికే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మిగతా 2వ పేజీలో ▶



పథకాలు అందకుంటే వెతికిపట్టుకుని అందిస్తాం

పల్లెల్లో చేసిన అభివృద్ధి పనుల ఫ్లెక్సీలు పెట్టండి: మంత్రి కేటీఆర్

- వివరాలు 2లో



ప్రపంచ వారసత్వ వేడుకలకు ముస్తాబైన రామప్ప ఆలయం -14లో

23న రాష్ట్రానికి అమిత్ షా?

▶ మొదటి పేజీ తరువాయి

వికారాబాద్‌లో పర్యటించి రావడంతో పాటు అక్కడ చేయాల్సిన సన్నాహాలను పరిశీలించారని అంటున్నారు. దీంతో అమిత్ షా రాక ప్రచారానికి మరింత బలం చేకూరింది.


గతంలో రెండుసార్లు రద్దు కావడంతో...

గతంలో రెండుసార్లు ఉమ్మడి మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో అమిత్‌షా పర్యటిస్తారని భావించినా చివరి నిమిషంలో అవి రద్దయ్యాయి. అయితే ఈసారి 'లోక్‌సభ ప్రవాసీ యోజన'లో భాగంగా ఆయన ఈ పర్యటనకు వస్తున్నట్టు పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి ప్రధాని మోదీ చారిత్రక హ్యాట్రిక్ విజయాన్ని రికార్డ్ చేయాలనే లక్ష్యంలో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని ఎంపీ స్థానాల్లో 'లోక్‌సభ ప్రవాసీ యోజన'ను బీజేపీ చేపట్టింది. ఇందులో భాగంగానే జాతీయ స్థాయి ముఖ్యనేతలు, కేంద్రమంత్రులు రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లో విడతల వారీగా పర్యటనలు నిర్వహిస్తూ వస్తున్నారు. పార్టీ ఏ మేరకు పటిష్టంగా ఉంది, స్థానికంగా బీజేపీ గురించి ప్రజలు ఏమనుకుంటున్నారు, ఆయా ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు ఎలా ఉంది వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఈ పర్యటనల అనంతరం జాతీయనాయకత్వానికి నివేదికలు సమర్పిస్తున్నారు.

3 రోజులు జాతీయనేతలు ఇక్కడే...

రాష్ట్రంలోని ఎంపీ స్థానాల్లో 'లోక్‌సభ ప్రవాసీ యోజన'అమలుతీరుపై బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నట్టు సమాచారం. ఈ సమావేశంలో అమిత్‌షా వర్చువల్‌గా పాల్గొనే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రానికి రానున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ఇన్‌చార్జీలు తరుణ్‌చుగ్, సునీల్‌బన్సల్, కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జీ అర్వింద్ మీనన్ బుధ, గురు, శుక్రవారాల్లో ప్రవాసీయోజనతో పాటు రాష్ట్ర పార్టీకి సంబంధించిన సంస్థాగత అంశాలు, పార్టీపరంగా అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్షించనున్నారు. బీజేపీ జాతీయనాయకత్వానికి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు కీలకంగా మారడంతో పార్టీ సన్నద్ధమవుతున్న తీరును అమిత్‌షాతో పాటు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర ముఖ్యనేతలు ప్రత్యక్షంగా పరిశీలించి, దిశానిర్దేశం చేస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే ఇతర పార్టీల నుంచి చేరికల వ్యూహానికి రాష్ట్ర నాయకత్వం ప్రస్తుతం మరింత పదును పెడుతోంది.

రూ.22 కోట్లతో పశువీర్య ఉత్పత్తి కేంద్రం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పాల ఉత్పత్తి పెంచే విధంగా నాణ్యమైన పశు సంపద అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలోని కంసాన్‌పల్లిలో 37 ఎకరాల విస్తీర్ణంలో రూ. 22 కోట్లతో నాణ్యమైన పశువీర్య ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించామని పాడి పరిశ్రమల శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం పశుసంవర్థక శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొత్తగా నిర్మించిన పశువీర్య ఉత్పత్తి కేంద్రం ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రంలో 17 ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసం పెంపకం కోసం పనులు జరుగుతున్నాయని తెలిపారు. వచ్చే వర్షాకాలం నాటికి ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే ఏడాదికి 10 లక్షల డోసుల వీర్యం ఉత్పత్తి జరుగుతుందని వెల్లడించారు.

నేడు కాంగ్రెస్ 'సత్యాగ్రహ దీక్ష'

- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై అఖిలపక్ష పార్టీలతో కలిసి ఆందోళన
- సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐ చేత విచారణ జరిపించాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసును సిట్టింగ్ జడ్జితోగానీ, సీబీఐతోగానీ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు వద్ద మంగళవారం కాంగ్రెస్ పార్టీ 'సత్యాగ్రహ దీక్ష'ను నిర్వహించనుంది. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీయేతర పక్షాలతో కలిసి మంగళవారం టీపీసీసీ ఆందోళన నిర్వహించనుంది. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి కోరారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో యువతకు న్యాయం జరగడం లేదని సోమవారం ఒక ప్రకటనలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వెనుక రాష్ట్ర ప్రభుత్వ పెద్దల హస్తం ఉందనే ఆరోపణలు వస్తున్నాయని, నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటలాడుతోందని విమర్శించారు.

ఇది నిరుద్యోగ వ్యతిరేక ప్రభుత్వం...

రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, పేపర్ లీకులతో నిరుద్యోగ వ్యతిరేక ప్రభుత్వంగా మారిపోయిందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇందిరాపార్కు వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సత్యాగ్రహ దీక్షకు అఖిలపక్ష పార్టీలు, యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

'సాగు'లో లింగవివక్ష మూల్యం

రూ. 81.84 లక్షల కోట్లు!



- పురుషాధిక్య పోకడల వల్ల భారీగా సంపద కోల్పోతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ
- ఐరాసకు చెందిన ఆహార-వ్యవసాయ సంస్థ తాజా నివేదికలో వెల్లడి

మహిళలపట్ల వివక్ష వల్ల సామాజికంగా వాటిల్లే నష్టానికి వెలకట్టలేం. అయితే వ్యవసాయం, ఆహార శుద్ధి, నిల్వ, పంపిణీ (అగ్రి ఫుడ్ సిస్టమ్స్) రంగాల్లో లింగవివక్ష వల్ల ఎంత నష్టం వాటిల్లుతున్నదో తెలుసుకొనేందుకు ఐక్యరాజ్య సమితి (ఐరాస)కి చెందిన ఆహార–వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ఇటీవల అధ్యయనం చేసింది. లింగవివక్ష కారణంగా ఏటా లక్ష కోట్ల డాలర్ల (రూ. 81,84,550 కోట్లు) సంపదను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోల్పోతున్నట్లు ఈ అధ్యయనంలో వెల్లడైంది. వ్యవసాయ రంగంలో మహిళల స్థితిగతులపై 2010 విరామం తర్వాత ఎఫ్ఏఓ వెలువరించిన తొలి అధ్యయన నివేదిక ఇదే. వ్యవసాయంతోపాటు ఈసారి ఆహార శుద్ధి, రవాణా, నిల్వ, పంపిణీ రంగాల్లో రైతులుగా, కూలీలుగా, ఉద్యోగినులుగా, వ్యాపారవేత్తలుగా, చిరు వ్యాపారులుగా పనిచేసే మహిళల స్థితిగతులపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక విడుదల చేయటం గమనార్హం.

(సాక్షి సాగుబడి డెస్క్)

ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ, ఆహార వ్యవస్థలపై ఆధారపడి జీవిస్తున్న వారి సంఖ్య 400 కోట్లు. ఏటా 1,100 కోట్ల టన్నుల ఆహారోత్పత్తి జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా సగటున 36% మంది మహిళలకు, 38% మంది పురుషులకు ఉపాధి కల్పిస్తున్న రంగం ఇది. అయితే ఆఫ్రికా దేశాల్లో 66% మంది మహిళలకు వ్యవసాయమే ఉపాధి. చిన్న, సన్నకారు రైతులకు నిలయమైన భారత్ తదితర దక్షిణాసియా దేశాల్లో ఇది మరీ ఎక్కువ. ఈ

గొడ్డు చాకిరీ.. 18% తక్కువ ఆదాయం

దేశాల్లో 71% మంది మహిళలు (మహిళా రైతులు, కూలీలు, ఉద్యోగినులు) వ్యవసాయ–ఆహార వ్యవస్థల్లో ఉపాధి పొందుతున్నారు. అలాగే పురుషులు 47% మంది ఉపాధి పొందుతున్నారు. అయితే కూలికి వెళ్లే వారిలో పురుషులకన్నా మహిళల సంఖ్యే తక్కువ. గత పదేళ్లలో పొలం పనులపై ఆధారపడే వారి సంఖ్య 10% తగ్గినట్లు ఎఫ్ఏఓ.నివేదిక చెబుతోంది. వ్యవసాయ–ఆహార వ్యవస్థల్లో ఉపాధి పొందుతున్న మహిళల పని పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. గొడ్డు చాకిరీ చేసినా పని భద్రత లేదు. పార్ట్‌టైమ్ పనులు, కొన్నాళ్లు మాత్రమే ఉండే పనులు, తక్కువ నైపుణ్యం అవసరమైన పనులే మహిళలకు ఇస్తున్నారు. అందువల్ల పురుషులకన్నా 18% తక్కువగా వారి ఆదాయం ఉంటోంది.

వ్యవసాయ, ఆహార వ్యవస్థల్లో మహిళలపట్ల లింగ వివక్షను నిర్మూలిస్తే ఆహారోత్పత్తి పెరిగి ఏటా లక్ష కోట్ల డాలర్ల మేరకు ఆదాయం సమకూరుతుంది. పేదరికం, ఆకలి తగ్గుతుంది. 4.5 కోట్ల మంది నిరుపేదలకు అదనంగా ఆహార భద్రత కలుగుతుంది. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని ఎఫ్ఏఓ తేల్చిచెప్పింది. అంతేకాదు.. వాతావరణ మార్పులు, కోవిడ్ మహమ్మారి వంటి విపత్కర పరిస్థితులను దీటుగా తట్టుకోవాలన్నా లింగవివక్షను రూపుమాపాల్సిన అవసరం ఉందని ఎఫ్ఏఓ నివేదిక స్పష్టం చేసింది. లింగ వివక్షను తగ్గించి మహిళా సాధికారతను పెంచే పథకాల వల్ల సగానికి సగం చిన్న రైతులకు మేలు జరుగుతుంది. 5.8 కోట్ల మంది ఆదాయం పెరుగుతుంది. మరో 23.5 కోట్ల మందికి విపత్తులను తట్టుకొనే శక్తి పెరుగుతుందన్నది తమ అంచనా అని ఎఫ్ఏఓ డైరెక్టర్ జనరల్ క్యు డోంగ్యు తెలిపారు.

వివక్షను రూపుమాపితే రైతుల ఆదాయం పెరుగుతుంది

ఏ ముప్పు అయినా మహిళలనే ముందు దెబ్బతీస్తుంది. కోవిడ్ మహమ్మారి వచ్చిన మొదటి ఏడాదిలో ఆహార శుద్ధి, పంపిణీ రంగంలో 22% మహిళల ఉద్యోగాలు పోతే, 2% పురుషుల ఉద్యోగాలు పోయాయి. కరువు కాటకాలు, ఉష్ణోగ్రతలు పెచ్చుమీరిన సంక్షోభ కాలాల్లో వ్యవసాయ–ఆహార రంగాల్లో పనిచేసే మహిళల బిడ్డల పోషణ, ఇంటి పనికి అదనంగా దూరం వెళ్లి నీళ్లు తెచ్చే భారం పెరిగిపోతోంది. అల్ప, మధ్య తరహా ఆదాయ దేశాల్లో మొబైల్ ఇంటర్నెట్ సదుపాయం విషయంలో లింగ వివక్ష 25% నుంచి 16 శాతానికి తగ్గినట్లు గుర్తించారు. గత పదేళ్లుగా అనేక దేశాల్లో మహిళలకు అనుకూల విధానాలు వస్తున్నప్పటికీ వ్యవసాయం–ఆహార రంగాల్లో పెద్ద మార్పు కనిపించట్లేదు. 68 దేశాల్లో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన 75% విధానాల్లో మహిళల ప్రాధాన్యతను గుర్తించినప్పటికీ లింగవివక్షను తగ్గించే ప్రయత్నాలు 19% విధానాల్లోనే కనిపించింది. విధాన నిర్ణేతలు క్షేత్రస్థాయిలో లింగవివక్షను తగ్గించేందుకు మహిళా సాధికారతకు పెద్దపీట వేయాలని ఎఫ్ఏఓ సూచించింది.

కౌలు రైతులకు మరీ కష్టం..

భూమిని కౌలుకు తీసుకున్న మహిళా రైతులు తీవ్ర అభద్రతకు గురవుతున్నారని ఎఫ్ఏఓ పేర్కొంది. 46 దేశాల్లో గణాంకాలను పరిశీలిస్తే 40 దేశాల్లో పురుష రైతులకు ఎక్కువ భూమి హక్కులు ఉన్నాయి. అదేవిధంగా కౌలు నిబంధనలు కూడా వారికి అనుకూలంగా ఉన్నాయి. మరోవైపు మహిళా రైతులకు రుణ సంస్థల నుంచి పరపతి అందట్లేదు. శిక్షణా అవకాశాలు మహిళలకు అంతగా అందుబాటులో ఉండట్లేదు. అన్నిటికన్నా మించి పురుషులను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన సాంకేతికతలు, యంత్రాలనే మహిళలు ఉపయోగించాల్సి వస్తోంది. ఈ అసమానతల వల్ల సమాన విస్తీర్ణంలో పంటలు సాగు చేసిన పురుషులకన్నా మహిళలు సాగు చేసిన పొలాల్లో ఉత్పాదకత 24% తక్కువగా వస్తున్నట్లు ఎఫ్ఏఓ నివేదిక తెలిపింది.

ఇప్పుడు మహిళల కోసం వ్యవస్థలు పనిచేయాలి



వ్యవసాయ, ఆహార రంగాల్లో లింగ అసమానతలను స్థానికంగా ఎక్కడికక్కడ పరిష్కరించి మహిళలకు సాధికారత కల్పిస్తే పేదరికాన్ని అంతం చేయడం, ఆకలి కేకలులేని ప్రపంచాన్ని సృష్టించడం వంటి లక్ష్యాల సాధన కృషిలో ప్రపంచం ముందుకు దూసుకుపోతుంది. వ్యవసాయ, ఆహార వ్యవస్థల్లో మహిళలు అనాదిగా పనిచేస్తున్నారు. వారి కోసం ఈ వ్యవస్థలు పని చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

- డా. క్యు దోంగ్యు, డైరెక్టర్ జనరల్, ఆహార-వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ)

ఉన్నమాట అంటే ఉలిక్కిపడుతున్నారు

ఏపీ మంత్రులపై మంత్రి హరీశ్‌రావు



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి హరీశ్ రావు

సాక్షి, సిద్దిపేట: కొందరు ఏపీ మంత్రులు ఎగిరెగిరిపడుతున్నారని.. ఉన్నమాట అంటే.. వారు ఉలిక్కిపడుతున్నారని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట అర్బన్ మండల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీకి చెందిన మేస్త్రీలు ఇటీవల తనను కలిసినప్పుడు తెలంగాణ అభివృద్ధిలో చెమట చుక్కలు కార్చిన ప్రతి ఒక్కరూ తమ బిడ్డలేనని చెప్పానన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఇక్కడే ఉండాలని వారికి సూచించానన్నారు. 'ఆనాడు ఏపీకి ప్రత్యేక హోదా కోసం మీ నాయకత్వం పోరాడతాం అన్నది. ఈరోజు ఎందుకు మౌనం వహిస్తున్నారు? విశాఖ ఉక్కు కోసం ఎందుకు పోరాడటం లేదు? పోలవరం పనులు ఎందుకు పూర్తికావడం లేదన్నాను. ఇందులో ఏమైనా తప్పుందా?. నేను ప్రజల పక్షాన మాట్లాడా. ఏపీ ప్రజలు, మంత్రుల గురించి తప్పుగా మాట్లాడలేదు' అని హరీశ్‌రావు అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, వివిధ సంక్షేమ పథకాల గురించి ఆయన వివరించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా కేసీఆర్ పాలన ఉందన్నారు.

కుర్రోకుర్రు.. కేసీఆర్ పీఎం.. హరీశ్‌రావు సీఎం

ఆత్మీయ సమ్మేళనంలో సిద్దిపేట అర్బన్ మండలం నాంచారిపల్లికి చెందిన చిన్నారి మైత్రి సభావేదికపై కుర్రో కుర్రు అంటూ మంత్రి హరీశ్‌రావుకు సోది చెప్పింది. హరీశ్‌రావుకు నరదృష్టి బాగా ఉందని పేర్కొంది. నరంలేని నాలుక 40 మాటలు అంటుందని.. అవన్నీ పట్టించుకోవద్దని సూచించింది. తన నోరు సత్యమే పలుకుతుందని.. తన మాట తప్పదంటూ దేశానికి కేసీఆర్ పీఎం కావాలనుకుంటే హరీశ్‌రావు రాష్ట్రానికి సీఎం కావాలని ఆ చిన్నారి సోది చెప్పింది.

హరీశ్.. భజన శాఖ తీసుకో!


▶ మొదటి పేజీ తరువాయి

అభయహస్తం అటకెక్కించినందుకా..? ఆమ్ ఆద్మీ బీమా యోజన తొలగించినందుకా? స్వశక్తి సంఘాల పిల్లలకు స్కాలర్‌షిప్ తీసివేసినందుకా? వడ్డీ లేని రుణాలు ఇవ్వకుండా మహిళలను మోసం చేసినందుకా? ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించినందుకా? దళితబంధు రూ.17,700 కోట్లు కేటాయించి ఏడాది పూర్తయినా విడుదల చేయనందుకా..? ఎందుకు రుణం తీర్చుకోవాలి.. క్షీరాభిషేకాలు ఎందుకు చేయాలి?'అని భట్టి మండిపడ్డారు.

అధికారంలోకి వస్తే ప్రాణహిత – చేవెళ్ల

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి నీటిని లక్ష్మీకాలువ, సరస్వతి కాలువ, కాకతీయ కాలువల్లో పారించి కాళేశ్వరం ద్వారా ఇస్తున్నామని బీఆర్ఎస్ గొప్పలు చెప్పడం సిగ్గుచేటని, రూ.1.25 లక్షల కోట్లతో కాళేశ్వరం నిర్మించామనడం తగదని, సీఎల్పీ నేత విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును నిర్మిస్తామన్నారు. తెలంగాణ ప్రజలకు మాయమాటలు చెబుతూ ఇదే రోల్‌మోడల్ అంటూ ప్రచారం చేసుకుంటున్న బీఆర్ఎస్.. దేశంలో కూడా ఇదే మాదిరిగా సంపద దోపిడీకి ప్రయత్నిస్తోందని భట్టి ఆరోపించారు.

హైదరాబాద్‌లో మతసామరస్యం నెలకొల్పింది టీడీపీయే



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో మత సామరస్యాన్ని నెలకొల్పిన ఘనత టీడీపీదే నని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్టీఆర్ భవన్లో సోమవారం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. కర్ఫ్యూ సిటీని వ్యాక్సిన్ తయారు చేసే కేంద్రంగా అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బక్కని నర్సింహులు, కె.రాం మోహన్‌రావు, జ్యోత్స్న పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఏం జరుగుతోంది?

కాంగ్రెస్ నేతలను ఆరా తీసిన రాహుల్‌గాంధీ



శంషాబాద్‌లో రాహుల్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాణిక్‌రావు, రేవంత్

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలంగాణలో రాజకీయాలపై ఆరా తీశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీల పనితీరు, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల విషయాలను పార్టీ నేతలను అడిగి తెలుసుకున్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలు, మైనార్టీల మొగ్గు, ఓబీసీల జనగణన వంటి అంశాలపై చర్చించారు. సోమవారం మధ్యాహ్నం కర్ణాటకలోని బీదర్ జిల్లా బాల్కిలో ఎన్నికల ప్రచారం ముగించుకుని ఢిల్లీ వెళ్తూ మార్గమధ్యలో ఆయన శంషాబాద్ విమానాశ్రయంలో ఆగారు. కొద్దిసేపు రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో భేటీ అయ్యారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ముఖ్య నేతలు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, వి.హనుమంతరావు, మధుయాష్కీగౌడ్, ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్ జావెద్, రోహిత్‌చౌదరిలు పాల్గొన్నారు.

జాతీయ నాయకులొస్తే బాగుంటుంది..

రాష్ట్రంలో హాథ్‌సే హాథ్ జోడో యాత్రలు జరుగుతున్న తీరు గురించి రాహుల్ అడిగి తెలుసుకున్నారు. యాత్రలు బాగా జరుగుతున్నాయని, అయితే వీటికి జాతీయ స్థాయి నేతలు హాజరయితే బాగుంటుందని రేవంత్‌రెడ్డి కోరినట్టు తెలిసింది. ఇందుకు రాహుల్ సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వంపై రోజురోజుకూ పెరుగుతున్న వ్యతిరేకతను కాంగ్రెస్ పార్టీవైపు మరల్చుకునే విషయంలో ఎలాంటి కార్యాచరణను అమలు చేస్తారన్న దానిపై కూడా రాహుల్ చర్చించారు. బీజేపీ కార్యకలాపాలపై కూడా ఆరా తీశారు.

మైనార్టీలు..ఓబీసీల జనగణన..

ముఖ్యంగా రెండు ఆసక్తికరమైన అంశాలపై చర్చ జరిగినట్టు తెలిసింది. రాష్ట్రంలో మైనార్టీల మూడ్ ఎలా ఉందని, ఆ వర్గాలు ఎటువైపు మొగ్గ చూపే అవకాశముందని రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా ప్రశ్నించినట్టు సమాచారం. దీంతో హైదరాబాద్ అర్బన్ ప్రాంతంలోని మైనార్టీలు ఎక్కువగా ఎంఐఎం వైపే ఉంటారని, గ్రామీణ జిల్లాల్లోని మైనార్టీలు మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అండగా ఉంటారని రాష్ట్ర నేతలు తెలిపారు. అయితే బీజేపీపై కాంగ్రెస్ పోరాటం, రాహుల్ గాంధీపై అనర్హత వేటు లాంటి అంశాల నేపథ్యంలో ఈసారి మైనార్టీల ఓటు బ్యాంక్ కాంగ్రెస్ పార్టీ వైపే ఎక్కువగా మరలే అవకాశముందని నేతలు వివరించారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఓబీసీల జనగణన అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ జనగణనకు కట్టుబడి ఉందన్న అంశాన్ని ప్రజలకు చెప్పాలని రాహుల్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ విధానం అనుకూలంగా ఉన్నందున అన్ని రాష్ట్రాల పీసీసీలతో తీర్మానాలు చేయించాలని, దీంతో ఓబీసీ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా మారే అవకాశం ఉందని యాష్కీ సూచించగా, రాహుల్ సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. 30–35 నిమిషాల పాటు రాష్ట్ర నేతలతో మాట్లాడిన రాహుల్.. శాండ్‌విచ్ తిని, తేనీరు సేవించి ఢిల్లీ వెళ్లారు.

పథకాలు అందకుంటే వెతికి పట్టుకుని అందిస్తాం

పల్లెల్లో చేసిన అభివృద్ధి పనుల ఫ్లెక్సీలు పెట్టండి: మంత్రి కేటీఆర్



దుమాలలో యాదవుల మల్లన్న పట్నాల కార్యక్రమానికి హాజరైన మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: రాష్ట్రంలో ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇంకా ఎవరైనా రాని వారు ఉంటే.. వెతికి పట్టుకొని అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతే 24 గంటల కరెంట్, ఇంటింటికీ తాగునీరు, పొలాలకు సాగునీరు, అర్హులకు ఆసరా పెన్షన్లు, కల్యాణలక్ష్మీ.. ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేసుకున్నామన్నారు. దేశంలోనే బీడీ కార్మికులను పెన్షన్లు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మనదని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే ఎక్కడ కూడా రైతులకు జీవిత బీమా చేయించలేదని, ఒక్క తెలంగాణలోనే 40 లక్షల మంది రైతులకు ఏటా రూ.1,450 కోట్లు ప్రీమియం చెల్లించి బీమా చేయిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో లక్ష రైతు కుటుంబాలకు రూ.5వేల కోట్ల బీమా సాయం అందిందని వివరించారు.

31 వేల మంది గిరిజన ప్రజాప్రతినిధులు

రాష్ట్రంలో 3,416 గిరిజన తండాలను, గూడేలను గ్రామపంచాయతీలుగా చేశామని సర్పంచులను నుంచి వార్డు సభ్యుల వరకు 31వేల మంది గిరిజనులు పాలనలో భాగస్వాములయ్యారని కేటీఆర్ వెల్లడించారు. గిరిజన బిడ్డలు ఆత్మగౌరవంతో బతుకుతున్నారని, పోడు భూములకు త్వరలోనే పట్టాలు ఇస్తామని తెలిపారు. గ్రామాల్లో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులను వివరిస్తూ.. పల్లెల్లో పెద్ద పెద్ద ఫ్లెక్సీలు పెట్టాలని సర్పంచులను మంత్రి కోరారు.

మిషన్ భగీరథ నీళ్లు వస్తలేవు సారూ.. స్పందించిన కేటీఆర్.. కలెక్టర్‌కు ఆదేశాలు

జిల్లాలోని బాకూర్‌పల్లితండాలో ప్రభుత్వం చేసిన పనులను వివరిస్తూ.. మంత్రి కేటీఆర్ మీకు మిషన్ భగీరథ నీళ్లు వస్తలేవా? అని మహిళలను ప్రశ్నించారు. వస్తలేవంటూ.. మహిళలు చెప్పడంతో కేటీఆర్ స్పందించారు. 'ఎందుకు రావడం లేదు.. పైపులైన్ వేశాం, ట్యాంకు కట్టాం.. కారణం ఏంటి..? సాయంత్రంలోగా మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి నాకు నివేదిక ఇవ్వాలని'కలెక్టర్‌ను ఆదేశించారు. స్థానిక సర్పంచ్ స్పందించి.. 'ఇక్కడ బోర్లు ఉన్నాయి.. బోరు నీళ్లే వాడుకుంటున్నారు.. మిషన్ భగీరథ నీళ్లు తాగడం లేదని'అన్నారు. 'ప్రభుత్వం వేసినా మీరు తాగకుంటే ఎలా.. బోరు నీరు తాగితే ఆరోగ్య సమస్యలు వస్తాయి. మీ ఇష్టమని'కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రెండు ఎకరాల్లో గిరిజన భవన్‌ను కట్టుకుందామన్నారు.

అసమ్మతిపై బీఆర్ఎస్ ఆరా!

▶ మొదటి పేజీ తరువాయి

విస్తృత స్థాయిలో నిర్వహించాలని కేసీఆర్ ఆదేశించారు. దీంతో ఆత్మీయ సమ్మేళనాల గడువును మే నెలాఖరుదాకా పొడిగిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రకటించారు. ఇప్పటి వరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు 60 శాతం మేర పూర్తయినట్లు తెలంగాణ భవన్ వర్గాలు వెల్లడించాయి.

పార్టీకి నష్టం వాటిల్లకుండా..

నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణ బాధ్యతను మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలకు అప్పగించారు. జిల్లాల వారీగా పార్టీ తరఫున ఇన్‌చార్జిలను కూడా నియమించారు. ఈ మేరకు జరుగుతున్న ఆత్మీయ సమ్మేళనాల వివరాలను జిల్లా ఇన్‌చార్జిలు ఎప్పటికప్పుడు కేటీఆర్‌కు నివేదిస్తున్నారు. అయితే ఇటీవల.. కొంతకాలంగా అసమ్మతి గళం విన్పిస్తున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ఏడాదిలో ఈ తరహా నేతలతో పార్టీకి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కేసీఆర్ నిర్ణయించారు. మొత్తంగా ఆత్మీయ సమ్మేళనాలు కొనసాగుతున్న తీరుపై ఈ నెల 27లోగా నివేదికలు ఇవ్వాలని కేటీఆర్ ఆదేశించారు.

40కి పైగా నియోజకవర్గాల్లో అసంతృప్తి!

ఇప్పటికే సుమారు 40కి పైగా నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో టికెట్ ఆశిస్తున్న నేతలు.. ఆత్మీయ సమ్మేళనాలకు దూరంగా ఉంటున్నట్లు గుర్తించారు. ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్, నల్లగొండ, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో ఈ తరహా పరిస్థితి ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. దీంతో వారి అసంతృప్తికి కారణాలు తెలుసుకోవాలని జిల్లా ఇన్‌చార్జిలకు ఆదేశాలు వెళ్లాయి. చాలా నియోజకవర్గాల్లో వివిధ సందర్భాల్లో పార్టీలో చేరిన ముఖ్య నేతలు, ఆ తర్వాత స్తబ్దుగా ఉండటానికి గల కారణాలపై జిల్లా ఇన్‌చార్జిలు ఆరా తీస్తున్నారు. అలాగే ఇతర పార్టీల నుంచి నేతల చేరికతో పార్టీలో మొదటి నుంచి పని చేస్తున్న నేతలు దూరంగా ఉండటంపైనా బీఆర్ఎస్ అంతర్గతంగా పోస్ట్‌మార్టమ్ చేస్తోంది.

పార్టీ ప్రతినిధుల సభకు బదులు..

ఈ నెల 25న పార్టీ ముఖ్య నేతలతో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నారు. మరోవైపు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న ఎల్‌బీ స్టేడియంలో సుమారు 6వేల మంది ముఖ్య నేతలతో పార్టీ ప్రతినిధుల సభ నిర్వహిస్తామని తొలుత ప్రకటించారు. అయితే ప్రతినిధుల సమావేశానికి బదులుగా అదేరోజు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ సర్వసభ్య సమావేశం కేసీఆర్ అధ్యక్షతన జరగనుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లతో పాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గం ఈ భేటీలో పాల్గొంటుంది. సుమారు 300 మంది ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరవుతారని తెలంగాణ భవన్ వర్గాలు వెల్లడించాయి. 2023 చివరలో జరిగే రాష్ట్ర అసెంబ్లీ, 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేయడం లక్ష్యంగా ఈ సమావేశం ఉంటుందని సమాచారం. జనరల్ బాడీ మీటింగ్ తర్వాత ఎన్నికల సన్నాహాలతో పాటు దిద్దుబాటు చర్యలు వేగవంతమవుతాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ప్రధాని వస్తే సీఎంకు తీరిక లేదా?

- పక్క రాష్ట్రంలో మాత్రం మీటింగ్‌లు పెడతారు... అధికారయావ తప్ప అభివృద్ధి ధ్యాస లేదు
- సీఎం కేసీఆర్‌పై కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపాటు



సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి వస్తే.. కలిసేందుకు తీరికలేని ముఖ్యమంత్రి కేసీఆర్, మహారాష్ట్రలో బీఆర్ఎస్ విస్తరించాలన్న ఆకాంక్షతో గాలిలో దీపం పెట్టినట్లు.. అక్కడ మీటింగ్‌లు పెడుతున్నారన్నారని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. భద్రాచలంలో శ్రీరామ కల్యాణోత్సవానికి హాజరై ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించేందుకు తీరికలేని కేసీఆర్‌కు.. రంజాన్ సందర్భంగా వేషాలు మార్చుకుంటూ ఇఫ్తార్ విందుల్లో పాల్గొనేందుకు సమయం దొరుకుతోందని ఎద్దేవా చేశారు. ఏప్రిల్ 20, 21 తేదీల్లో ఢిల్లీలో గ్లోబల్ బుద్ధిస్ట్ సమిట్–2023 జరగనున్న నేపథ్యంలో.. కిషన్‌రెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో మోసపూరిత హామీలతో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కల్వకుంట్ల కుటుంబానికి... మరోసారి అధికారంలోకి రావాలనే ఆలోచనే తప్ప.. తెలంగాణ అభివృద్ధి కోసం ఏదైనా చేయాలనే ధ్యాసే లేదని మండిపడ్డారు. తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించటం మాత్రమే కేసీఆర్‌కు తెలుసని, కేంద్రం అందించే సహకారాన్ని అందిపుచ్చుకునే ఆలోచన ఎంత మాత్రమూ లేదన్నారు. కేంద్రం చిత్తశుద్ధితో రాష్ట్ర పురోగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలను రాష్ట్రంలో అమలు చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ తన లేఖల పర్వం కొనసాగుతోందన్నారు.

కేసీఆర్‌కు కిషన్‌రెడ్డి లేఖ

తెలంగాణలో అడవుల పెంపకంతోపాటు అడవుల సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పార్కులు, జంతుప్రదర్శన శాలల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద విడుదల చేస్తున్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కేసీఆర్‌కు కిషన్‌రెడ్డి లేఖ రాశారు.

బీఆర్ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదు: ఠాక్రే



ఇఫ్తార్‌విందులో పాల్గొన్న ఉత్తమ్, జగ్గారెడ్డి, ఠాక్రే జీవన్‌రెడ్డి, అజారుద్దీన్, వీహెచ్


సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పార్టీ పొత్తు ఉండబోదని రాహుల్ గాంధీ గతంలోనే చెప్పారని మాణిక్‌రావుఠాక్రే స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి దుష్ప్రచారం చేస్తున్నాయనీ ఈ విషయాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళతామని చెప్పారు. ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి సోమవారం ఇచ్చిన ఇఫ్తార్ విందులో పాల్గొనేందుకు సంగారెడ్డికి వచ్చిన ఠాక్రే మీడియాతో మాట్లాడారు. దళిత సీఎం అంటూ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. ఠాక్రే వెంట ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎంపీ ఉత్తమ్, నేతలు వి.హన్మంత్ రావు, అజారుద్దీన్, పొన్నాల లక్ష్మయ్య, రోహిత్ చౌదరి, మధుయాష్కిగౌడ్, మహేశ్‌కుమార్‌గౌడ్, కుసుమ్‌కుమార్ ఉన్నారు. కాగా, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేరిక విషయమై విలేకరులు అడగగా, పార్టీలోకి ఎవరైనా రావచ్చని, పొంగులేటి వస్తే ఆహ్వానిస్తామన్నారు.

నోటీసులిచ్చి అరెస్టులా?

వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐకి తెలంగాణ హైకోర్టు ప్రశ్న

నేటి సాయంత్రం 4 గంటల తర్వాతే ఎంపీ అవినాశ్‌రెడ్డిని విచారణకు పిలవాలి

- అప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని దర్యాప్తు సంస్థకు ఆదేశం
- విచారణకు సహకరిస్తున్నా సీబీఐ తప్పుడు ప్రచారం చేస్తోంది
- వివేకా హత్యకు ప్రధానంగా నాలుగు కారణాలున్నాయి..
- ఆర్థిక విభేదాలు, కుటుంబ తగాదాలు, మహిళలతో అక్రమ సంబంధాలు, రాజకీయ అంశాలు
- హైకోర్టుకు నివేదించిన అవినాశ్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని మంగళవారం సాయంత్రం 4 గంటల తర్వాతే విచారణకు పిలవాలని, అప్పటివరకు ఆయనపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని సీబీఐని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. 160 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చి ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించింది. వాదనలు విన్న అనంతరం అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను నేటికి వాయిదా వేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందర్‌రెడ్డి హత్య కేసును సీబీఐ విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో సీబీఐ తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోరుతూ ఎంపీ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సురేందర్ సోమవారం మధ్యాహ్నం 3.45 గంటలకు విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. వైఎస్ వివేకా హత్యకు ప్రధానంగా నాలుగు కారణాలున్నాయని న్యాయస్థానానికి నివేదించారు. ఒకటి.. ఆర్థికపరమైన విభేదాలు, రెండు.. కుటుంబ తగాదాలు, మూడోది.. మహిళలతో అక్రమ సంబంధాలు, నాలుగు.. రాజకీయ అంశాలున్నట్లు తెలిపారు.

ఇతర కోణాలు చాలా ఉన్నాయి..

'కిరాయి హంతకుడు దస్తగిరి వాంగ్మూలం మినహా ఎలాంటి ఆధారం లేకుండా అరెస్టులు చేయడం చట్టవిరుద్ధం. ఇప్పటివరకు మెటీరియల్‌ను మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టలేదు. 2021 అక్టోబర్ 26న సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ఏ-1 నుంచి ఏ-4 వరకు నిందితులుగా పేర్కొంది. 2022 జనవరి 31న అనుబంధ చార్జిషీట్ దాఖలు చేస్తూ ఏ-1 నుంచి ఏ-5 వరకు నిందితులుగా పేర్కొంది. సీఆర్‌పీసీ 160 కింద పిటిషనర్‌కు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే జనవరి 28, ఫిబ్రవరి 24, మార్చి 10, మార్చి 14వతేదీల్లో 160 సీఆర్‌పీసీ కింద విచారణకు హాజరైన పిటిషనర్ వాంగ్మూలాన్ని సీబీఐ రికార్డు చేసింది. తనను సీబీఐ చిత్రహింసలకు గురిచేస్తోందని నిజం చెబుతానని దస్తగిరి పేర్కొనడంతో గంగిరెడ్డి వారించారని, భయపడాల్సిన పనిలేదని, మన వెనుక అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి ఉన్నారని చెప్పినట్లు సీబీఐ పేర్కొంది. అంటే దస్తగిరిని చిత్రహింసలకు గురి చేసినట్లు తెలుస్తోంది. అందుకే సీబీఐ చెప్పినట్లు వాంగ్మూలం ఇచ్చాడు. 2022 ఆగస్టులో సీబీఐకి అనుకూలంగా దస్తగిరి వాంగ్మూలం ఇవ్వడంతో రెండు నెలలు తిరగకుండానే అక్టోబర్‌లో ముందస్తు బెయిల్‌కు పూర్తిగా సహకరించింది. పిటిషనర్ పార్లమెంట్ సభ్యుడు. ఆయన పరువుకు భంగం కలిగేలా దర్యాప్తు సంస్థ వ్యవహరిస్తోంది. నిందితుడిగా పేర్కొంటూ మీడియాకు స్టేట్‌మెంట్లు ఇస్తోంది. పిటిషనర్ తండ్రి భాస్కర్‌రెడ్డి 75 ఏళ్ల వయసులో ఆరోగ్యం సహకరించకున్నా కడపలో సీబీఐ విచారణకు హాజరయ్యారు. స్పష్టమైన ఆధారాలు లేనప్పుడు నిందితులకు బెయిల్ ఇవ్వాలని గత తీర్పులు చెబుతున్నాయి. అసలు ఈ కేసులో ఆర్థిక, కుటుంబ, ఇతర తగాదాలు చాలా ఉన్నాయి. ఆ కోణంలో సీబీఐ కనీసం పరిశోధన చేయడం లేదు. వివేకా చాలా కాలం నుంచి రాజకీయాల్లో ఉన్నారు. ఇందులో ఆయన వ్యతిరేకుల హస్తం కూడా ఉండవచ్చు' అని నిరంజన్‌రెడ్డి నివేదించారు.

దస్తగిరి బెయిల్‌పై సునీత మౌనం..

'వివేకాను హత్య చేసేందుకు నగదు తీసుకున్నానని, గొడ్డలి కూడా కొనుగోలు చేశానని దస్తగిరి ఒప్పుకున్నాడు. హంతకుడైన దస్తగిరిని కనీసం కస్టడీలోకి తీసుకుని విచారించకుండానే క్షమించడం చట్ట విరుద్ధం. అతడికి ముందస్తు బెయిల్ ఇచ్చినా, అప్రూవర్‌గా పేర్కొన్నా వివేకా కుమార్తె సునీత కలుగజేసుకోవడం లేదు. అవినాశ్, భాస్కర్‌రెడ్డి దాఖలు చేసే పిటిషన్లలో మాత్రమే ఆమె ఇంప్లీడ్ అవుతోంది. సీబీఐ చెప్పినట్లుగా ఆమె వ్యవహరిస్తున్నారు. వైఎస్ వివేకా తన వారసుడిగా రెండో భార్య కుమారుడిని ప్రకటించారు. ఈ విషయంలో మొదటి భార్య, సునీత, అల్లుడితో తీవ్ర మనస్పర్థలు చోటుచేసుకుని తారస్థాయికి చేరాయి. మరోవైపు గంగిరెడ్డితో వివేకాకు నగదుకు సంబంధించిన విభేదాలు కూడా ఉన్నాయి. తన తల్లిని వివేకా లైంగికంగా వేధించారని సునీల్ యాదవ్ చెప్పాడు. ఆ క్రమంలో వివేకాపై సునీల్‌కు పగ ఉంది. ఇలాంటి వివాదాల నేపథ్యంలో జరిగిన హత్యపై ఏ ఒక్క అంశాన్ని సీబీఐ నిర్ధారణ చేసుకోలేదు. ఈ కేసులో సీబీఐ గత దర్యాప్తు అధికారిపై కూడా తీవ్ర ఆరోపణలు వచ్చాయి. విచారణను తప్పుదారి పట్టిస్తున్నారంటూ ఆయనపై స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎఫ్‌ఐఆర్ కూడా నమోదైంది. ఇది అక్కడి కోర్టులో పెండింగ్‌లో ఉంది' అని నిరంజన్‌రెడ్డి తెలిపారు.

రంగన్న స్టేట్‌మెంట్ ఎందుకు పరిగణనలోకి తీసుకోరు..?

'వివేకా వాచ్‌మన్ రంగన్న స్టేట్‌మెంట్‌ను సీఆర్‌పీసీ సెక్షన్ 161, 164 కింద దర్యాప్తు సంస్థ రికార్డ్ చేసింది. దాని ప్రకారం హత్య జరిగిన రోజు రంగన్న నిద్రలో ఉండగా అకస్మాత్తుగా పాత్రలు, ఇనుప రాడ్ పడిపోవడం లాంటి శబ్దాలు వినపడటంతో పార్క్ వైపు ఉన్న ద్వారం పక్క కిటికీ నుంచి లోపలికి చూశాడు. ఎర్ర గంగిరెడ్డి, షేక్ దస్తగిరి, సునీల్ యాదవ్‌ను అతడు గుర్తించాడు. నాలుగో వ్యక్తి పొడవుగా, సన్నగా ఉన్నట్లు చెప్పాడు. వారంతా వెళ్లాక రంగన్న లోపలికి వెళ్లి చూడగా బాత్రూమ్‌లో రక్తపు మడుగులో వివేకా పడి ఉన్నారు. ఇదే విషయాన్ని రంగన్న స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నాడు. విచారణ స్థలంలో దొరికిన ఆధారాలు రంగన్న చెప్పిన వివరాలతో సరిపోలడంతో పాటు బలాన్ని చేకూర్చింది. దీన్ని సీబీఐ పరిగణనలోకి తీసుకోవడం లేదు. సీసీ కెమెరాల్లో నమోదైన వీడియో ఫుటేజీని, పోలీసులు సేకరించిన మెటీరియల్‌ను సీబీఐ పరిశీలించలేదు. సీబీఐ కౌంటర్‌ను పరిగణనలోకి తీసుకుని దస్తగిరికి ముందస్తు బెయిల్ ఇవ్వడం, అప్రూవర్‌గా అనుమతించడం చట్ట వ్యతిరేకం. విచారణకు సహకరించేందుకు అవినాశ్ సిద్ధంగా ఉన్నారు. ఆయన్ను అరెస్టు చేయవద్దని సీబీఐని ఆదేశించాలి' అని నిరంజన్‌రెడ్డి కోరారు. అనంతరం సీబీఐ పీపీ వాదనలు వినిపించారు. 160 కింద నోటీసులు ఇచ్చి ఎలా అరెస్టు చేస్తారు? అని ఈ సందర్భంగా సీబీఐని న్యాయమూర్తి ప్రశ్నించారు. 'ఇప్పటికే నాలుగుసార్లు విచారణకు హాజరయ్యారు. అరెస్టు చేయలేదు. ఇప్పుడు అందుకు అవకాశం ఉందా?' అని ప్రశ్నించగా దీనికి పీపీ బదులిస్తూ.. విచారణకు హాజరయ్యారని, విచారణ మేరకు అదుపులోకి తీసుకునే చాన్స్ ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

'ఎస్‌ఆర్‌పీసీ' చైర్‌పర్సన్‌గా విజయానంద్

సాక్షి, అమరావతి: 2023-24 సంవత్సరానికి సదరన్ రీజనల్ పవర్ కమిటీ (ఎస్‌ఆర్‌పీసీ) చైర్‌పర్సన్‌గా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ నియమితులయ్యారు. ఈ మేరకు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. ఎస్‌ఆర్‌పీసీలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలు సభ్యులుగా ఉన్నాయి.



ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి బస్తాలు పోటెత్తాయి. ప్రస్తుత సీజన్‌లోనే రికార్డు స్థాయిలో రైతులు సోమవారం 65,506 బస్తాల మిర్చిని మార్కెట్‌కు అమ్మకానికి తీసుకొచ్చారు. ఫిబ్రవరి 13న 60,132 బస్తాలు విక్రయానికి రాగా, ఈసారి అంతకు మించి రావడం విశేషం. తేజా రకం మిర్చి కొనుగోళ్లకు పెట్టింది పేరైన ఖమ్మం మార్కెట్‌కు జిల్లాతో పాటు పరిసరాల్లో ఉన్న భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి కూడా రైతులు మిర్చిని తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి నుంచే రైతుల రాక ప్రారంభం కాగా, సోమవారం ఉదయానికి మార్కెట్ యార్డు నిండిపోయింది. ఈ సందర్భంగా జెండాపాటలో క్వింటాలు మిర్చికి రూ.23,500 గరిష్ట ధర నిర్ణయించగా, మోడల్ ధర రూ.21వేలు, కనిష్ట ధర రూ.17,500గా పలికింది.

దస్తగిరితో డ్రామా!

అప్రూవర్ వాంగ్మూలం ఉత్త కథే

- బెంగళూరు భూ సెటిల్‌మెంట్ జరగనే లేదు
- భూమి పత్రాలు వివేకా ఇంట్లో లేవు
- ఆ విషయాలు ఎర్ర గంగిరెడ్డికి తెలుసు
- సీబీఐ దర్యాప్తులోనే వెల్లడైన వాస్తవాలివీ
- అవన్నీ తెలిసినా దస్తగిరి చెప్పాడంటూ కట్టు కథల ఆధారంగా దర్యాప్తు



దస్తగిరి

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ఎంత బోగస్ అనేది బట్టబయలైంది. ఆ చార్జిషీట్ ఎంత కల్పితాల కట్టుకథో స్పష్టమైంది. వివేకాను హత్య చేసిన దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ఇప్పించిన అవాస్తవ వాంగ్మూలం బండారం బహిర్గతమైంది. వాంగ్మూలంలో దస్తగిరి పేర్కొన్న బెంగళూరు భూ సెటిల్‌మెంట్ వ్యవహారం పూర్తిగా ఫేక్ అని సీబీఐ దర్యాప్తులోనే నిర్ధారణ కావడం గమనార్హం. వివేకాతో ఆయన స్నేహితుడు ఎర్ర గంగిరెడ్డికి వివాదాలున్నాయని ఓ కట్టుకథను కేంద్ర బిందువుగా చేసుకుని దాన్ని వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డితో అంటగడుతూ దస్తగిరి ద్వారా సీబీఐ నడిపించిన డ్రామా గుట్టు వీడింది.

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

దోషులని నిర్ణయించుకుని.. అదే లక్ష్యంగా దర్యాప్తు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కొందరిని దోషులుగా నిర్ణయించుకుని, అదే లక్ష్యంగా దర్యాప్తు చేస్తోంది తప్ప.. అసలు నేరస్తులను పట్టుకునే ప్రయత్నం చేయడంలేదని మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌ల న్యాయవాదులు సీబీఐ కోర్టులో వాదనలు వినిపించారు. వాదనలు విన్న సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి సీహెచ్ రమేశ్‌బాబు తీర్పును మంగళవారానికి వాయిదా వేశారు.

భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ కస్టడీ పిటిషన్‌తో పాటు ఉదయ్‌కుమార్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సోమవారం కోర్టులో వాదనలు జరిగాయి. భాస్కర్‌రెడ్డి తరఫున ఉమామహేశ్వర్, ఉదయ్ తరఫున రవీందర్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'ఏ-4 (దస్తగిరి) చెప్పాడని వైఎస్ భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేశారు. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల నాటి నుంచి భాస్కర్‌రెడ్డి, అవినాశ్, శివశంకర్‌రెడ్డితో వివేకాకు విభేదాలున్నాయని పేర్కొన్నారు. హత్య కోసం రూ.40 కోట్లకు ఒప్పందం కుదిరిందని, రూ.కోటి ఇచ్చారని చెప్పారు. ఈ ఆరోపణలకు ఎలాంటి సాక్ష్యాలు లేవు. రిమాండ్ పిటిషన్‌లోని సబ్జెక్ట్‌ను మార్చి కస్టడీ పిటిషన్‌గా వేశారు. దీనిని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ను పాటించకుండా ఇష్టం వచ్చినట్లు పిటిషన్ దాఖలు చేశారు. ఒక్క కస్టడీ అన్న పదం తప్ప రెండు పిటిషన్లు ఒక్కటే. 75 ఏళ్ల వృద్ధుడైన భాస్కర్‌రెడ్డిని పలుమార్లు విచారణకు పిలిచారు. విచారణలో ఏం అడిగారు, ఆయన ఏ ప్రశ్నలకు సమాధానం చెప్పలేదో తెలపకుండా.. సహకరించలేదని అనడం సరికాదు. సీబీఐ కోరుకున్న విధంగా ఆయన సమాధానాలు వెల్లడించరు. అలాగే సీబీఐ దాఖలు చేసిన రెండు చార్జిషీట్లలోనూ భాస్కర్‌రెడ్డి ప్రస్తావన కూడా లేదు. ఇష్టం వచ్చినట్లు అరెస్టు చేసి నిందితుల జాబితాలో చేరుస్తున్నారు. ఇంకా ఎంత మందిని కోర్టు అనుమతి లేకుండా ఇలా చేరుస్తారో తెలియదు. సాక్షులు ఎవరన్నది కూడా పిటిషన్‌లో లేదు. తప్పుడు సాక్ష్యాలు సృష్టించి కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. భాస్కర్‌రెడ్డి వెన్నెముకకు సర్జరీ జరిగింది. చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. భాస్కర్‌రెడ్డి కస్టడీ పిటిషన్‌ను కొట్టివేయాలి' అని ఉమామహేశ్వర్ వాదించారు.

అరెస్టులతో హడావుడి

'ఉదయ్‌కుమార్‌ను ఏ నేరం కింద అరెస్టు చేశారో సీబీఐ ఎక్కడా చెప్పలేదు. సీఆర్‌పీసీ 173 ప్రకారం.. కోర్టు అనుమతి తీసుకున్న తర్వాతే ఏ-6 (ఉదయ్‌కుమార్), ఏ-7 (వైఎస్ భాస్కర్‌రెడ్డి)లను నిందితులుగా పేర్కొనాలి. కానీ కోర్టు నుంచి సీబీఐ ఎలాంటి అనుమతి తీసుకోలేదు. ఏ-6పై నమోదు చేసిన అన్ని సెక్షన్లు బెయిల్ ఇచ్చేవే. ఇప్పటికి 22 సార్లు సీబీఐ ఉదయ్‌కుమార్‌ను విచారించింది. అతని మొబైల్ తీసుకున్న అధికారులు రసీదు కూడా ఇవ్వలేదు. ఇన్నిసార్లు విచారణ జరిపి.. ఇంకా సహకరించలేదనడం హాస్యాస్పదం. తెలియని ప్రశ్నలకు సమాధానం చెప్పకపోవడం అతని హక్కు. సీబీఐ మూడేళ్లుగా విచారణ చేస్తున్నా రెండు చార్జిషీట్లు వేయడం తప్ప సాధించిన పురోగతి లేదు. సుప్రీంకోర్టు ఆదేశించిన గడువు దగ్గర పడుతుండటంతో అరెస్టులు చేస్తున్నారు తప్ప ఆధారాలను సేకరించడంలేదు. చట్టాలను పాటించడం లేదు. సీబీఐ విచారణాధికారి రాంసింగ్‌పై ఉదయ్ ఫిర్యాదు చేశారు. ఈ కేసు ఏపీ హైకోర్టులో విచారణ జరుగుతోంది. ఉదయ్‌ను చిత్రహింసలకు గురి చేస్తున్నారు. ఆయనపై మోపినవి నాన్-కాగ్నిజబుల్ నేరాలే. దీన్ని పరిగణనలోకి తీసుకుని ఉదయ్‌కి బెయిల్ ఇవ్వాలి' అని రవీందర్‌రెడ్డి వాదనలు వినిపించారు. '2017 ఎమ్మెల్సీ ఎన్నికల నాటి నుంచి వివేకాతో వైఎస్ భాస్కర్‌రెడ్డికి, శివశంకర్‌రెడ్డికి పలు విభేదాలు ఉన్నాయి. 2017లో ఎమ్మెల్సీగా పోటీ చేసిన వివేకా ఓడిపోయారు. ఈ ఓటమికి భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి కారణమని వివేకా తీవ్ర ఆగ్రహంతో ఉండేవారు. హత్య చేసిన వారు కూడా భాస్కర్‌రెడ్డికి, శివశంకర్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు' అని సీబీఐ పీపీ వాదనలు వినిపించారు.

వివేకా హత్య కేసులో సీబీఐ ఆరోపణలకు సాక్ష్యాలు లేవు

- రెండు చార్జిషీట్లలోనూ భాస్కర్‌రెడ్డి ప్రస్తావన కూడా లేదు
- కోర్టు అనుమతి లేకుండా నిందితుల జాబితాలో ఎలా చేరుస్తారు?
- కస్టడీ పిటిషన్‌లో ఏమీ లేదు.. రిమాండ్ పిటిషన్‌నే అలా మార్చారు
- సీబీఐ కోర్టులో భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ వాదనలు
- కస్టడీ పిటిషన్ కొట్టేయాలని భాస్కర్‌రెడ్డి వినతి
- బెయిల్ మంజూరు చేయాలని ఉదయ్‌కుమార్ అభ్యర్థన
- తీర్పు నేటికి వాయిదా

అయినా.. సీబీఐ తీరు మారలేదు

బృందం కొత్తదైనా... మునుపటి తప్పటడుగుల జాడల్లోనే దర్యాప్తు

సాక్షి, అమరావతి: 'న్యాయం జరగటమే కాదు. న్యాయం జరుగుతున్నట్లు కనిపించాలి' 'ఈ కేసులో రాజకీయ కోణాన్ని నిరూపించే ఒక్క ఆధారాన్ని కూడా సీబీఐ సేకరించలేదు. సీబీఐ దర్యాప్తు సమగ్రంగా లేదు'... ఇవీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఇటీవల రెండు సందర్భాల్లో దేశ సర్వోన్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు. సీబీఐ విచారణ తీరుపై ఈ వ్యాఖ్యలు చేయటంతోనే సుప్రీంకోర్టు సరిపెట్టలేదు. దర్యాప్తు ఎలా చేయాలో స్పష్టత ఇస్తూ... దర్యాప్తు అధికారిని మార్చాలని సీబీఐని ఆదేశించింది కూడా. సీబీఐ అన్ని కోణాలనూ దర్యాప్తు చేయటం లేదని, కొందరిని దోషులుగా తేల్చాలన్న నిర్ణయాన్ని ముందే తీసేసుకుని దానికి తగ్గట్టుగా దర్యాప్తు చేస్తున్నట్లు కనిపిస్తోందని కేసులో నిందితుడైన శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ పిటిషన్ వేశారు. దానిపై సుప్రీంకోర్టు స్పందిస్తూ పైవ్యాఖ్యలు చేసింది. దర్యాప్తు అధికారిని మార్చాలని సీబీఐని ఆదేశిస్తూ పిటిషనర్‌కు ఊరటనిచ్చింది. దాని ప్రకారమే ఐదుగురు సభ్యుల సీబీఐ బృందం కొత్తగా ఏర్పాటయింది. కానీ మునుపటి దర్యాప్తు అధికారి ఎక్కడైతే ఆగారో అక్కడి నుంచి దర్యాప్తు చేస్తున్నట్టుగా ఈ బృందం నేరుగా వైఎస్ అవినాశ్ రెడ్డిని, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నట్టు గడిచిన రెండుమూడు రోజులుగా జరుగుతున్న పరిణామాలు చెప్పకనే చెబుతున్నాయి. మరి ఇలాగైతే సుప్రీంకోర్టు తీర్పువల్ల పిటిషనర్‌కు ఏం ఊరట కలిగినట్టు? అసలు పిటిషనర్ లేవనెత్తిన అంశాలను పరిశీలించాలన్న ఉద్దేశంతోనే కదా సుప్రీంకోర్టు కొత్త బృందాన్ని ఏర్పాటు చేయమన్నది. మరి ఆ బృందం కనీసం ఆ అంశాలవైపు చూడకుండా పాత దర్యాప్తుకు కొనసాగింపుగా చేసుకుంటూ పోతే ఏమనుకోవాలి? సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తిని సీబీఐ ఖాతరు చేయాల్సిన అవసరం లేదా? వివేకానందరెడ్డి హత్యకు బలమైన కారణాలుగా భావిస్తూ తులసమ్మ లేవనెత్తిన నాలుగు కీలక కోణాలను అసలు పట్టించుకోవడమే లేదెందుకు? ఇలాగైతే బాధితులకు న్యాయం జరుగుతుందా?

దర్యాప్తు అసమగ్రం..

ఓ కేసులో దర్యాప్తు అధికారిని మార్చాలని సుప్రీంకోర్టు ఆదేశించడం అత్యంత అరుదు. వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తులో సుప్రీంకోర్టు అటువంటి అసాధారణ నిర్ణయాన్నే తీసుకుంది. ఈ కేసు దర్యాప్తు సమగ్రంగా లేదని భావించటంతో... న్యాయసూత్రాల ఆధారంగా దర్యాప్తు ఎలా చేయాలో చెప్పటమే కాక, దర్యాప్తు అధికారిగా ఉన్న అదనపు ఎస్పీ రాంసింగ్‌ను తొలగించమని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో డీఐజీ కేఆర్ చౌరాసియా నేతృత్వంలో ఎస్పీ వికాస్ సింగ్, అదనపు ఎస్పీ ముకేశ్ కుమార్‌లతో కొత్త బృందాన్ని సీబీఐ నియమించింది.

పాత బృందం తప్పటడుగుజాడల్లోనే...

పాత దర్యాప్తు బృందాన్ని మార్చమని సుప్రీంకోర్టు చెప్పిందంటేనే ... ఆ బృందం చేసిన దర్యాప్తు సక్రమంగా లేదని కదా!. వివేకాను హత్య చేసిన దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి, అతని వాంగ్మూలం ఆధారంగానే పాత దర్యాప్తు బృందం విచారణ కొనసాగించింది. ఆ దర్యాప్తు నివేదికలో ఎలాంటి ఆధారాలూ లేవని సుప్రీంకోర్టు చెప్పింది. దానర్థం అప్పటివరకు దర్యాప్తులో పట్టించుకోని కొత్త కోణాలను గుర్తించి, తగిన సాక్ష్యాలను సేకరించమని సుప్రీం కోర్టు చెప్పినట్టే కదా!. కానీ అది సీబీఐకి వినిపించలేదు. సీబీఐ కొత్త దర్యాప్తు బృందం కూడా హంతకుడైన దస్తగిరి వాంగ్మూలం చుట్టూనే దర్యాప్తును పరిమితం చేస్తోంది. అసలు వాస్తవాల జోలికి పోవటమే లేదు. దానికి తార్కాణాలివిగో...

కనీసం విచారించకుండానే అరెస్టులా...!?

ఉదయ్ కుమార్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిలను సీబీఐ అరెస్టు చేసిన తీరు సహజ న్యాయసూత్రాలకు పూర్తిగా విరుద్ధం. ఎందుకంటే ఏ నిందితుడినైనా విచారించకముందు అరెస్టు చేయటమనేది ఉండదు. కానీ ఈ దర్యాప్తు బృందం వారిని విచారించకుండానే అరెస్టు చేసేసింది. తాను విచారణకు సిద్ధంగా ఉన్నానని, పూర్తిగా సహకరిస్తానని భాస్కర్‌రెడ్డి మొదటి నుంచీ చెబుతున్నారు. పాత దర్యాప్తు బృందం ఓసారి ఆయన్ను విచారణకు రావాలని ఫోన్ చేసి పిలిచింది. దాంతో కడప జైలు వద్ద సీబీఐ అధికారుల కార్యాలయానికి వెళ్లారు. చాలాసేపు నిరీక్షించినా సీబీఐ ఆయన్ని విచారణకు పిలవ లేదు. పైగా నోటీసులివ్వకుండా ఎందుకు వచ్చారన్నట్టు మాట్లాడారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి పుట్టినరోజు, పెళ్లి రోజు ఒకేరోజు. గత 20ఏళ్లుగా ఆ రోజున తీర్థయాత్రకు వెళుతున్నారు. ఈ ఏడాది కూడా సీబీఐ అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకుని వెళ్లారు. అంటే సీబీఐ అధికారుల విచారణకు ఆయన మొదటి నుంచీ పూర్తిగా సహకరిస్తూనే ఉన్నారు. అటువంటి భాస్కర్‌రెడ్డిని కొత్త దర్యాప్తు బృందం కనీసం విచారించకుండానే నేరుగా వచ్చి అరెస్టు చేయడం విస్మయపరుస్తోంది. నోటీసులిచ్చి విచారించిన తరువాతే తదుపరి చర్యలు తీసుకోవాలన్న కనీస నిబంధనను కూడా పట్టించుకోలేదు. పైగా ఆయన విచారణకు సహకరించడం లేదని కోర్టులో చెప్పటం చూస్తే... విచారణ ఏ రీతిన సాగుతోందో అర్థమవుతుంది. అసలు ఆయన్ని విచారించేందుకు నోటీసే ఇవ్వని సీబీఐ ఆయన విచారణకు సహకరించడం లేదని ఎలా చెబుతుంది? పైగా వైఎస్ భాస్కర్‌రెడ్డిని ఏకపక్షంగా అరెస్టు చేశాక.. విచారణ కోసం 10 రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరడం ఉద్దేశపూర్వకంగా వేధించటానికేనని స్పష్టంకాక మానదు.

ఉదయ్‌కుమార్‌రెడ్డిని కూడా అదే రీతిలో...

ఈ కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ప్రమేయం ఉన్నట్టుగా చెప్పాలని దర్యాప్తులో భాగంగా రాంసింగ్ తనను వేధించారని గతంలో ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలో కొత్త దర్యాప్తు బృందం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఎవరైనా భావిస్తారు. కానీ కొత్త బృందం ఉదయ్‌ని కనీసం విచారించకుండా... ఆయన ఆరోపణకు ఆధారం ఏమిటో అడగకుండా పులివెందులలోని ఆయన ఇంటికి నేరుగా వచ్చి... తమతో కడప రావాలని చెప్పి దార్లో అరెస్టు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌కు తరలించారు.

ఒక్క కొత్త ఆధారాన్ని సేకరించనే లేదు...

సుప్రీంకోర్టు కొత్త దర్యాప్తు బృందాన్ని నియమించమని ఆదేశించిందంటే... పాత దర్యాప్తు బృందం సరిగా విచారించ లేదని తేల్చినట్టే. కాబట్టి కొత్త బృందం ఈ కేసులో అప్పటివరకు విస్మరించిన కోణాలేమైనా ఉంటే వాటిని పరిశీలించాలి. అప్పటివరకు వెలుగుచూడని సాక్ష్యాలుంటే వెలికితీయాలి. కానీ డీఐజీ చౌరాసియా నేతృత్వంలో బృందం ఈ అంశాలు వేటినీ పట్టించుకోనే లేదు. ఈ కేసులో ఒక్క కొత్త ఆధారాన్నీ సేకరించలేదు. సాక్షులెవరినీ విచారించనేలేదు. అంతకుముందు రాంసింగ్ బృందం ఏకపక్షంగా చేసిన దర్యాప్తునకు కొనసాగింపుగానే వ్యవహరిస్తోంది. ఆ తప్పటడుగుల్లోనే నడుస్తోంది. అంటే సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తిని బేఖాతరు చేస్తోంది.

రాజకీయ కోణానికి ఆధారాలేవి?

వివేకా హత్య వెనుక రాజకీయ కోణం ఉందని నిరూపించే ఒక్క ఆధారాన్నీ సీబీఐ చూపించలేకపోయిందని సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పింది. కొత్త దర్యాప్తు బృందం కూడా ఆ దిశగా ఒక్క సాక్ష్యాన్ని కూడా సేకరించనే లేదు. కానీ భాస్కర్‌రెడ్డి అరెస్టు రిమాండ్ రిపోర్ట్‌లో మాత్రం రాజకీయ అంశాలను ఏకపక్షంగా ప్రస్తావించేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయిన వైఎస్ వివేకానందరెడ్డి గతంలో భాస్కర్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారని పేర్కొనడం హాస్యాస్పదమే. పాత బృందం ఇదే మాట అంటే అసలు రాజకీయ కోణం ఉన్నదనడానికి ఆధారాలేవని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. దానికి ఒక్క ఆధారమూ చూపకుండానే ఈ బృందం కూడా అవే వ్యాఖ్యలను ఏకంగా రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించిందంటే ఏమనుకోవాలి?

భాస్కర్‌రెడ్డికి వ్యతిరేకంగా ఒక్క సాక్ష్యమూ లేదు..

ఈ కేసులో భాస్కర్‌రెడ్డికి వ్యతిరేకంగా ఒక్కరు కూడా సాక్ష్యం చెప్పనే లేదన్నది కీలకం. పైగా వైఎస్ అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిల ప్రమేయం ఉన్నట్టుగా చెప్పాలని తమను సీబీఐ వేధిస్తోందని పలువురు సాక్షులు పేర్కొన్నారు. భాస్కర్‌రెడ్డిని ఏ ప్రాతిపదికన అరెస్టు చేశారంటే... దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన వాంగ్మూలాన్నే చూపిస్తుండటం చిత్రాతిచిత్రం. ఎందుకంటే వివేకానందరెడ్డిని స్వయంగా హత్యచేసింది దస్తగిరి. 'నేనే నరికి చంపా' అని అంగీకరించింది దస్తగిరి. అలాంటి దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడమే సీబీఐ చేసిన పెద్ద పొరపాటు. ఇక దస్తగిరిని ఢిల్లీకి తీసుకువెళ్లి చిత్రహింసలు పెట్టి మరీ అప్రూవర్‌గా మార్చారని ఈ కేసులో మరో నిందితుడైన ఎర్ర గంగిరెడ్డి గతంలోనే చెప్పారు. మరోవైపు ఈ కేసులో ఇతర నిందితులను అరెస్టు చేస్తూ... వారికి బెయిల్ ఇవ్వడానికి వీల్లేదని వాదిస్తున్న సీబీఐ... వివేకానందరెడ్డిని స్వయంగా హత్యచేశానని ఒప్పుకున్న నిందితుడు దస్తగిరి బెయిల్ పిటీషన్‌ను వ్యతిరేకించకపోవడం విడ్డూరమే. ఈ అంశాలన్నింటినీ కొత్త దర్యాప్తు బృందం కనీసం విశ్లేషించనే లేదు. హంతకుడైన దస్తగిరి బయట తిరుగుతుంటే... అప్రూవర్‌గా అతనిచ్చిన అహేతుకమైన వాంగ్మూలం ఆధారంగా పలువురిని అరెస్టు చేస్తుండటమే విస్మయకరం.

ఆ నాలుగు కోణాల్లో దర్యాప్తే చేయని సీబీఐ!

ఈ కేసులో సీబీఐ అరెస్టు చేసిన శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ కీలకమైన నాలుగు అంశాలను ప్రస్తావిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆ కోణాల్లో దర్యాప్తు జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న ఆమె వాదనను న్యాయస్థానం నమోదు చేసింది కూడా. ఆమె లేవనెత్తిన అంశాలు ఇవీ...

1. వైఎస్ వివేకానందరెడ్డి రెండో వివాహంతో ఆ కుటుంబంలో ఆర్థిక విభేదాలు తలెత్తాయి.
2. వివేకానందరెడ్డికి కొందరితో ఆర్థిక లావాదేవీలు, సెటిల్‌మెంట్ వ్యవహారాలున్నాయి.
3. వివేకాకు అక్రమ లైంగిక సంబంధాలున్నాయి. దీనిపై ఆయన పట్ల కొందరు వ్యక్తిగత కక్ష పెంచుకున్నారు.
4. వివేకా రాజకీయ వారసత్వం కోసం ఆయన సొంత కుటుంబ సభ్యుల మధ్య విభేదాలున్నాయి. కాకపోతే ఈ అంశాలపై కొత్త సీబీఐ బృందం కనీసం దృష్టి కూడా పెట్టలేదు.



ప్రార్థనలో హృదయం లేని మాటల కంటే,
మాటలు లేని హృదయం నయం.

– మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, ఏప్రిల్, 18

తూటాలతో తక్షణ న్యాయం?

కంటికి కన్ను... పంటికి పన్ను లాంటి డైలాగులు, వెంటాడి వేటాడడాలు తెరపై చూస్తాం. నిజ జీవితంలో పదులకొద్దీ సాయుధ పోలీసుల కళ్ళెదుట, టీవీ కెమెరాల ముంగిట అలా జరగడం ఒళ్ళు జలదరించే అనుభవం. రాజకీయాల్లోకొచ్చిన నేరసామ్రాజ్యనేత అతీక్ అహ్మద్, ఆయన తమ్ముడు ఖాలిద్ అజీమ్ అలియాస్ అష్రాఫ్‌లు యూపీలో పోలీస్ కస్టడీలో ఉండగా, మీడియా ముసుగులో వచ్చి ముగ్గురు కుర్రాళ్ళు చంపిన తీరు అలాంటిదే. హత్యలు, అపహరణలకు పాల్పడి నూటికిపైగా కేసు లున్న నేరగాడిగా పేరుమోసిన అతీక్ జీవితంలో హింసను నమ్మి, చివరకు హింసలోనే చనిపోవడం కవితాత్మక న్యాయంగా కనిపించవచ్చు. కానీ కరడుగట్టిన నేరస్థుణ్ణి సైతం చట్టబద్ధంగా విచారించి కోర్ట్‌లో కఠినశిక్ష విధించాలి. తక్షణశిక్షలతో సత్వరన్యాయం జరపాలనిచూస్తే అన్యాయమే.

'మాఫియా కో మిట్టీ మే మిలా దూంగా' (మాఫియాను మట్టిలో కలిపేస్తాను) అని అసెంబ్లీ సాక్షిగా గర్జించిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ నెలలోనే కనీసం 3 ఎన్‌కౌంటర్లకు మౌనసాక్షి. విషాదం ఏమిటంటే, ఈ సర్కారీ ప్రేరేపిత హింసను పౌర సమాజం సైతం అభ్యంతర పెట్టకుండా, ఆమోదిస్తూ ఉండడం. పరారీలో ఉన్న అతీక్ కుమారుడు 'ఆత్మరక్షణకు పోలీసుల ఎదురుకాల్పుల్లో' గురువారం ఝాన్సీలో చనిపోతే, శనివారం రాత్రి ప్రయాగరాజ్‌లో పోలీసుల ఎదుటే కాల్పుల్లో అతీక్ ప్రాణాలు విడిచాడు. రాజకీయ ప్రత్యర్థి ఉమేశ్‌పాల్ హత్యలో తండ్రీ కొడుకులిద్దరూ నిందితులు. అతీక్ హత్యపై రిటైర్డ్ జడ్జీ సారథ్యంలో కమిషన్ వేశారు యోగి. తీరా మంత్రులే ఈ మరణాలు 'కర్మ ఫలిత'మనీ, 'దేవుడి న్యాయ'మనీ వ్యాఖ్యానిస్తుంటే ఇక విచారణలో ఏం తేలుతుంది!

అతీక్‌ను ఎవరో చంపారనీ, వ్యవస్థ ప్రమేయం లేదనీ నమ్మలేం. చట్టప్రకారం ఏప్రిల్ 13న కస్టడీకి కోర్టు అప్పగించిన వెంటనే వైద్యపరీక్షలు జరపాల్సిన పోలీసులు 15వ తేదీ రాత్రి దాకా ఎందుకు ఆలస్యం చేశారు? సాధారణ పరీక్షలకు అసాధారణంగా ఆ రాత్రివేళను ఎందుకు ఎంచుకున్నారు? సంకెళ్ళు వేయరాదని కోర్టు తీర్పులున్నా సరే ఎందుకు వేశారు? కాలిస్తే ఒకరికొకరు దూరం జరిగే వీలైనా లేకుండా హతులిద్దరికీ కలిపి ఒకే పొడవాటి సంకెల ఎందుకేశారు? ప్రాణహాని ఉన్న నేరస్థులని తెలిసినా బందోబస్తులో ఎందుకు నిర్లక్ష్యం వహించారు? ఆ సమయానికి వారు అక్కడికలా నడుచుకుంటూ వస్తారని కాల్పులు జరిపిన కుర్రాళ్ళకెలా తెలిసింది? ఘోర నేర చరిత్రలేమీ లేని వారి చేతికి ఆధునిక విదేశీ తుపాకీలెలా వచ్చాయి? ఇలా ఎన్నో ప్రశ్నలు. వెరసి, యూపీలో శాంతిభద్రతలకు టీవీ ప్రత్యక్షప్రసారాలకు చిక్కిన ఈ హత్యలే ప్రతీక. కస్టడీలోని వారికైనా కనీస భద్రత కల్పించలేని పోలీసు వ్యవస్థ ఘనతకు ఉదాహరణ.

ఇంతకీ నకిలీ ఎన్‌కౌంటర్లు, సర్కారీ ప్రేరేపిత హత్యల ద్వారా యూపీ సర్కార్ ఏ సంకేతాలు పంపాలని చూస్తోంది? పట్టుమని 17 ఏళ్ళకే కేసులకెక్కి, 60 ఏళ్ళ వయసులో ఇప్పుడు ప్రాణాలు పోగొట్టుకున్న అతీక్ ఇన్నేళ్ళుగా రాజకీయపార్టీల్లో కొనసాగుతూ, ఇష్టారాజ్యంగా దందా కొనసాగించడం 1990ల నుంచి మన రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థల పుణ్యమే. జైలుకెళ్ళినా చక్రం తిప్పిన అతీక్‌ను 2019లో గుజరాత్‌లో జైలుకు మార్చారు. ఇటీవలే యూపీకి పట్టుకొచ్చారు. తాజా ఘటనతో ఈ డాన్ కథ ముగిసింది. కానీ, చేసిన నేరాలూఘోరాలూ ఎన్నయినా, ఎంత పెద్దవైనా కావచ్చు. విచారణ లేకుండా తక్షణన్యాయమే పరిష్కారమనే ప్రభుత్వాల ధోరణి రాజ్యాంగ విహిత న్యాయసూత్రాలకే విరుద్ధం. సమదృష్టితో సాగాల్సిన వ్యవస్థలపై విశ్వాసానికి విఘాతం.

యూపీలో యథేచ్ఛగా సాగుతున్న ఎన్‌కౌంటర్లపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నాలుగేళ్ళ క్రితమే 2019 జనవరిలో ఆందోళన వ్యక్తం చేసింది. 2017 మార్చిలో యోగి సర్కార్ ఏర్పాటైనప్పటి నుంచి అలాంటి 15 కేసుల పూర్తి సమాచారాన్ని అప్పట్లోనే భారత ప్రభుత్వానికి పంపింది. ఆ కేసుల్లో బాధితులందరూ నిరుపేద మైనారిటీలే. తాజా డేటా ప్రకారం గత ఆరేళ్ళ యోగి పాలనలో 10,900కు పైగా పోలీస్ ఎన్‌కౌంటర్లు జరిగాయి. నిందితులు 183 మంది పోలీసు తూటాలకు ప్రాణాలు కోల్పోయారు. నిజానికి, నకిలీ ఎన్‌కౌంటర్లపై ఆందోళనతో జాతీయ మానవ హక్కుల సంఘం ఎప్పుడో మార్గదర్శకాలిచ్చింది. కానీ గద్దె మీది పెద్దలు తలుచుకున్నప్పుడల్లా అవి గాలికి పోతున్నాయి. వెరసి నేర న్యాయవ్యవస్థ కుప్పకూలి, పోలీస్, న్యాయ వ్యవస్థల్లో సంస్కరణలు అవసరమని గుర్తు చేస్తున్నాయి.


ఇక, గత నవంబర్‌లో అమృత్‌సర్‌లో ఓ హిందూ రాజకీయ నేత ఇలాగే మీడియా ముందు కాల్పులకు గురై చనిపోయినప్పుడు సోకాల్డ్ మేధావులు ఇంత రచ్చ చేయలేదేమిటన్నది ఓ వాదన. జరిగిన దారుణాన్ని బట్టి కాక, మతాన్ని బట్టి గగ్గోలు పెడుతున్నారనీ వారి ఆరోపణ. చిత్రంగా మారణకాండలో సైతం మతం చొచ్చుకొచ్చిన రోజులివి. అతీక్ కుమారుడు ఎన్‌కౌంటరైనప్పుడు అధికార పార్టీ యువజన విభాగం టపాసులు కాల్చి, సంబరాలు చేసుకుంది. అది ఆందోళన రేపే ధోరణి. అది మరవక ముందే ప్రాణహాని ఉందంటూ అతీక్ సుప్రీం కోర్ట్‌లో భయపడినట్టే జరిగింది. అంతకన్నా భయపడాల్సిందేమిటంటే – హతులు ముస్లిమ్‌లైనప్పుడల్లా హంతకులు జైశ్రీరామ్ నినాదాలు చేయడం. ప్రజలను వర్గాలుగా చీల్చే ఈ ప్రయత్నాలు, దేవుడి పేరు అడ్డంపెట్టి దారుణాలకు ఒడిగట్టే తీరు సమాజానికి క్యాన్సర్ కన్నా ప్రమాదకరం. ఏ వర్గం ఇలాంటి దుశ్చర్యలకు దిగినా గర్హనీయమే. 'డబుల్ ఇంజన్', 'బుల్‌డోజర్' లాంటి మాటలతో మళ్ళీ కేంద్రంలో గద్దెనెక్కదలచిన పార్టీలూ, కాబోయే ప్రధానిగా ప్రచారమవుతున్న యూపీ నేతలూ అది గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు. చైత్ర మాసం, తిథి: బ.త్రయోదశి ప.12.54 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.12.51 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ప.11.06 నుండి 12.38 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.05 వరకు తదుపరి రా.10.48 నుండి 11.34 వరకు.
అమృతఘడియలు: రా.8.14 నుండి 9.45 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం : 6.12
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఆపత్కాలంలో ఐక్యతా రాగం!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

దేశంలో వామపక్షాలు బలహీనమై పోతున్న కాలమిది. ఇదే సమయంలో మతతత్త్వ శక్తులు బలపడిపోతుండటం ప్రగతి శీల ప్రజాస్వామ్యవాదులకు ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఉభయ కమ్యూనిస్టు పార్టీల (సీపీఐ, సీపీఎం) జాతీయ నాయకత్వాలు హైదరాబాద్‌లో సమావేశమై వామపక్షాల ఐక్యత అవసరంపై చర్చించాయి. ఈ పార్టీల్లో సీపీఐ తాజాగా 'జాతీయ పార్టీ' హోదాను కోల్పోయిన సంగతి తెలిసిందే. మొత్తం మీద ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాలు వామపక్షాలు ఐక్యమైతేకాని మతతత్త్వ శక్తులను అడ్డుకోవడం సాధ్యం కాదని ప్రకటించాయి. వామపక్షాల ఐక్యత అవసరాన్ని ఎనభై ఏళ్ల క్రితమే భారత కమ్యూనిస్ట్ పార్టీ ప్రమాణ పత్రం ఒకటి నొక్కి వక్కాణించడం గమనార్హం.

"భారతదేశాన్ని 'హిందూ దేశం'గా మార్చేందుకు, భారత సెక్యులర్ రాజ్యాంగం స్థానంలో దేశాన్ని విభజించి కేవల 'హిందూ' దేశంగా మార్చే 'మనుస్మృతి'ని అమలు పరిచేందుకు ఆరెస్సెస్, బీజేపీలు ప్రయత్నిస్తు న్నాయి. మితవాద రాజకీయాలపై శక్తిమంతంగా పోరాడాలంటే దేశంలో వామపక్షాల మధ్య ఐక్యత మరింత అవసరం. దేశంలోని మితవాద రాజకీయాలపై నిరంతర పోరుకు వామపక్షాల ఐక్యత నేడు తక్షణావసరం. ఈ ఐక్యత పరస్పర విశ్వాసం ద్వారానే సాధ్యం".

– సీపీఐ, సీపీఎం పార్టీలు హైదరాబాద్‌లో తొలిసారిగా జరిపిన సంయుక్త సమావేశంలో (10.4.2023) తీసుకున్న నిర్ణయం.

వామపక్షాలైన సీపీఐ, సీపీఎంల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి 'యూనిటీ' సమావేశం వామపక్ష అభిమానులలో నూతనోత్తేజానికి కారణమయింది. ఉభయపక్షాల ఐక్యత తక్షణావసరాన్ని ఇరు పక్షాల నాయకులు, కార్యకర్తలు గుర్తించడం ముదావహం. నిజానికి ఉభయ పార్టీలూ కలవ వలసిన అవసరాన్ని కొత్తగా ఇప్పుడు గుర్తించారని చెప్పనవసరం లేదేమో. ఎనిమిది దశాబ్దాల క్రితమే కాన్పూర్ కేంద్రంగా భారత కమ్యూనిస్ట్ పార్టీ కార్యదర్శి ఎస్. సత్యభక్త కమ్యూనిస్టుల ఐక్యత కోసం తొలి ప్రమాణ పత్రాన్ని వెలువరించారు. హైదరాబాద్ కేంద్రంగా వెలువడిన ఉభయ పార్టీ (సీపీఐ, సీపీఎం)ల సంయుక్త సమావేశంలో ప్రసంగించిన సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిలు ఉగ్గడించిన 'ఉభయ పక్షాల ఐక్యత అవసరం' గుర్తించడానికి ఇన్నేళ్ల సమయం పట్టడం... ఉభయ వామ పక్షాల ఉమ్మడి వారసత్వానికి ఒక రకంగా 'మచ్చ'గానే భావించాలి. అయినా ఇప్పటికైనా ఏకపక్షంగా ఉభయపక్షాల ఐక్యతావాంఛ... అనేక సమస్యల పరిష్కారానికి ఎదురుచూస్తున్న దేశానికి శుభసూచకంగా భావించాలి.

ఈ సందర్భంగా కాన్పూర్ తొలి పార్టీ ప్రమాణ పత్రాన్ని ఎందుకు ప్రస్తావించవలసి వచ్చిందంటే, ఆ పత్రం ఆనాటికే కాదు, ఎప్పటికీ పోరాట పటిమ గల పార్టీకి ఒక బలమైన దిక్సూచిగా ఎలా నిలబడి పోయిందో గుర్తించడం కోసమే! అందులో పేర్కొన్న ప్రమాణాలలో కొన్నింటిని ఒక్కసారి పరిశీలిద్దాం:

ప్రజా శ్రేయస్సు లక్ష్యంగా లేని రాజకీయ పార్టీలు అధికారంలోకి రావాలనుకొనేది సంపాదన కోసం, అది వీలు చిక్కకపోతే ప్రజలపై నిర్బంధ విధానాల ద్వారా ఒడుపుకోవడం కోసమే గానీ ప్రజల ప్రయోజనాలను గుర్తించి వారిని సకాలంలో ఆదుకోవడానికి కాదు; ఈ పరిస్థితుల్లో వామపక్షాల బాధ్యత పెట్టుబడిదారీ శక్తుల తరఫున కొమ్ము కాయడం కాదు, ఆ కొమ్ములను విరిచి ప్రజాబాహుళ్యం మౌలిక అవసరాలైన తిండి, బట్ట, వసతి, ఉపాధి సౌకర్యాలను కల్పించడం. తద్వారా ప్రజలు తమ కష్టార్జితాన్ని తాము స్వేచ్ఛగా

రెండో మాట



అనుభవించడానికి దోపిడీకి తావు లేకుండా చేయడం కమ్యూనిస్టుల విధిగా ఉండాలి. ఇదీ స్థూలంగా 1924 నాటి కాన్పూర్ డాక్యుమెంట్ ఆదేశించింది. ఆ 'ప్రమాణ పత్రం' మకుటం కూడా 'సత్యభక్త, భారతీయ సామ్యవాది దళ్' (ది ఇండియన్ కమ్యూనిస్ట్ పార్టీ) అనీ, 'సత్యవాది' అనీ! 1924 నాటి భారత కమ్యూనిస్ట్ పార్టీ కొన్ని సమస్యల్ని ఎంతగా మనసు విప్పి బాహాటంగా ప్రకటించిందో చూడండి:

'సమాజంలో నాయకులకు, రాజకీయవేత్తలకు, మత ప్రవక్తలకు, సంఘ సంస్కర్తలకు కొదువ లేదు వీరంతా ప్రజలకు చేసే మార్గ నిర్దేశానికి కొదవ లేదు. కానీ వీరు చూపే అనేక మార్గాలు ఉన్న 'జబ్బు'ను పెంచేవే కానీ తుంచేవి కావు. పైగా చాలామంది మార్గదర్శకులు తమ పొట్టలు నింపుకోవడం కోసం ప్రజల్ని బుద్ధి పూర్వకంగానే అగాథంలోకి నెట్టేస్తారు. కానీ, ఇలా అగాథంలోకి నెట్టే వాళ్లనుంచి ప్రజల్ని రక్షించడానికే భారత కమ్యూనిస్టు పార్టీ పుట్టింది. ప్రజలు ఎదుర్కొనే అన్ని సమస్యల నుంచీ వారిని తామే రక్షిస్తామన్న హామీ ఏ పార్టీ ఇవ్వదు. ఎందుకంటే, ఏ పార్టీ వ్యవస్థా అలా ఉండదు కనుక. ప్రజలంతా ఏకమై తమ కాళ్లమీద నిలబడి సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి. ధనికులకు, పేదలకు మధ్య దారుణంగా పేరుకు పోయిన సమస్యల్ని తగ్గించడం పార్టీ లక్ష్యంగా ఉండాలి. సమానత్వాన్ని ప్రేమించేవారికి పార్టీలో నిస్సందేహంగా స్థానం ఉంటుంది. అంతేగాని తాము మాత్రమే అన్ని సౌకర్యాలు అనుభవించాలనుకొనే వారికి పార్టీలో స్థానం ఉండదు. ఎవరైతే ప్రజల్ని మోసం చేస్తూ, ఇతరులను దోచుకుంటూ అనుభవించగోరతారో... వారికి పార్టీలో స్థానం ఉండదు. తమ చెమటోడ్చి సంపాదించుకుంటూ, తప్పుడు మార్గాల ద్వారా సంపాదనకు ఒడిగట్టని పేద రైతులు, కార్మికులు, నిరుపేద గుమస్తాలు, చిన్నచిన్న ప్రభుత్వోద్యోగులు, రైల్వే సిబ్బంది, స్కూలు మాస్టర్లు, చిన్నచిన్న వ్యాపారులు, చిన్నస్థాయి పోలీస్ కానిస్టేబుల్స్, ప్రెస్ ఉద్యోగులు – వంటి వారు మాత్రమే మా పార్టీలో సభ్యత్వానికి అర్హులు' అని పార్టీ ఈ పత్రం ద్వారా చాటింది.

అయితే పెట్టుబడిదారీ (కాపిటలిస్ట్) వర్గానికి, వారి ప్రయోజనాల కోసం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పనిచేసే సంస్థలను పార్టీ సహించదని చెప్పింది. అందుకనే శ్రమ జీవులంతా ఏకైక భారత కమ్యూనిస్టు పార్టీ పతాకం కింద సమకూడి, తుది శ్వాస వరకూ నిలబడాలని ప్రమాణ పత్రం నిర్దేశించింది. అంతేగాదు, రంగంలో ఉన్న పెక్కు రాజకీయ పార్టీలు వర్గ ప్రయోజనాలను ప్రతిబింబించేవి కాబట్టి... వీటన్నింటిలో ఏకైక పెద్ద కార్మికవర్గ శక్తి కమ్యూనిస్టు పార్టీ కాబట్టి అందరూ ఐక్య శక్తిగా సమీకృతం కావాలని ఆ మానిఫెస్టో ప్రకటించింది. బహుశా అందుకనే సుభాష్ చంద్రబోస్ రానున్న రోజుల్లో భారతదేశ భవిష్యత్తు మౌలికంగా వామపక్ష శక్తుల పోరాటం, త్యాగాల మీదనే ఆధారపడి ఉంటుందని జోస్యం చెప్పారు. ఎందుకంటే, విప్లవోద్యమం అనేది అరాచక ఉద్యమం కాదు, టెర్రరిస్టుల ఉద్యమమూ కాదు. భారత స్వాతంత్ర్యోద్యమంలో దేశ భక్తులైన అనేకమంది మేధావులను, నాయకులను, యువకులను, రచయితలను 'దేశద్రోహులు'గా వలస పాలకులు ముద్రవేసి జైళ్లలో పెట్టారు. అందులో వామపక్ష భావాలు ఉన్నవారు అనేకమంది ఉన్నారు. 'మనల్ని దేన్ని చదవకూడదని బ్రిటిష్ పాలకులు కోరుకున్నారు' (బ్యాన్డ్ అండ్ సెన్సార్డ్: వాట్ ది బ్రిటిష్ రాజ్ డిడిన్ట్ వాంట్ అజ్ టు రీడ్') అనే గొప్ప చారిత్రిక విశ్లేషణా గ్రంథాన్ని తాజాగా అందించిన చరిత్రకారిణి దేవికా సేథి... అప్పటి వలస భారతంలోని 'సెన్సార్‌షిప్' నిబంధనల మాలోకం గురించీ వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన దాదాపు 75 ఏళ్ల తర్వాత రాసిన ఆ గ్రంథం ఎన్నో మరుగున పడిన విషయాలను తెలియచేస్తోంది.

ఇంతకూ 'దేశద్రోహి' అంటే ఎవరు, అన్న ప్రశ్నకు టర్కీ ప్రసిద్ధ ప్రజా మహాకవి హిక్మెట్‌ను అడిగితే చెబుతాడు:

"ఔను, నేను దేశద్రోహినే –
మీరు దేశభక్తులైతే
మీరే మన మాతృభూమి పరిరక్షకులైతే
నేను నా మాతృభూమికి దేశద్రోహినే
దేశభక్తి అంటే మీ విశ్వాసాల వ్యవసాయ క్షేత్రాలే అయితే
దేశభక్తి అంటే మీ బొక్కసాల్లో సంపదలే అయితే
దేశభక్తి అంటే మీ బ్యాంకు ఖాతాల్లో నిధులే అయితే
దేశభక్తి అంటే దారి పక్క దిక్కులేని ఆకలి చావులే అయితే
దేశభక్తి అంటే జనాలు కుక్కపిల్లల్లా చలికి వణికిపోవడమే అయితే
ఎండా కాలంలో మలేరియాతో కునారిల్లడమే అయితే
మతగ్రంథాలను వల్లించడమే దేశభక్తి అయితే
పోలీసు చేతి లాఠీయే దేశభక్తి అయితే
మీ కేటాయింపులూ, మీ జీతభత్యాలు మాత్రమే దేశభక్తి అయితే
మూఢ విశ్వాసాల అజ్ఞానపుటంధకారపు మురికి గుంట నుంచి
విముక్తి లేకపోవడమే దేశభక్తి అయితే – నేను దేశద్రోహినే!"

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

శుభవార్త



ఛోటూ 25 ఏళ్ల నుంచి నాతో ఉంటున్నాడు. పెళ్లి చేసుకున్నాడు. పాప నామకరణం నాతో చేయించుకున్నాడు. పేరు 'షామ్లీ' అని పెట్టాను.

– ధర్మేంద్ర, నటుడు

సమయానికి...



బాడీగార్డు చురుగ్గా స్పందించడం వల్ల హత్యా ప్రయత్నం నుంచి జపనీస్ ప్రధాన మంత్రి (ఫ్యూమియో కిషీదా) సురక్షితంగా బయటపడ్డారు. బాడీగార్డు హ్యాండ్‌బ్యాగులు మోయకూడదు. కానీ ఇక్కడ మాత్రం అదే పనికొచ్చినట్టుంది.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

చంపే ఆట



ఇండియా ఇప్పుడు ఒక పెద్ద కొలోజియం. తోటి మనుషులను జాంబీలు (కదిలే మృతజీవులు) చంపుతుంటే మనమందరం ప్రేక్షకులుగా ఉంటున్నాం. మధ్యలోని బారికేడ్లు మనల్ని సురక్షితమైన దూరంలో ఉంచుతున్నాయని నమ్ముతూ, జాంబీలను ఉత్సాహపరుస్తాం. కానీ ప్రతి ఆటా మనల్ని కూడా జాంబీలుగా మార్చుతున్నదని గ్రహించం. మనం ఒకరికి ఒకరం ఆహారంగా మారుతున్నాం.

– గజాలా వహాబ్, సంపాదకురాలు

వర్తమానం



మూర్ఖత్వం మీద ఏ ఒక్క భావజాలానికో గుత్తాధిపత్యం లేదు. అయినప్పటికీ, కొన్ని భావజాలాలకు మూఢులను ఆకర్షించడంలో స్వాభావికమైన శక్తి ఉంది. వర్తమాన ఉదారవాద 'ఆలోచన' అనేది ఇప్పుడు ఈ జాబితాలో టాప్‌లో ఉంది.

– అనింద్యో చక్రవర్తి, జర్నలిస్ట్

వ్యవహారం నడిపింది



శివాజీ మరణించిన తర్వాత, ఒడయార్లకు వ్యతిరేకంగా గోల్కొండ ముస్లింలతో మరాఠాలు జట్టుకట్టారు. ఐదేళ్ల తర్వాత, మరాఠాలకు వ్యతిరేకంగా ఔరంగజేబుతో ఒడయార్లు జట్టుకట్టారు. భారత చరిత్రను చాలావరకు నిర్దేశించిన వ్యవహార జ్ఞానపు స్ఫూర్తిని తగ్గించిచూడటం దుర్బుద్ధితో కూడినదే!

– అమిత్ షాండీలియా, కాలమిస్ట్

డిన్నర్‌కు 12 లక్షలు



బాలి (ఇండోనేషియా)లో అత్యంత గందరగోళ విషయం ఏమిటంటే, కరెన్సీ. డిన్నర్ బిల్లు 1200.000 వచ్చింది. కార్డును స్వైప్ చేసి, భారతీయ రూపాయల్లో చెల్లిస్తే అది దాదాపు 6,400 అయింది. అప్పుడుగానీ బాలినీస్ ప్రజలు కామాకు బదులుగా పాయింట్ వాడతారనీ, మొత్తం బిల్లు 12 లక్షల ఇండోనేషియా రుపియాలని అర్థం కాలేదు. 1 ఇండియన్ రూపాయి= 187 ఇండోనేషియా రుపియాలు.

– దీపక్ కృష్ణమూర్తి, కార్డియాలజిస్ట్

ఇంత యాంత్రీకీకరణా?



అమెరికా, టెక్సాస్‌లోని ఒక డైరీఫామ్‌లో జరిగిన పేలుడులో 18,000 ఆవులు చనిపోవడం తీవ్రమైన దుర్ఘటన. యాంత్రీకీకరణ లోపం వల్ల ఇది జరిగింది. ఇంకా భయానకం ఏమిటంటే, ఈ మొత్తం 18,000 ఆవుల పెడ్లులో పాలు పిండటానికి ఒకే ఒక్క మనిషి ఉండటం! కేవలం ఒక్క మనిషి!

– బెర్నీ స్పాఫోర్త్, కామెంటేటర్

ఇన్‌బాక్స్

ఇదేం శ్రమ దోపిడీ?

ఎట్టకేలకు పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. అయితే పేపర్ల మూల్యాంకనంపై ఉపాధ్యాయులు నిరాసక్తతతో ఉన్నారు. దీనికి ప్రధాన కారకాలు, గత ఐదేళ్లుగా మూల్యాంకనంలో చెల్లిస్తున్న రెమ్యూనరేషన్, గత ఎనిమిదేళ్లుగా డీఏ రేటు పెంచకపోవడమే. క్యాంప్ ఆఫీసర్‌కు రూ. 578, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్‌కు రూ. 495, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌కు రూ. 429, చీఫ్ ఎగ్జామినర్‌కు రూ. 396, అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు పేపర్‌కు పది రూపాయలు, స్పెషల్ అసిస్టెంట్‌కు రోజుకు రూ. 250 మాత్రమే చెల్లిస్తున్నారు. స్పెషల్ అసిస్టెంట్లకు కనీసం టీఏ, డీఏలు ఇవ్వడం లేదు. పీఆర్‌సీ 2015 సిఫారసు ప్రకారం గ్రేడ్–1 ఉద్యోగికి రూ. 450, గ్రేడు–2 ఉద్యోగికి రూ. 300, గ్రేడ్–3 ఉద్యోగికి రూ. 225 డీఏగా నిర్ధారించారు. 2020 పీఆర్సీ కమిషన్ కొత్త డీఏ రేట్లను సిఫార్సు చేసినప్పటికీ పాత డీఏ రేట్లే అమల్లో ఉన్నాయి.


గతంలో పదవ తరగతిలో 40 మార్కులున్న పేపర్లు తెలుగుకు రెండు, ఆంగ్లానికి రెండు, గణితానికి రెండు, భౌతిక శాస్త్రానికి ఒకటి, జీవశాస్త్రానికి ఒకటి, సాంఘిక శాస్త్రానికి రెండు, హిందీకి (80 మార్కులు) ఒకటి... మొత్తం 11 పేపర్లు ఉండేవి. 40 మార్కుల పేపర్‌కు పది రూపాయలు చెల్లించేవారు. కోవిడ్ అనంతరం మొత్తం పేపర్లను 11 నుంచి 6కు తగ్గించారు. ఒక్కో పేపర్ మార్కులు 40 నుంచి 80కి పెంచారు. అప్పటి నుంచి 80 మార్కుల పేపర్‌కు కూడా 10 రూపాయల చొప్పునే చెల్లిస్తున్నారు. ప్రస్తుతం కూడా అదే 40 మార్కుల పేపర్‌గా ఉన్న భౌతిక, జీవశాస్త్రాలకు పది రూపాయలు చెల్లిస్తున్నారు. 40 మార్కుల పేపర్‌కు రెమ్యూనరేషన్ 10 నుంచి 20 రూపాయలకు, 80 మార్కుల పేపర్‌కు రెమ్యూనరేషన్ 10 నుంచి 30 రూపాయ లకు పెంచాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

– జుర్రు నారాయణ యాదవ్,
తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

రాజీవ్ తొలగింపు కోసం సాగిన కుట్ర

కామెంట్



కరణ్ థాపర్

ఒక జ్ఞాపకాల పుస్తకాన్ని చదవడంలో సరదా అది వెల్లడించే విషయాలపై ఆధారపడి ఉంటుంది. అది ఒక ఉద్దేశపూర్వకమైన విచక్షణారాహిత్యం కావొచ్చు, దిగ్భ్రాంతి కలిగించే ఒప్పుదల కావచ్చు లేదా మనకు తెలియని సాధారణమైన వివరాలు కావచ్చు. కానీ ఉద్దేశపూర్వకంగా స్వీయ నేరారోపణ చేసుకోవడం నేను ఇదివరకు ఎన్నడూ చూడలేదు. ఈ ప్రస్తుత కేసులో, రచయిత సొంత వివరణ ప్రకారం, తన వృత్తి డిమాండ్ చేసే అత్యున్నత నైతిక ప్రమాణాలకు ఆయన ద్రోహం తలపెట్టారు. ఇంకా ఆందోళనకరమైనది ఏమిటంటే, భారత ప్రజాస్వామ్యాన్ని ఉద్దేశ పూర్వకంగా ప్రమాదంలో పడేశారు.

రాష్ట్రపతిగా జ్ఞానీ జైల్ సింగ్ పదవీ కాలానికి సంబంధించి కె.సి. సింగ్ రాసిన 'ది ఇండియన్ ప్రెసిడెంట్' అనే పుస్తకం గురించి నేను మాట్లాడుతున్నాను.

కేసీ సింగ్ 1983 నుంచి 1987 వరకు నాటి రాష్ట్రపతి డిప్యూటీ కార్యదర్శిగా వ్యవహరించారు. ఆ కాలంలో, అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీని పదవీభ్రష్టుడిని చేయాలంటూ జైల్ సింగ్‌ను ఒప్పించేందుకు జరిగిన కుట్రల్లో ఆయన ఇష్టపూర్వకంగా, ఉద్దేశపూర్వకంగా కీలకపాత్ర పోషించారు.

కేసీ సింగ్ అలక్ష్యంగా రాశారు: "ఒక సలహాదారుగా ఉండటం నుంచి రాజకీయ క్రీడలో పాత్ర పోషించడం వరకు జరిగిన మార్పు నా స్వభావానికి సంబంధించినదే." 1987లో తన ప్రవర్తన గురించి ఆయన ఇలా చెబుతారు: "ఆ దశలో నేను రాజకీయ నాటకంలో పూర్తిగా భాగమయ్యాను... నాకు సంబంధించినంతవరకు గత నాలుగేళ్లలో జరిగిన ఘటనలు రాజీవ్ గాంధీ పాలన మీద తీవ్ర ధిక్కారం కలిగించాయి."

రాజీవ్ గాంధీని తొలగించాలంటూ జైల్ సింగ్‌కు నచ్చజెప్పేందుకు వీసీ శుక్లాకు సహకరించడంలో కేసీ సింగ్ పాత్రకు సంబంధించిన వివరాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. "శుక్లా భారత రాష్ట్రపతిని కలిసేందుకు వచ్చిన సమయంలో, అంటే 1985 చివరలో నన్ను పిలిచారు. వారిద్దరికీ మధ్య సమాచార వారధిగా నేను ఉంటానని చెప్పాను. ఇది రాష్ట్రపతి భవన్‌కు శుక్లా రావలసిన అవసరాన్ని తప్పించింది. ఎందుకంటే ఆయన సందర్శనలపై ఇంటెలిజెన్స్ బ్యూరో వేగులు పూర్తి అప్రమత్తతతో ఉండేవారు. నేను ఏం చెప్పినా దానికి రాష్ట్రపతి అధికారిక ముద్ర ఉంటుందని ఆయనకు స్పష్టంగా చెప్పడమైంది."

1987 మార్చిలో, పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ పరాజయం పొంది, న్యాయశాఖ మంత్రి అశోక్ సేన్ రాజీనామా చేసిన తర్వాత జరిగిన పరిణామాలను కేసీ సింగ్ రాశారు: "రాష్ట్రపతిని తగిన చర్య తీసుకునేలా ఒప్పించాలంటూ వీసీ శుక్లా ఎంతో ఉద్వేగంతో నన్ను కోరారు. ప్రధానమంత్రిని రాష్ట్రపతి పదవి నుంచి తొలగించాలి. ఆయన స్థానంలో అశోక్ సేన్‌తో ప్రమాణ స్వీకారం చేయించాలి.... రాజీవ్ గాంధీని ఒకసారంటూ గద్దె దింపాక ఆయన వెనుక ఉన్న మద్దతు కుప్పగూలిపోతుందని శుక్లా మొండినమ్మకంతో ఉన్నారు."

శుక్లా, అశోక్ సేన్ కలిసి కేసీ సింగ్ నివాసానికి వచ్చారు, "రాష్ట్రపతి భవన్‌కు వారిని నా కారులో తీసు కెళ్లేందుకు. నేను వారిని నా నెమలి నీలి రంగు ఫియట్‌లో తీసుకెళ్లాను". ఒక నెల తర్వాత కేసీ సింగ్ మళ్లీ వాళ్ల బోదకుడిగా వ్యవహరించారు. "ఈసారి వారిని ఫియట్ వెనుక ఒత్తుకునేలా కూర్చోబెట్టి" తీసుకెళ్లారు.

రాజీవ్ గాంధీకి వ్యతిరేకంగా అర్జున్ సింగ్‌ను మార్చడానికి కూడా కేసీ సింగ్ ప్రయత్నించారు. "ఇప్పుడు నేను దాటుతున్నది కీలకమైన లక్ష్మణరేఖ. ఇది ఇప్పటివరకూ నేను పని చేసిన 'గ్రే జోన్' లాంటిది ఎంత మాత్రమూ కాదు. కాంగ్రెస్‌లో చీలికలను మరింత పెంచడానికి ఏం చేయాలో అన్న కోరిక ముందు నా





'ది ఇండియన్ ప్రెసిడెంట్' రచయిత కె.సి. సింగ్

అప్రమత్తతను త్యజించివేశాను."

ఏదేమైనప్పటికీ ఆ సందర్భంలో కేసీ సింగ్ అత్యుత్సాహం ఆయన్ని ఉచ్చులోకి నెట్టివేసింది. కేసీ సింగ్ బ్యాచ్‌మేట్ సురీందర్ సిద్ధు, "అర్జున్ సింగ్ (తనను) కలవడానికి ఉత్సాహంగా ఉన్నాడని సూచించాడు. నేను... అర్జున్ సింగ్ వంటి జిత్తులమారి రాజకీయ నాయకుడు కూడా నన్ను వంచించడానికి నా బ్యాచ్‌మేట్‌ను ఉపయోగించబోడని నమ్మేశాను". అక్కడే కేసీ సింగ్ పప్పులో కాలేశారు.

"భవిష్యత్తులో సంప్రదించడానికి అర్జున్ సింగ్ తన డైరెక్ట్ టెలిఫోన్ లైన్ నాకు ఇచ్చారు. నా గదిలో మాత్రమే మోగే నంబరు ఆయనకు ఇచ్చాను." అర్జున్ సింగ్ తనతో 'ఆడుకుంటున్నారని' ఆయనతో తొలి సమావేశం తర్వాతే కేసీ సింగ్ అర్థం చేసుకున్నప్పటికీ, తర్వాత రెండు సార్లు కలిశారు. అప్పటికీ రాజీవ్ గాంధీకి వ్యతిరేకంగా మారేలా నచ్చజెప్పడానికి కేసీ సింగ్ ప్రయత్నించారు. "నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎన్నికల్లో పరాజయం పొందడం, బోఫోర్స్ అవినీతి మేఘం అనేవి కాంగ్రెస్ పార్టీ నుంచి జవాబుదారీ తనం డిమాండ్ చేస్తున్నాయని నేను వాదించాను."

కాన్షీరామ్‌తో ఒక సమావేశం సహా ఇంకా ఇలాంటివి పుస్తకంలో చాలా ఉన్నాయి. కానీ నేను ఇప్పటికే చాలినన్ని చెప్పాననుకుంటున్నాను. నిజానికి, నేను లోతుగా ఆలోచించలేక పోయింది ఏమిటంటే – కేసీ సింగ్ వీటన్నింటినీ తన పుస్తకం ద్వారా ఎందుకు బయటపెట్టాలని అనుకున్నారు? ఒక సివిల్ సర్వెంటుగా ఇది తన కీర్తి ప్రతిష్ఠలను తగ్గించివేస్తుందని ఆయనకు తెలిసివుండాలి. ఇంకా ఘోరమైనది ఏమిటంటే, ఒక ప్రజాదరణ కలిగిన ప్రధానికి వ్యతిరేకంగా ఆయన కుట్ర చేశాడనడానికి ఇది రుజువు. ఎప్పుడు విచక్షణతో ఉండాలి, ఎప్పుడు నోరు మూసుకుని ఉండాలి అనే విషయంలో ఆయనకు బొత్తిగా ఏమీ తెలీదని ఇది సూచిస్తోంది. లేదా ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీనీ, ప్రభుత్వాన్నీ ఆయన మనసులో పెట్టుకున్నారా? గాంధీల మీదున్న వారి వైముఖ్యత వల్ల వారు ఈ పశ్చాత్తాప గాథ పట్ల ఆసక్తి చూపి, పైగా దాని రచయితను అభినందిస్తా రనుకున్నారా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

బండి సంజయ్ బెయిల్ రద్దు చేయండి

• కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన పోలీసులు

వరంగల్ లీగల్: పదోతరగతి హిందీ పేపర్ లీకేజీ, కాపీకుట్ర కేసులో మొదటి నిందితుడయిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌కు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. ఈ కేసులో ప్రత్యేక పీపీగా నియమితులైన ఎం.సత్యనారాయణగౌడ్ ప్రాసిక్యూషన్ తరఫున హనుమకొండ నాలుగో మున్సిఫ్ కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో బండి సంజయ్‌కి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడం, అనంతరం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. బెయిల్ మంజూరు సమయంలో నిందితుడు సాక్ష్యాధారాలను మాయం చేయకూడదని, విచారణకు పోలీసులకు సహకరించాలని కోర్టు షరతులు విధించింది. అయితే సంజయ్‌కుమార్ విచారణకు సహకరించడం లేదని, మొబైల్‌ను తమ స్వాధీనం చేయాలని పోలీసులు కోరినా, ఇప్పటి వరకు అందజేయలేదని పీపీ తెలిపారు. దీనివల్ల విచారణ వేగవంతం చేయలేకపోతున్నారని, షరతులను ఉల్లంఘిస్తున్నందున సంజయ్‌కు జారీ చేసిన బెయిల్ రద్దు చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
నాగర్‌కర్నూల్ జిల్లా గెజిట్ ఎక్స్‌ట్రా ఆర్డినరి పబ్లిష్డ్ అథారిటీ
(Declaration) రూఢి ప్రకటన
ఫారం-VII

G2/1451/2022 తేది : 15.03.2023
Gaz. No.12/2023

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని పెనిమిల్ల గ్రామము వద్ద ప్యాకేజి నెం.30 ఎక్స్‌టెన్షన్ ఆఫ్ అచ్చంపేట బ్రాంచ్ కెనాల్ యొక్క డిస్ట్రిబ్యూటరీ 8ఎల్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ. 20.33 గుంటలు/ సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా ఎక్స్‌టెన్షన్ ఆఫ్ అచ్చంపేట బ్రాంచ్ కెనాల్ యొక్క డిస్ట్రిబ్యూటరీ 8ఎల్ నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కావున మొత్తం 20.33 గుం॥ భూమి ఎక్స్‌టెన్షన్ ఆఫ్ అచ్చంపేట బ్రాంచ్ కెనాల్ యొక్క డిస్ట్రిబ్యూటరీ 8ఎల్ నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢి ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

గ్రామము: పెనిమిల్ల మండలం: ఉప్పునుంతల జిల్లా: నాగర్‌కర్నూల్

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	421	పట్టా	మెట్ట	0.17	నిరంజన్ తండ్రి [illegible]	422	VB	419	రోడ్	లేవు	లేవు	లేవు	లేవు

[illegible]

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే.) (FAC), యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
DIPR RO No.66/LA-PP/ADVT/PUB/2023-24

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
సూర్యాపేట జిల్లా
ఫారం 6
(ప్రాథమిక ప్రకటన)
(కేంద్ర చట్టము 30/2013 యొక్క సెక్షన్ 11(1) రూల్ 19(1) ననుసరించి కలెక్టర్/ అదనపు కలెక్టర్/ రాజస్వ మండలాధికారి హుజూర్‌నగర్

జిల్లా కలెక్టర్ సూర్యాపేట ఫైల్ నెం.G/342/2023 తేది : 31.03.2023

[illegible]

DIPR RO No.61/LA-PP/Advt/Pub/2023-24

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టర్/అదనపు కలెక్టర్/స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)/స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ)
ఫారం-7
(చట్టం-30/2013లోని సెక్షన్ 19 (1) లోని సబ్ రూల్-(1) రూల్ 25 ప్రకారం)
రూఢి ప్రకటన

G1/2972/2022 తేది: 31.03.2023
ఫైల్ నెం.5/03/2020 తేది: 27.03.2023

[illegible]

DIPR RO No.54/LA-PP/Advt/Pub/2023-24

నిధులు కోసి.. కార్డులు తగ్గించేసి..!

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తమవుతోంది. వివిధ రాష్ట్రాలతో పాటు గతంలో ఉపాధిహామీ అమల్లో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణలోనూ ఈ పథకం ప్రాబల్యాన్ని కోల్పోతూ నీరుగారిపోతోంది.

అన్నీ అవరోధాలే..

కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇటీవల తీసుకొచ్చిన సాంకేతిక ఆవిష్కరణలు ఉపాధి హామీ పథకానికి ప్రతిబంధకంగా మారినట్టు నిపుణులు చెబుతున్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)లో భాగంగా మొబైల్ యాప్ ద్వారా పనిచేసే ప్రదేశాల్లోనే రోజుకు రెండుసార్లు కూలీల అటెండెన్స్ నమోదు (ఉదయం ఒకసారి, మధ్యాహ్నం తర్వాత రెండోసారి), ఆధార్ కార్డుతో జాబ్ కార్డుల సీడింగ్, అథెంటికేషన్, బ్రిడ్జి పేమెంట్స్ లాంటి విధానాల కారణంగా ఉపాధి వర్కర్లు పని, కూలీ పొందడంలో ఇబ్బందులు పడడం.. ఈ పథకం మౌలిక సూత్రాలకే ఉల్లంఘనగా నిలుస్తోంది. దాదాపు 15 ఏళ్ల పాటు పనుల నమోదు, కూలీ లెక్కింపు, జాబ్ కార్డుల జారీ, ఇతర అంశాల నమోదుకు రాష్ట్రస్థాయిలో ఉపయోగించిన రాష్ట్ర వెబ్‌సైట్ రాగా సాఫ్ట్‌కు బదులు, జాతీయ స్థాయిలో నేషనల్ ఇన్‌ఫర్మాటిక్ సెంటర్ (ఎన్ఐసీ) సాఫ్ట్‌వేర్‌ను కేంద్రం తప్పనిసరి చేయడంతో రాష్ట్రంలో కూలీల సమస్యలు మరింత సంక్లిష్టంగా మారాయి. ఈ విధంగా సాంకేతికంగా చోటు చేసుకున్న మార్పు, చేర్పులు రాష్ట్రంలో ఈ పథకం అమలుకు, పని కోసం కూలీలు ముందుకు వచ్చేందుకు ఆటంకంగా మారాయి. మరోవైపు రాష్ట్రంలో దీని అమలు పూర్తి సామర్థ్య స్థాయిలో జరగడం లేదు. గత మూడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే.. వివిధ రకాల ఎంప్లాయ్‌మెంట్ ఇండికేటర్లు (ఉద్యోగిత సూచిలు) కూడా దిగజారాయి. అత్యధిక స్థాయిలో జాబ్ కార్డుల్లో కోతతో పాటు ఆధార్ సీడింగ్, అథెంటికేషన్, ఆధార్ బ్రిడ్జి పేమెంట్స్ విధానం, ఎన్ఎంఎంఎస్ అటెండెన్స్ తప్పనిసరి చేయడం వంటివి ప్రభావం చూపినట్టుగా ఉపాధి హామీ పథకం అమలు, పర్యవేక్షక, పరిశీలన సంస్థ 'లిబ్‌టెక్ ఇండియా' జరిపిన కూలంకష పరిశీలనలో వెల్లడైంది.

5 లక్షల జాబ్ కార్డుల కోత

ఈ నెల 7వ తేదీ వరకు ఉపాధిహామీ పథకం అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచిన గణాంకాలు, సమాచారం ఆధారంగా గత మూడేళ్ల డేటాను విశ్లేషిస్తూ లిబ్‌టెక్ సంస్థ నివేదిక రూపొందించింది. ఇందులో అనేక ముఖ్యమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో 5 లక్షల జాబ్ కార్డుల కోత (ఇది ఇక్కడి మొత్తం జాబ్ కార్డుల్లో 8.2 శాతం) పడింది. అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో 24.3 శాతం, జోగుళాంబ గద్వాలలో అత్యల్పంగా 2.7 శాతం తొలగింపునకు గురయ్యాయి. 17.3 లక్షల కూలీల పేర్లు కూడా ఈ కార్యక్రమంలో లేకుండా పోయాయి. జాబ్ కార్డుల కోత రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం కాబట్టి ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత కూడా రాష్ట్ర సర్కార్‌పైనే ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇక కేంద్రం ప్రవేశపెట్టిన ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి క్షేత్రస్థాయి అధికారులకు ఇంకా పూర్తి స్థాయిలో అవగాహన ఏర్పడలేదు. ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టమ్ కంటే కూడా బ్యాంక్ ఖాతా ఆధారిత పేమెంట్ సిస్టమే మెరుగైనదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఏమంటోంది..

కేంద్ర ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ సర్కార్ తప్పుబడుతోంది. కేంద్రం నిరుపేదల పట్ల నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తోందని, పేదలను కొట్టి పెద్దలకు పంచే పద్ధతిని అవలంబిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. గడిచిన రెండేళ్లలో బడ్జెట్లో రూ.55 వేల కోట్ల మేర కోత విధించడాన్ని గుర్తు చేస్తోంది. మరోవైపు పని దినాలు తగ్గిపోవడం, పని దినాల ద్వారా వచ్చే మెటీరియల్ కాంపొనెంట్ కూడా తరిగిపోవడంపై కేంద్ర మంత్రులను కలిసి మౌఖికంగా, లేఖల ద్వారా విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ధ్వజమెత్తుతోంది. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానించాలని, ఉపాధి హామీ పని దినాలను పెంచాలని కోరుతూ నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రారంభించిన ఉపాధి హామీపై పోస్టు కార్డుల ఉద్యమంలో భాగంగా ఇటీవల ఆర్థిక మంత్రి టి.హరీశ్‌రావు కేంద్రానికి లేఖ రాశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్రం చూస్తోందని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. వ్యవసాయ కూలీకి రోజుకు రూ. 257 ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ, ఒక్కో కూలీకి వంద రూపాయలకు మించడం లేదని, పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలైన టెంట్లు, మంచినీరు, పారలు, తట్టలు వంటివి అందించడం లేదని విమర్శలు గుప్పించారు. ఆన్‌లైన్ వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేక పోవడం వల్ల ఉదయం 10 గంటలకు, సాయంత్రం 4 గంటలకు కంప్యూటర్‌లో అటెండెన్స్ అప్‌లోడ్ చేయాలనే నిబంధనలు పాటించలేక పోతున్నారన్నారు. సీఎం కేసీఆర్ వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన సంగతి గుర్తు చేశారు.

గణనీయంగా తగ్గిన పని దినాలు

తెలంగాణలో గత రెండేళ్లతో పోల్చితే 2022–23లో హౌస్‌హోల్డ్ పనులు, పర్సన్ డేస్, సగటు పనిదినాలు గణనీయంగా తగ్గాయి. కేంద్రం తగిన ప్రణాళిక లేకుండా క్లిష్టమైన సాంకేతిక అంశాలను ప్రవేశపెట్టడం సమస్యకు ప్రధాన కారణంగా భావిస్తున్నాం. రాష్ట్రంలో ఉపాధి కల్పన అనేది చాలా ఆందోళనకరంగా ఉంది.

– చక్రధర్ బుద్ధా, డైరెక్టర్, లిబ్ టెక్ ఇండియా

రాష్ట్రంలో ఉపాధి హామీ అమలు గణాంకాలు

జాబ్‌కార్డ్స్	52.78లక్షలు
యాక్టివ్‌గా ఉన్న కార్డ్స్	34.73 లక్షలు
పనిచేస్తున్నవారు	59.49 లక్షలు
ఏడాదిలో మొత్తం పనిదినాలు	12.16 కోట్లు
ప్రతి కుటుంబానికి సగటు పనిదినాలు	44.54
సగటు వేతనం (రోజుకు)	రూ.164.34
100 రోజుల పని పూర్తయిన కుటుంబాలు	33 వేలు
ఏడాదిలో కూలీలకు వచ్చిన మొత్తం వేతనం	రూ.2032.94 కోట్లు
సగటున ఒక్కో కుటుంబానికి వచ్చింది	రూ.10,574

కార్మిక రాజ్య బీమా సంస్థ
(కార్మిక & ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం
क.रा.बी.नि. ESIC
EMPLOYEES' STATE INSURANCE CORPORATION
(Ministry of Labour & Employment, Govt. of India)

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి/
Super Speciality Hospital
సనత్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ -500038
ఫోన్: 040-69031100, 040-69031123
ఇ-మెయిల్: esih-sanathnagar.ts@esic.in
వెబ్‌సైట్: www.esic.gov.in

ప్రకటన నం.01/2023 తేది: 18-04-2023

సూపర్ స్పెషలిస్ట్ (సీనియర్ లెవల్)/ సీనియర్ కన్సల్టెంట్, సూపర్ స్పెషలిస్ట్ (ఎంట్రీ లెవల్) జూనియర్ కన్సల్టెంట్ స్పెషలిస్ట్ & సీనియర్ రెసిడెంట్ (కాంట్రాక్టు ప్రాతిపదికన) ఉద్యోగాల కోసం వాక్-ఇన్ ఇంటర్వ్యూ

కాంట్రాక్టు ప్రాతిపదికన సూపర్ స్పెషలిస్ట్ (సీనియర్ లెవల్)/ కన్సల్టెంట్, సూపర్ స్పెషలిస్ట్ (ఎంట్రీ లెవల్)/ జూనియర్ కన్సల్టెంట్, స్పెషలిస్ట్ & సీనియర్ రెసిడెంట్స్ ఉద్యోగాల కోసం ESIC సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, సనత్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ వద్ద వాక్-ఇన్ ఇంటర్వ్యూ ద్వారా అర్హతగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. ఖాళీల వివరాలు మరియు రిజర్వేషన్ స్థితి దిగువ విధంగా ఉన్నాయి:

ఇంటర్వ్యూ ప్రదేశం: మెడికల్ సూపరింటెండెంట్ వారి చాంబర్, ESIC సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, సనత్‌నగర్, హైదరాబాద్.

రిపోర్టింగ్ సమయం: ఇంటర్వ్యూ సమయానికి ఒక గంట ముందు. డాక్యుమెంట్లు పరిశీలించబడిన అభ్యర్థులు మాత్రమే వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరవడానికి అనుమతించబడతారు.

సీనియర్ రెసిడెంట్

క్ర. సం.	విభాగం	కేటగిరీ UR	SC	ST	OBC	EWS	Total	ఇంటర్వ్యూ తేది మరియు సమయం
1	అనస్థీషియా	1	0	0	1	1*	3	28-04-2023 మ.02.30 గం.
2	రేడియాలజి	3	2	0	1	1	7	28-04-2023 ఉ.10.00 గం.
3	కార్డియాలజి	1	0	0	2	0	3	25-04-2023 మ.02.30 గం.
4	పీడియాట్రిక్ సర్జరీ	0	1	1	1	0	3	26-04-2023 ఉ.10.00 గం.
5	యూరాలజి	1	0	0	0	0	1	28-04-2023 మ.12.00 గం.
6	న్యూరో సర్జరీ	0	0	1	0	0	1	27-04-2023 ఉ.10.00 గం.
7	పీడియాట్రిక్ క్రిటికల్ కేర్	0	0	0	1	0	1	26-04-2023 ఉ.10.00 గం.
8	నెఫ్రాలజి	0	2	0	0	0	2	26-04-2023 మ.02.30 గం.
9	న్యూరాలజి	1	1+1*	0	2	0	5	27-04-2023 మ.02.30 గం.
10	CTVS	1	1	0	1	0	3	25-04-2023 ఉ.10.00 గం.
	మొత్తం	8	8	2	9	2	29	

సూపర్ స్పెషలిస్ట్ (సీనియర్ లెవల్)/ సీనియర్ కన్సల్టెంట్

క్ర. సం.	విభాగం	కేటగిరీ UR	SC	ST	OBC	EWS	Total	ఇంటర్వ్యూ తేది మరియు సమయం
1	కార్డియాలజి	-	1	-	-	-	1	25-04-2023 మ.02.30 గం.
2	CTVS	-	-	-	1	-	1	25-04-2023 ఉ.10.00 గం.
3	న్యూరాలజి	1	-	-	-	-	1	27-04-2023 మ.02.30 గం.
4	పీడియాట్రిక్ సర్జరీ	1	-	-	-	1	2	26-04-2023 ఉ.10.00 గం.
	మొత్తం	2	1	-	1	1	5	

సూపర్ స్పెషలిస్ట్ (ఎంట్రీ లెవల్)/ జూనియర్ కన్సల్టెంట్

క్ర. సం.	విభాగం	కేటగిరీ UR	SC	ST	OBC	EWS	Total	ఇంటర్వ్యూ తేది మరియు సమయం
1	కార్డియాలజి	-	1	-	-	-	1	25-04-2023 మ.02.30 గం.
2	నెఫ్రాలజి	1	-	-	-	-	1	26-04-2023 మ.02.30 గం.
3	న్యూరోసర్జరీ	-	-	-	1*	-	1	27-04-2023 ఉ.10.00 గం.
	మొత్తం	1	1	-	1	-	3	

స్పెషలిస్ట్

క్ర. సం.	విభాగం	కేటగిరీ UR	SC	ST	OBC	EWS	Total	ఇంటర్వ్యూ తేది మరియు సమయం
1	అనస్థీషియా	1	-	-	-	-	1	28-04-2023 మ.02.30 గం.
2	రేడియాలజి	1	-	-	1	-	2	28-04-2023 ఉ.10.00 గం.
	మొత్తం	2	-	-	1	-	3	

*యాంటిసిపేటెడ్ వెకెన్సీస్ (ఎప్పుడైతే యాంటిసిపేటెడ్ వెకెన్సీస్ ఏర్పడతాయో అవి అప్పుడు భర్తీ చేయబడతాయి)
పూర్తి వివరాలు **www.esic.gov.in** వెబ్‌సైట్‌లో లభిస్తాయి.

సం/- డీన్

హోత్విక్‌ను దత్తత తీసుకుంటా..: ఎంపీ కోమటిరెడ్డి



• అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి భరోసా

మద్దిరాల(తుంగతుర్తి): హైదరాబాద్‌లోని కుషాయిగూడలో జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన నరేశ్, అతడి భార్య సుమ, కుమారుడు జస్విత్ మృతదేహాలకు సోమవారం అంత్యక్రియలు పూర్తయ్యాయి. నరేశ్ స్వగ్రామం.. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం రెడ్డిగూడెంలో కుటుంబసభ్యులు కన్నీటి వీడ్కోలు పలికారు. కాగా, ప్రమాదంలో తల్లిదండ్రులతో పాటు సోదరుడిని కోల్పోయిన నరేశ్ పెద్ద కుమారుడు హోత్విక్‌ను దత్తత తీసుకుంటానని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఢిల్లీలో ఉన్న ఆయన తన పీఏ సైదులుతో హోత్విక్ పేరిట బ్యాంకులో రూ.లక్ష డిపాజిట్ చేయించారు. ఖర్చుల నిమిత్తం నరేశ్ తల్లిదండ్రులకు రూ.25వేలను అందజేయించారు. నరేశ్ తల్లి దండ్రులను ఫోన్‌లో ఓదార్చారు. అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. నరేశ్ కొడుకును ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదివిస్తానని, ఢిల్లీ నుంచి రాగానే, కలుస్తానని చెప్పారు.

సపర్యలు చేయలేక.. చీరతో ఉరేసి..

• కన్నతల్లినే చంపిన కొడుకు
• ఎంపీటీసీ సభ్యుడి ఫిర్యాదుతో వెలుగులోకి



బాలవ్వ

సదాశివనగర్: అనారోగ్యంతో బాధపడుతున్న తల్లికి సేవలు చేయలేక చీరతో ఉరేసి చంపి, ఖననం చేశాడో కొడుకు. 3 రోజుల కిందట జరిగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ సీఐ రామన్ కథనం ప్రకారం.. సదాశివనగర్‌కు చెందిన ఇట్టవోయిన బాలవ్వ (80) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆమెకు సపర్యలు చేయడం భారంగా భావించిన కుమారుడు బాలయ్య.. ఈనెల 13న తల్లికి చీర కొంగుతో ఉరి బిగించి చంపాడు. అనంతరం రాత్రి వేళలో గ్రామ శివారుకు తీసుకెళ్లి ఖననం చేశాడు. ఈనెల 13నుంచి తల్లి బాలవ్వ కనిపించడం లేదని, ఆమె పడుకున్న గదికి గొళ్లెం పెట్టి ఉందని ఊళ్లోవాళ్లకు చెప్పాడు. బాలయ్య ప్రవర్తనపై అనుమానం వచ్చిన ఎంపీటీసీ సభ్యుడు బీరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడని సీఐ తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా నిర్వహించారు.

తెలంగాణ ప్రభుత్వం
కమిషనర్ కార్యాలయం
ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు
NIT No.EE/04/Tender Notice/2023
తేది: 03.04.2023 (1వ పిలుపు)
ఆదిలాబాద్, నిర్మల్, సూర్యాపేట, సిద్దిపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం మరియు నిజామాబాద్ జిల్లాలలో రూ.1134.00 లక్షల మొత్తంతో 44 దేవాలయాల అభివృద్ధి కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. మరింత సమాచారం కోసం దర్శించండి: https://tender.telangana.gov.in, బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 18.04.2023, బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేది (దాఖలు): 02.05.2023
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్, హైదరాబాద్.
DIPR RO No.56-DP/CL/Advt/1/2023-24, Dt: 12.04.2023

శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము, ధర్మపురి పట్టణం - జగిత్యాల జిల్లా.
ఆర్.సి.నెం.108/2021 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన** తేది: 17.04.2023
శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానము, ధర్మపురి దేవస్థానము ఇంజనీరింగ్ విభాగము పనుల గురించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్స్ కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాలు **https://tender.telangana.gov.in**కు లాగాన్ అవ్వండి. కరెంట్ టెండర్స్‌పై క్లిక్ చేసి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానము, వర్క్స్ సెలెక్ట్ చేయండి.
రినవేషన్ కమిటీ సభ్యులు — సం/- సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి (FAC)
DIPR RO No.431-PP/CL/Advt/1/2023-24, Dt. 17.04.2023

పురపాలక సంఘ కార్యాలయము-హుజూరాబాద్, జిల్లా : కరీంనగర్
లేఖ నెం.E1/113/2023 **టెండరు ప్రకటన** తేది : 25.03.2023
[illegible] 1. పనుల సంఖ్య : (08) పనులు, 2. టెండర్ విలువ : రూ.51.90 లక్షలు, 3. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది : 18.04.2023 ఉ.11.30 గం. నుండి, 4. బిడ్ డౌన్‌లోడ్ చివరి తేది మరియు సమయం : 21.04.2023 మ.2.00 గం. వరకు, 5. బిడ్ల తెరుచు తేది మరియు సమయం: 24.04.2023 సా.4.00 గం. నుండి. ఇతర వివరముల కొరకు www.eprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.
సం/- కమిషనర్, పురపాలక సంఘం, హుజూరాబాద్
DIPR RO No.428-PP/CL/Advt/1/2023-24, Dt: 17.04.2023

శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వేములవాడ : రాజన్న సిరిసిల్లా జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ మరియు షార్ట్ టెండర్ నోటీసు
ఆర్.సి.నం.హెచ్.ఎస్/1714/2022 తేది: 16-04-2023
శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వేములవాడ, దేవస్థానమునకు సంబంధించిన మరుగుదొడ్ల నిర్వహణ మరియు ధర్మశాలల హౌస్‌కీపింగ్ & శానిటేషన్ నిర్వహణ కొరకు 2 సంవత్సరముల పనుల గురించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాలు https://tender.telangana.gov.in కు లాగాన్ అవ్వండి. కరెంట్ టెండర్స్ పై క్లిక్ చేసి శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానము, వర్క్స్ సెలెక్ట్ చేయండి. సంప్రదించవలసిన మొబైల్ నం.లు శానిటేషన్ పర్యవేక్షకులు 9502765773, శానిటేషన్ ఇంచార్జి 9441742777, ఏ.ఈ.ఓ. 8977711089.
DIPR RO No.434-PP/CL/Advt/1/2023-24, Dt:17-04-2023 సం/- కార్యనిర్వహణాధికారి (F.A.C.)

ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్
(ప్రభుత్వ సంస్థ)
రిజిస్టర్డ్ ఆఫీసు: కొత్తగూడెం కాలరీస్ - 507 101
ఛార్జిషీటు మరియు ఎంక్వయిరీ నోటీసు
[illegible]
PR/2022-23/ADVT/PER/WNR/94
DIPR RO No.455-PP/CL/Advt/1/2023-24, Dt: 17.04.2023

తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ & వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్:: హైదరాబాద్
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
Tender Notice No.SE/TSEWIDC/HYD/NIT/112 to 150/2023-24, తేది: 15.04.2023
దిగువ తెలిపిన పనుల కోసం అర్హతగల కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుతున్నవి. అవి MCMB క్రింద ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గ్రామాల (25 నం.లు) నిర్మాణం, మండల సమాఖ్య బిల్డింగ్ (3 నం.లు) నిర్మాణం, MRC బిల్డింగ్, డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ, ప్రహరీగోడ నిర్మాణం, పాఠశాలల (8 నం.లు) కు మౌలిక సదుపాయాలు పటిష్టపరచుట (ఒక్కొక్కటి రూ.15.30 నుండి రూ.154.60 లక్షలు). (క్ర.నం.1 నుండి 33 (1వ పిలుపు) & 34 నుండి 39 రీకాల్). ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలుకు మరియు స్వీకరణకు ఆఖరి తేది: 29-04-2023న సా.5.00 గం. వరకు. గమనిక: GOMs.No.59, I&CAD తేది: 21-06-2018 ప్రకారం ST కోసం NIT No.116 మరియు SC కోసం NIT No. 121, 126, 131, 136, 141 & కమ్యూనిటీల కోసం 144 రిజర్వు చేయబడినవి. గమనిక: GOMs.No.94 ఆఫ్ (ట్రాన్స్‌పోర్ట్, రోడ్స్ & బిల్డింగ్స్ (R.1) Dept, తేది: 16.04.08 ప్రకారం ధర సర్దుబాటు అంటే స్టీల్ & సిమెంట్ కోసం మాత్రమే వర్తిస్తుంది. పూర్తి వివరాల కోసం https://tender.telangana.gov.in లో చూడవచ్చును లేదా సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, TSEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యామిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, E-సేవ ఎదురుగా, L.B. స్టేడియం, హైదరాబాద్ వారిని స్వయంగా సంప్రదించవలెను. ఫోన్ నం.29565991.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TSEWIDC, హైదరాబాద్
DIPR RO No.452-PP/CL/Advt/1/2023-24, Dt:17.04.2023

పురపాలక సంఘ కార్యాలయము :: ఇల్లందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఆర్.ఓ.సి.నెం.ఎ1/శ్రైయ్‌బజార్ /2023-24 **పత్రికా ప్రకటన** తేది: 15.04.2023
శ్రైయ్‌బజార్ వేలము/ టెండరు
ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! పురపాలక సంఘ కార్యాలయము, ఇల్లందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నందు శ్రైయ్‌బజార్ యొక్క కాంట్రాక్టు 2023-2024 సంవత్సరము నందు అనగా ఏప్రిల్, 2023 నుండి మార్చి, 2024 వరకు కాంట్రాక్టు ఇచ్చుటకు నిర్ణయించనైనది. టెండర్ షెడ్యూల్ దాఖలు చేయు తేది: 17-04-2023 నుండి తేది: 18-04-2023 సమయం సా॥ 5.00 గంటల వరకు (కార్యాలయ పని దినాలలో సంప్రదించగలరు.) ఓపెన్ ఆక్షన్ తేది: 20-04-2023 సా.4.గం.లకు. క్ర.సం.1. కాంట్రాక్టు వివరములు: శ్రైయ్‌బజారు. డిపాజిట్: 2,00,000/-, రిజిస్ట్రేషన్ ఫీజు: 10,000, టెండర్ నియమ నిబంధనలు కార్యాలయ నోటీసు బోర్డుపై ఉంచబడినవి. సంప్రదించవలసిన అధికారి: రెవెన్యూ అధికారి, సెల్ నెం.9666333359, (డిపాజిట్ డి.డి మరియు రిజిస్ట్రేషన్ డి.డి.టెండర్ సమయంలో సమర్పించవలయును)
సం/- మున్సిపల్ కమిషనర్, పురపాలక సంఘం, ఇల్లందు
DIPR RO No.436-PP/CL/Advt/1/2023-24, Dt. 17.04.2023

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్, హైదరాబాద్
(తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ)
5వ అంతస్తు, పరిశ్రమ భవనం, H.No.5-9-58/B, ఫతేమైదాన్ రోడ్, హైదరాబాద్-04, ఫోన్: 23238290-250
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
No.03/CGM/TSIIC/2023-24 తేది: 17.04.2023
TN.No.03: ఎదిర (గ్రా), & దివిటిపల్లి గ్రామం, మహబూబ్‌నగర్ అర్బన్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం వద్ద NH 44 నుండి IT ఇన్‌క్యుబేషన్ సెంటర్ వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం. వెట్ మిక్స్ మెకడమ్ మరియు బ్లాక్ టాపింగ్ ఏర్పాటు చేయుట. **ECV: రూ.6,92,93,862.00,** బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 19.04.2023న సా.5.00 గం. నుండి, బిడ్ల దాఖలు కోసం ఆఖరి తేది: 26.04.2023న మ.3.00 గం. వరకు. టెండరు ప్రకటనల వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్లను వెబ్‌సైట్ **www.tender.telangana.gov.in** నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (E)
DIPR RO No.481-PP/CL/Advt/1/2023-24; Dt: 17.04.2023

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి జిల్లా
ఇ-మెయిల్ : ramagundam.corporation@gmail.com
ROC.No.E1/EE/GF/Hire Vehicles/RMC/2023-24 **ఆసక్తి వ్యక్తీకరణ-EOI** తేది : 17.04.2023
[illegible]
సం/- కమిషనర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO No.438-PP/CL/Advt/1/2023-24, Dt. 17.04.2023

క్లుప్తంగా...

సునాక్‌పై పార్లమెంటరీ కమిషనర్ విచారణ!

లండన్: తన భార్య అక్షతా మూర్తి నిర్వహిస్తున్న 'కొరు కిడ్స్ లిమిటెడ్' అనే సంస్థకు లబ్ధి చేకూరేలా బడ్జెట్‌లో కొత్త పథకాన్ని ఉద్దేశపూర్వకంగా ప్రకటించారని బ్రిటిష్ ప్రధానమంత్రి రిషి సునాక్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణల్లో నిజానిజాలు నిగ్గుతేల్చడానికి 'యూకే పార్లమెంటరీ కమిషనర్ ఫర్ స్టాండర్స్' విచారణ ప్రారంభించింది. అతి త్వరలో రిషి సునాక్‌ను ప్రశ్నించనుంది. కొరు కిడ్స్ లిమిటెడ్ సంస్థ చిన్నపిల్లల సంరక్షణ సేవలను అందిస్తోంది.

మనీశ్ సిసోడియా కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం మనీ లాండరింగ్ కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియా కస్టడీని ప్రత్యేక కోర్టు పొడిగించింది. ఈ కేసును సీబీఐ, ఈడీలు దర్యాప్తు చేస్తున్నాయి. గతంలో ఇచ్చిన కస్టడీ గడువు ముగియడంతో సోమవారం ప్రత్యేక కోర్టు జడ్జి ఎంకే నాగ్‌పాల్ ఎదుట సిసోడియాను హాజరుపరిచారు. ఈ కేసులో సిసోడియా, సహనిందితులైన అరుణ్ పిళ్లై, అమన్‌దీప్‌లపై ఈ నెలాఖరు కల్లా ఈడీ సప్లిమెంటరీ చార్జిషీటును దాఖలు చేయనుందని ఈ సందర్భంగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నవీన్ కుమార్ కోర్టుకు చెప్పారు. ఈ సమయంలో ఆయన్ను విడుదల చేస్తే దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్న జడ్జి.. సీబీఐ కస్టడీని ఈ నెల 27 వరకు, ఈడీ కస్టడీని 29వ తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలిచ్చారు. అదేవిధంగా, సిసోడియా బెయిల్ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపడతామని పేర్కొన్నారు.

స్కూల్ జాబ్స్ కుంభకోణం.. టీఎంసీ ఎమ్మెల్యే అరెస్ట్




కోల్‌కతా/ముర్షిదాబాద్: పశ్చిమ బెంగాల్‌లో స్కూల్ జాబ్స్ కుంభకోణం కేసులో అధికార టీఎంసీ ఎమ్మెల్యే జిబన్ కృష్ణ సాహాను సీబీఐ అరెస్ట్ చేసింది. ప్రభుత్వ అధీనంలోని, ఎయిడెడ్ స్కూళ్లలో ఉద్యోగాల భర్తీలో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించి సాహాను ఈ నెల 14నుంచి సీబీఐ ప్రశ్నిస్తోంది. ముర్షిదాబాద్ జిల్లా బుర్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన ఆయన ఇంట్లో సోదాలు జరిపింది. సోమవారం ఆయన్ను అదుపులోకి తీసుకుంది. అలీపోర్‌లోని ప్రత్యేక కోర్టు ఆయనకు నాలుగు రోజుల కస్టడీ విధించింది. 2014–21 సంవత్సరాల మధ్య సాహా విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో అక్రమాలకు పాల్పడినట్లు సీబీఐ ఆరోపిస్తోంది. కోల్‌కతా హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి.

కర్ణాటక రాజకీయాలతో లింగాయత్‌లది విడదీయ లేని బంధం. వారు ఎన్నికల్లో గెలుపోటముల్ని శాసించే శక్తిసామర్థ్యాలున్న సామాజిక వర్గం. ఒకప్పుడు కాంగ్రెస్‌కు గట్టి మద్దతుదారులైన లింగాయత్‌లు కొన్ని దశాబ్దాలుగా బీజేపీకి అండగా నిలుస్తున్నారు. అయితే ఆ సామాజికవర్గానికి చెందిన బలమైన నాయకుడు యడియూరప్పను సీఎం పదవి నుంచి బీజేపీ తప్పించడంతో లింగాయత్ మఠాధిపతుల్లో అసహనం మొదలైంది. అది ఎలా పరిణమిస్తుంది? లింగాయత్‌ల ఓట్ల కోసం బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయి...?

కన్నడనాట వారి ఓట్లే కీలకం
ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో బీజేపీ, కాంగ్రెస్

లింగాయత్‌ల జనాభా: 1.5 కోట్లు
రాష్ట్ర జనాభాలో శాతం: 17%
ప్రభావం చూపించే స్థానాలు: 100-120
ప్రస్తుత అసెంబ్లీలో లింగాయత్ ఎమ్మెల్యేలు: 54 (బీజేపీ -37)
1952 నుంచి లింగాయత్ సీఎంలు: 10



లింగాయత్ పవర్!

ఉత్తర కర్ణాటకలో లింగాయత్‌ల ప్రాబల్యం ఎక్కువ. రాష్ట్ర జనాభాలో 17% ఉన్న వీరు కీలక ఓటుబ్యాంకు. ఒకప్పుడు కాంగ్రెస్‌కు పెట్టని కోట అయిన లింగాయత్‌లు 1990 తర్వాత బీజేపీ వైపు మళ్లారు. వీరి ఓటుబ్యాంకునే నమ్ముకున్న బీజేపీ ఇతర సామాజిక వర్గాల కోసం పెద్దగా చేస్తున్నదేమీ లేదు. తాజాగా ముస్లింల 4% రిజర్వేషన్లను తొలగించి లింగాయత్, వక్కలిగలకు చెరో 2% కట్టబెట్టింది కూడా. అయితే బలమైన లింగాయత్ నాయకుడు యడియూరప్పను సీఎం పదవి నుంచి తొలగించినప్పటి నుంచీ ఆ వర్గంలో నెలకొన్న అసంతృప్తి అంతా ఇంతా కాదు. సీఎం బసవరాజ్ బొమ్మై లింగాయతే అయినా తమ అభిమాన నాయకున్ని అవమానకరంగా తొలగించారన్నది వారి ఆగ్రహం.

కాంగ్రెస్ వ్యూహరచన

ఒకప్పుడు తమ కీలక ఓటుబ్యాంకు అయిన లింగాయత్‌లను మరోసారి అక్కున చేర్చుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. యడియూరప్ప విషయమై వారిలో నెలకొన్న అసంతృప్తిని అనుకూలంగా మార్చుకునే పనిలో పడింది. లింగాయత్‌లకు అత్యధిక టికెట్లు ఇవ్వడానికి కసరత్తు చేస్తోంది. ఇప్పటిదాకా ప్రకటించిన 166 మంది అభ్యర్థుల్లో 43 మంది లింగాయత్ సమాజికవర్గానికి చెందినవారే! 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నాటి కాంగ్రెస్ సీఎం సిద్దరామయ్య ప్రభుత్వ కార్యాలయాల్లో లింగాయత్‌ల గురువు బసవేశ్వర చిత్రపటాన్ని ఉంచాలని ఆదేశించారు. తమను మతపరమైన మైనారిటీలుగా గుర్తించాలన్న లింగాయత్‌ల డిమాండ్‌ను కూడా కాంగ్రెస్ తలకెత్తుకుంది. తాను రాష్ట్రంలో అధికారంలో ఉండగా ఈ మేరకు కేంద్రానికి సిఫార్సు కూడా చేసింది. దీనిపై కేంద్రం మౌనాన్ని కూడా ప్రచారాస్త్రంగా చేసుకుంటోంది.

అలా బీజేపీ ఓటుబ్యాంకుగా...

లింగాయత్‌లు కాంగ్రెస్ వెన్నంటి ఉన్న రోజుల్లో ఆ పార్టీ బంపర్ మెజారిటీలు కళ్లజూసింది. 1990లో లింగాయత్ నేత వీరేంద్ర పాటిల్ నేతృత్వంలో కాంగ్రెస్ 224 స్థానాలకు గాను ఏకంగా 179 చోట్ల గెలిచింది! కానీ తర్వాత కాంగ్రెస్‌లో చీలికలు, బీజేపీ ఎదుగుదల తదితర కారణాలతో లింగాయత్‌లు బీజేపీ వైపు మళ్లారు. ముఖ్యంగా కర్ణాటకలో మత ఘర్షణల వేళ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీవ్ గాంధీ రాష్ట్ర సీఎం వీరేంద్ర పాటిల్‌ను తప్పించడాన్ని చారిత్రక తప్పిదంగా చెబుతారు. అప్పట్నుంచి లింగాయత్‌లు కాంగ్రెస్‌కు బాగా దూరమయ్యారు. ఆ దెబ్బకు 1994 ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం 36 స్థానాలకు పరిమితమైంది! లింగాయత్‌ల రాజకీయ ప్రాబల్యానికి ఇది తార్కాణమంటారు. ఇక బీజేపీలో యడియూరప్ప ఎదుగుదలతో లింగాయత్‌లు పూర్తిగా ఆ పార్టీవైపు మళ్లారు. అయితే అవినీతి ఆరోపణలతో యడ్డీని బీజేపీ బహిష్కరించడంతో ఆయన కర్ణాటక జనతా పార్టీ (కేజేపీ) పేరుతో వేరుకుంపటి పెట్టుకున్నారు. దాంతో 2013 ఎన్నికల్లో లింగాయత్ ఓట్లు భారీగా చీలి బీజేపీ 40 సీట్లకు పరిమితమైంది. కేజేపీ కూడా పెద్దగా సత్తా చాటలేదు. తర్వాత యడియూరప్ప తిరిగి బీజేపీ గూటికి చేరారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ చరిష్మా కూడా కలిసొచ్చి 28 ఎంపీ స్థానాల్లో బీజేపీ 17 గెలుపొందింది.

స్వాతంత్య్రోద్యమంలోనూ...

12వ శతాబ్దంలో సంఘ సంస్కర్త బసవేశ్వర లింగాయత్‌లకు నిర్దిష్ట జీవన విధానాన్ని ఏర్పాటు చేశారు. వీరు వీరశైవుల నుంచి దూరమై వేదాలను, కుల వ్యవస్థను వ్యతిరేకించేవారు. దేవాలయాలకు వెళ్లడం, బహుదేవతారాధన మాని ప్రగతిశీల భావాలు అలవర్చుకున్నారు. స్త్రీ పురుషులు సమానమని నమ్ముతారు. లింగాయత్‌లలో మహిళలకు ప్రత్యేక హక్కులున్నాయి. వారికి పెళ్లి చేసుకోకున్నా, భర్తను కోల్పోయినా పిల్లల్ని దత్తత చేసుకునే స్వేచ్ఛ ఉంది. స్వాతంత్య్ర సంగ్రామంలోనూ లింగాయత్‌లది చురుకైన పాత్ర. ప్రస్తుతం వీరశైవులు, లింగాయత్‌లు దాదాపుగా కలిసిపోయారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

లింగాయత్ మఠాల ప్రాధాన్యం...

కర్ణాటకలో 500కు పైగా లింగాయత్ మఠాలున్నాయి. వీటి చుట్టూనే రాజకీయాలు నడుస్తూ ఉంటాయి. లింగాయత్ ఉపకులాలూ కీలకమే. వీరు మఠాధిపతులు గీచిన గీత దాటరు. లింగాయత్‌లు అత్యధికంగా ఉన్న ఉత్తర కర్ణాటకలోని 22 జిల్లాల్లో బాగా పట్టున్న అఖిల భారత వీరశైవ మహాసభ రాష్ట్ర రాజకీయాల్లో బాగా చురుగ్గా ఉంది. బొమ్మై కూడా లింగాయతే అయినా ఈ మఠాల మద్దతు యడియూరప్పకే! ఆయన్ను సీఎంగా తప్పించినప్పటి నుంచీ మఠాధిపతులు గుర్రుగా ఉన్నారు. పర్యవసానం అనుభవిస్తారంటూ బీజేపీకి వారు బహిరంగంగానే హెచ్చరికలు జారీ చేశారు. దాంతో ఈసారి ఎన్నికల్లో గట్టెక్కించే బాధ్యతను బీజేపీ యడ్డీ భుజస్కంధాలపైనే ఉంచింది. దాంతో ఆయన మఠాధిపతుల్ని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

కాంగ్రెస్‌లోకి శెట్టర్

- ఉత్తర కర్ణాటకలో బీజేపీకి ఎదురుదెబ్బ!
- శెట్టర్‌ను ఆపేందుకు నేతల విఫలయత్నం
- ఇక 150కి పైగా అసెంబ్లీ సీట్లు మావే: ఖర్గే


ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న శెట్టర్

సాక్షి బెంగళూరు: కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీకి సీనియర్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్ (67) గట్టి షాకిచ్చారు. ఆదివారం పార్టీకి రాజీనామా చేసిన ఆయన సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ తనను తీవ్రంగా అవమానించిందంటూ ఈ సందర్భంగా మరోసారి నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో తాను నిర్మించిన పార్టీయే అక్కర్లేదంటూ వదిలించుకుందన్నారు. ఆత్మగౌరవం కోసమే కాంగ్రెస్‌లో చేరి కొత్త జీవితాన్ని మొదలు పెడుతున్నట్టు చెప్పారు. బెంగళూరులో పీసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ చీఫ్ డీకే శివకుమార్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్ సుర్జేవాలా, విపక్ష నేత సిద్ధరామయ్య శెట్టర్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన చేరికతో పార్టీకి మరింత బలం వచ్చిందని ఖర్గే అన్నారు. "శెట్టర్‌కు కాంగ్రెస్ సిద్ధాంతాలు తెలుసు. స్వాభిమానాన్ని కాపాడుకునేందునే ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఆయన రాకతో ఉత్తర కర్ణాటకలో పార్టీ మరింత బలోపేతమవుతుంది. 150కి పైగా సీట్లు నెగ్గుతాం'' అని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తర కర్ణాటకకు చెందిన లింగాయత్ నాయకుడైన శెట్టర్ నిష్క్రమణ బీజేపీకి గట్టి దెబ్బేనని భావిస్తున్నారు. ఇక లింగాయత్‌లంతా బీజేపీని వీడి కాంగ్రెస్‌కే మద్దతిస్తారని ఆ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ ఎంబీ పాటిల్ చెప్పుకొచ్చారు. లింగాయత్ వర్గానికే చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ్ సావాది గత వారమే బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే.

ఎత్తులు, పై ఎత్తులు

శెట్టర్ కాంగ్రెస్‌లో చేరే ముందు ఆదివారం నుంచీ నాటకీయ పరిణామాలు జరిగాయి. బీజేపీని వీడొద్దని సంఘ్ పరివార్ నాయకులు ఆయన్ను ఒత్తిడి చేశారు. మరోవైపు ఆయన్ను ఎలాగైనా చేర్చుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తూ వచ్చింది. ఆదివారం అర్ధరాత్రి దాకా బీజేపీ ఎత్తులకు పై ఎత్తులు వేసింది. అయితే, "నాతో గౌరవంగా నడుచుకోవాలి. ఎన్నికల తర్వాత నిర్లక్ష్యం చేయొద్దు. హుబ్లీ–ధార్వాడ స్థానంలో వెంటనే నాకు బీ ఫారం ఇవ్వాలి. వచ్చే లోకసభ ఎన్నికల్లో హుబ్లీ–ధార్వాడ టికెట్ మా కుటుంబీకులకే ఇవ్వాలి'' అంటూ కాంగ్రెస్ ముందు శెట్టర్ డిమాండ్లు పెట్టి, వాటికి ఒప్పుకున్నాకే చేరినట్టు తెలిసింది. పార్టీలో చేరగానే శివకుమార్ ఆయనకు హుబ్లీ–ధార్వాడ బీ ఫారం అందజేశారు.

కృత్రిమ మేధను తలచుకొంటే నిద్రలేని రాత్రులే

గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్




వాషింగ్టన్: కృత్రిమ మేధను సరిగా వాడకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని అల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ హెచ్చరించారు. ముప్పు నుంచి బయటపడాలంటే ఏఐ సాంకేతికతపై నియంత్రణ ఉండాలని చెప్పారు. కృత్రిమ మేధ వల్ల తలెత్తే దుష్ప్రభావాల గురించి తలచుకుంటూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నానని తాజాగా ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో పిచాయ్ చెప్పారు. ఈ టెక్నాలజీ ప్రయోజనకరమైన రీతిలో ఉపయోగించుకొనేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఐతో అసత్య సమాచారాన్ని సృష్టించే వీలుందని, ఇది సమాజానికి ప్రమాదకరమని అన్నారు. అణ్వాయుధాలను నియంత్రిస్తున్న తరహాలోనే ఏఐని నియంత్రించడానికి ఒక అంతర్జాతీయ కార్యాచరణ అవసరమని అభిప్రాయపడ్డారు.

దేశవ్యాప్తంగా ఠారెత్తిస్తున్న ఎండలు

న్యూఢిల్లీ: ఎండలు ఠారెత్తిస్తున్నాయి. దేశంలోని చాలా ప్రాంతాల్లో సోమవారం సాధారణం కంటే ఎక్కువగా 40 డిగ్రీల సెల్సియస్ చేరువలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తూర్పు, వాయవ్య భారతదేశంలో వచ్చే నాలుగు రోజుల్లో వడగాలులు వీసే అవకాశాలున్నాయని వాతావరణ విభాగం పేర్కొంది. పశ్చిమబెంగాల్, బిహార్, ఒడిశా, సిక్కిం, జార్ఖండ్ రాష్ట్రాలతోపాటు పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌ల్లో ఈ పరిస్థితులుంటాయని వివరించింది. దక్షిణ భారతంలోని ఏపీ తీరప్రాంతంలో బుధవారం వరకు భానుడి ప్రతాపం కొనసాగుతుందని తెలిపింది. దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం వరుసగా రెండో రోజు సాధారణం కంటే కనీసం 5 డిగ్రీలు ఎక్కువగా ఉష్ణోగ్రత నమోదైనట్లు వివరించింది. బుధవారం నాటికి వాతావరణం కొద్దిగా చల్లబడే అవకాశాలున్నాయంది.

స్వలింగ పెళ్లిళ్లకు చట్టబద్ధత కల్పించలేం

- సుప్రీంకోర్టులో కేంద్రం పిటిషన్
- కోర్టులు జోక్యం చేసుకోవద్దని వినతి
- నేడు విచారణ చేపట్టనున్న ధర్మాసనం



న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించడం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా తేల్చిచెప్పింది. ఆడ, మగ మధ్య జరిగే వివాహాలకు మాత్రమే వ్యవస్థ నుంచి గుర్తింపు లభిస్తుందని సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న వివాహ వ్యవస్థతో సమానంగా స్వలింగ వివాహాలను గుర్తించలేమని స్పష్టం చేసింది. ఇద్దరు పురుషులు లేదా ఇద్దరు స్త్రీల మధ్య జరిగే పెళ్లిళ్లను చట్టబద్ధంగా గుర్తించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ల విచారణార్హతను ప్రశ్నిస్తూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసింది. తమను తాము ఉన్నత నాగరికులుగా భావించుకొనే కొందరు వ్యక్తులు తమ అభిప్రాయాలను సమాజం మొత్తం అంగీకరించాలన్న ఉద్దేశంతో కోర్టులో పిటిషన్లు వేశారని ఆక్షేపించింది. వివాహాలకు చట్టబద్ధత కల్పించడం అనేది చట్టసభలకు సంబంధించిన వ్యవహారమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. ఈ అంశాన్ని చట్టసభలకే వదిలేయాలని, న్యాయస్థానాలు జోక్యం చేసుకోరాదని కోరారు. స్వలింగ వివాహాలను చట్టబద్ధంగా గుర్తించాలా? లేదా? అనేది చట్టసభలే నిర్ణయిస్తాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున ఆయన పిటిషన్ దాఖలు చేశారు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించడం అనేది వ్యక్తిగత చట్టాలు, సామాజిక ఆమోదం పొందిన విలువల మధ్య ఉన్న సున్నితమైన సమతూకాన్ని దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపడతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తెలియజేసింది. ఇదిలా ఉండగా, స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలపై ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం నుంచి విచారణ ప్రారంభించనుంది. రాజ్యాంగ ధర్మాసనం వెలువరించే తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

కులగణన వివరాలేవి?

- మోదీ ప్రభుత్వానికి రాహుల్ ప్రశ్న
- నైష్పత్తిక రిజర్వేషన్లకు, 50 శాతం పరిమితి రద్దుకు డిమాండ్
- గొంతు కలిపిన విపక్షాలు



సాక్షి, బళ్లారి: రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తేయాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మరోసారి డిమాండ్ చేశారు. దళితులు, ఆదివాసీలకు వారి జనాభాకు తగ్గట్టుగా అవకాశాలు దక్కేందుకు వీలుగా నైష్పత్తిక రిజర్వేషన్ల పద్ధతి తేవాలన్నారు. 2011లో మోదీ సర్కారు చేపట్టిన కులగణన వివరాలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. తద్వారా బీసీలకు మెరుగైన రిజర్వేషన్లు కల్పించేందుకు వీలవుతుందని అభిప్రాయపడ్డారు. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బాల్కీ, హుమ్నాబాద్‌ల్లో ఆయన ప్రచార సభల్లో మాట్లాడారు. ఓబీసీలపై మోదీ కేవలం మాటల్లోనే ప్రేమ ఒలకబోస్తారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే కులగణన వివరాలు బయట పెడతామని చెప్పారు. ప్రతి పనికి 40 కమీషన్ తీసుకుంటున్న బీజేపీ సర్కారుకు ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. "రాష్ట్రంలో బీజేపీకి 40 సీట్లు కూడా రావు. ఉద్యోగ నియామకాల్లోనూ భారీ అవినీతి జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ అవినీతి విధానాలను, మోదీ, అదానీ బంధాన్ని గురించి లోక్‌సభలో ప్రశ్నిస్తే నా సభ్యత్వం తొలగించారు. కర్ణాటక ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెబితే దేశవ్యాప్తంగా ఆ పార్టీ పతనానికి నాంది అవుతుంది'' అన్నారు.

రాహుల్ కులగణన డిమాండ్‌కు పలు విపక్షాలు మద్దతిచ్చాయి. జేడీ(యూ) నేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌తో పాటు ఎస్పీ, బీఎస్పీ, ఆప్, బీజేపీ మిత్రపక్షం లోక్ జనశక్తి పార్టీ ఇందుకు మద్దతు పలికాయి. దేశవ్యాప్తంగా తాజాగా కులగణన చేపట్టాలంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే కూడా ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఆ లేఖను ఆయన తాజాగా ట్వీట్ చేశారు.

గుడ్డూ ముస్లిం.. బాంబు స్పెషలిస్ట్

అతీక్ నేర సామ్రాజ్యానికి వారసుడు! ● గుడ్డూపై యూపీ పోలీసుల నజర్


గుడ్డూ ముస్లిం


ఉమేశ్ పాల్‌పై బాంబు విసురుతూ

న్యూఢిల్లీ: గుడ్డూ ముస్లిం.. ఇప్పుడు ప్రముఖంగా వినిపిస్తున్న పేరు. ఎవరీ గుడ్డూ అంటూ అంతా ఆరా తీస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ శనివారం రాత్రి ముగ్గురు యువకుల కాల్పుల్లో గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్ మరణించడం తెలిసిందే. కాల్పులకు క్షణాల ముందు అష్రాఫ్ నోట వచ్చిన చివరి మాట గుడ్డూ గురించే. మెయిన్ బాత్ యే హై కీ గుడ్డూ ముస్లిం... (నేను చెప్పాలనుకుంటున్న ముఖ్యమైన విషయం గుడ్డూ ముస్లిం...) అని అంటూనే సోదరులిద్దరూ కాల్పులకు బలయ్యారు.

గుడ్డూ అతీక్ అహ్మద్ ముఖ్య అనుచరుడు. తుపాకుల బదులు బాంబులు వాడటం ఇతని స్టైల్. బాంబులు విసిరి ప్రత్యర్థులను అంతం చేయడంలో దిట్ట. ఈ ఏడాది ఫిబ్రవరి 24న ప్రయాగ్‌రాజ్‌లో పట్టపగలే ఉమేశ్ పాల్ హత్య జరిగింది. ఆ సమయంలో గుడ్డూ బైక్ వెనుక కూర్చొని నాటు బాంబులు విసురుతున్న దృశ్యం సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యింది. అతీక్ మరణానంతరం అతడి నేరసామ్రాజ్యం గుడ్డూ చేతికి వెళ్తుందని ప్రచారం సాగుతోంది. దాంతో యూపీ పోలీసుల నజర్ ఇప్పుడు అతనిపైనే ఉంది. ఉమేశ్ హత్య కేసులో 10 మంది నిందితుల్లో గుడ్డూ పేరూ ఉంది. ఆ పది మందిలో ఇప్పటిదాకా ఆరుగురు హతం కాగా గుడ్డూతో సహా మిగతా వారంతా పరారీలో ఉన్నారు. గుడ్డూ ప్రస్తుతం కర్ణాటకలో తలదాచుకుంటున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

నమ్మినబంటు

గుడ్డూ ముస్లిం ప్రయాగ్‌రాజ్‌లో పుట్టాడు. చిన్న వయసులోనే నేర సామ్రాజ్యంతో పరిచయం ఏర్పడింది. లక్నోకు మకాం మార్చి పలు నేరాల్లో పాలుపంచుకున్నాడు. బడా వ్యక్తులతో సన్నిహితంగా మెలిగాడు. ఓ టీచర్ హత్య కేసులో 1997లో అరెస్టయ్యాడు. బలమైన సాక్ష్యాల్లేక విడుదలయ్యాడు. బిహార్‌కు వెళ్లి నేరాలు కొనసాగించాడు. 2001లో మళ్లీ అరెస్టవగా అతీక్ బెయిల్‌పై బయటకు తీసుకొచ్చాడు. కొన్నేళ్ల క్రితం గుడ్డూ అనారోగ్యం పాలై పరిస్థితి విషమించగా అతీక్ రూ.8 లక్షలు ఖర్చు చేసి గుడ్డూను బతికించాడు. అందుకు కృతజ్ఞతగా ఉమేశ్‌పై గుడ్డూ బాంబులు విసిరి హత్య చేశాడు. అతీక్‌కు నమ్మినబంటుగా పేరుతెచ్చుకున్నాడు. అతీక్ కోసం పాకిస్తాన్ నుంచి పంజాబ్ మీదుగా ఆయుధాలను భారత్‌కు అక్రమంగా రవాణా చేసేవాడని పోలీసులు వెల్లడించారు.


విచారణకు సిట్

అతీక్ శరీరంలో 9 తూటాలున్నట్టు పోస్టుమార్టంలో వెల్లడైంది. 8 తూటాలు ఛాతీ, వీపు నుంచి దూసుకెళ్లగా మరోటి తలలో కనిపించింది. అష్రాఫ్ తలపై ఒకటి, వీపుపై నాలుగు తూటా గాయాలను గుర్తించారు. ఈ హత్యోదంతంపై దర్యాప్తుకు సతీశ్ చంద్ర, సత్యేంద్ర ప్రసాద్, ఓం ప్రకాశ్ సభ్యులుగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటైంది. దీనిపై విచారణకు యూపీ ప్రభుత్వం ఇప్పటికే జ్యుడీషియల్ కమిషన్ వేయడం తెలిసిందే.

అన్నీ అనుమానాలే

ప్రయాగ్‌రాజ్/లక్నో/న్యూఢిల్లీ: గ్యాంగ్‌స్టర్లు అతీక్, అష్రాఫ్ హత్య విషయంలో పోలీసుల తీరుపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. అంతటి కరడుగట్టిన నేరగాళ్లను రాత్రిపూట ఎందుకు ఆసుపత్రికి తీసుకొచ్చారు? పైగా వారున్న వాహనాన్ని గేటు బయటే ఆపి నడిపించుకుంటూ ఎందుకు వచ్చారు? మీడియా కంటపడకుండా ఆసుపత్రి లోపలి దాకా వాహనంలో ఎందుకు తీసుకురాలేదు? పైగా ఐఎస్ఐ ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్నట్టు విచారణలో సోదరులిద్దరూ ఒప్పుకున్నారు. నిబంధనల ప్రకారం ఇలాంటి కేసుల్లో నిందితుల్ని మీడియాతో సహా ఎవరి కంటా పడనివ్వకూడదు. దాన్నీ తుంగలో తొక్కారు. హంతకులు ముగ్గురూ విలేకరుల ముసుగులో వచ్చి కాల్పులు జరపడం తెలిసిందే. మీడియా ప్రతినిధులను తనిఖీ చేయకుండానే గ్యాంగ్‌స్టర్ల దగ్గరికి అనుమతించడం వెనక కుట్ర ఉండొచ్చంటున్నారు. వారు 20 తూటాల దాకా కాల్చినా నిందితుల వెన్నంటే ఉన్న పోలీసుల్లో మాత్రం ఎవరికీ ఏమీ కాకపోవడం నమ్మశక్యంగా లేదంటున్నారు. నిందితులను సోమవారం ప్రతాప్‌గఢ్ జిల్లా జైలుకు తరలించారు.

ఇంకెవరూ పేల్చలేరు



యజమాని మినహా మరెవరూ పేల్చడం సాధ్యంగాని 9ఎంఎం తుపాకీ ఇది. ఫింగర్‌ప్రింట్ సెన్సార్, కాల్చే వ్యక్తిని పోల్చుకునే ఫేషియల్ రికగ్నేషన్ టెక్నాలజీ దీని సొంతం. ఇలాంటి తుపాకీ ప్రపంచంలో ఇదే మొదటిది. గన్‌ను పక్కన పెట్టేయగానే లాక్ అవుతుంది. అమెరికా వంటి దేశాల్లో చిన్నారులు పొరపాటున తుపాకీ కాల్చడం, గన్ చోరీ తదితరాలకు ఇక తెర పడుతుందని యూఎస్‌కు చెందిన తయారీ సంస్థ 'బయోఫైర్' చెబుతోంది. ఈ సంస్థకు ఇంటెల్, గూగుల్, నాసాలు తోడ్పాటునందిస్తున్నాయి.

వందేభారత్ రైళ్ల సరాసరి వేగం 83 కిలోమీటర్లు

న్యూఢిల్లీ: దేశంలో వందేభారత్ రైళ్లు సరాసరిన గంటకు 83 కిలోమీటర్ల వేగంతో నడుస్తున్నాయని అధికారులు తెలిపారు. గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగంతో నడిచేలా తయారైన ఈ రైళ్లను 130 కి.మీ. వేగంతో నడపవచ్చు. రైలు మార్గాల్లో నాణ్యత లేమి వల్ల తక్కువ వేగంతోనే నడుపుతున్నట్లు సమాచార హక్కు చట్టం కింద అందిన దరఖాస్తుకు రైల్వే శాఖ బదులిచ్చింది. "అత్యల్పంగా గంటకు 64 కి.మీ. సరాసరి వేగంతో ముంబై–షిర్డీ వందేభారత్ రైలు, గరిష్ఠంగా 95 కి.మీ. వేగంతో న్యూఢిల్లీ–వారణాసి రైలు నడుస్తోందని చెప్పారు. ఆగ్రా కంటోన్మెంట్–తుగ్లకాబాద్ రైలు మాత్రం గంటకు 160 కి.మీ. వేగంతో ప్రయాణిస్తోంది'' అని పేర్కొంది.

భటిండా కాల్పులు జవాన్ పనే

చండీగఢ్/న్యూఢిల్లీ: పంజాబ్‌లోని భటిండా సైనిక కేంద్రంలో ఈ నెల 12న నలుగురు జవాన్ల మృతికి కారణమైన కాల్పులకు దేశాయ్ మోహన్ అనే సహచర జవానే కారణమని తేలిసంది. అతన్ని అదుపులోకి తీసుకున్నట్టు భటిండా సీనియర్ ఎస్పీ గుల్‌నీత్ సింగ్ ఖురానా సోమవారం మీడియాకు తెలిపారు. "కాల్పులకు వాడిన ఇన్సాస్ రైఫిల్‌ను అతని నుంచి స్వాధీనం చేసుకున్నాం. ఘటనకు రెండు రోజుల ముందే ఇన్సాస్‌తో పాటు 28 రౌండ్ల మందుగుండును దొంగిలించి దాచి పెట్టాడన్నారు. నలుగురు జవాన్లు భౌతికంగా వేధించినందుకే వారిని చంపినట్టు అంగీకరించాడు. వాస్తవ కారణాన్ని మీడియాకు తెలపలేం'' అన్నారు.

అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్లు షురూ

జమ్మూ: అమర్‌నాథ్ వార్షిక యాత్రకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సోమవారం మొదలైంది. దేశవ్యాప్తంగా పలు బ్యాంకులకు చెందిన 542 బ్రాంచీల్లో పేర్ల నమోదుకు ఆలయ బోర్డు ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది దరఖాస్తును ఆన్‌లైన్‌లో నింపాల్సి ఉంటుంది. 13 ఏళ్లలోపు, 75 ఏళ్ల పైబడిన వారిని, 6 వారాలకు పైబడిన గర్భవతులను అనుమతించరు. దక్షిణ కశ్మీర్‌లో 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న గుహాలయంలో యాత్రికుల సందర్శన జూలై ఒకటో తేదీన మొదలై ఆగస్ట్ 31తో ముగియనుంది.

రూ.3,700 కోట్ల కొకైన్ పట్టివేత



రోమ్: ఇటలీలోని సిసిలీకి సమీపంలోని సముద్ర జలాల్లో తేలియాడుతున్న కొకైన్ ప్యాకెట్లివి. సుమారు రెండు టన్నుల బరువున్న 70 బండిళ్లలో 1,600 ప్యాకెట్లలోని ఈ కొకైన్ విలువ ఏకంగా రూ.3,700 కోట్లు! స్మగ్లర్లు వీటిని బహుశా నౌకలో తెచ్చి ఇక్కడ వదిలేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. నీటిపై తేలియాడుతున్న వీటి జాడ తెలుసుకునేందుకు వీలుగా ప్యాకెట్లకు ట్రాకింగ్ డివైజ్‌ను కూడా అమర్చారని చెప్పారు. హెలికాప్టర్ ద్వారా పెట్రోలింగ్ చేస్తుండగా ఇవి కనిపించాయి.

రష్యా జర్నలిస్టుకు పాతికేళ్ల జైలు

మాస్కో: ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని తప్పుబట్టినందుకు వ్లాదిమిర్ కారా–ముర్జా జూనియర్(41) అనే జర్నలిస్టు, రాజకీయ కార్యకర్త జైలు పాలయ్యాడు. దేశద్రోహం నేరకింద రష్యా కోర్టు ఆయనకు 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది. సైనిక చర్యను బహిరంగంగా విమర్శిస్తున్న ఆయనపై ఇప్పటికే రెండుసార్లు విషప్రయోగం జరిగింది. జైలుశిక్షను అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు, పాశ్చాత్య దేశాలు తీవ్రంగా ఖండించాయి.



న్యూయార్క్‌లో సోత్‌బే సంస్థ త్వరలో వేలంవేయనున్న ఈ కెంపు బరువు 55.22 క్యారెట్లు. ఇంతటి బరువైన కెంపును వేలానికి పెట్టడం ఇదే తొలిసారి. కనీసం రూ.250 కోట్ల ధర పలక వచ్చని అంచనా. సోమవారం హాంకాంగ్‌లో ప్రదర్శనకు పెట్టినప్పటి ఫొటో ఇది.

సాక్షి కరీంనగర్

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న గోశాలలోని 20 కోడెలను జనగామ జిల్లా చిల్‌పూర్ మండలం కొండాపూర్‌కు చెందిన దళిత మహిళల గోరక్ష సమితికి అందజేశారు.



'కైరవ శతకం' ఆవిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: స్వేచ్ఛాకవి, విశ్రాంత ఉపాధ్యాయుడు సుదర్శనం వేణుశ్రీ రాసిన కైరవ శతకం పుస్తకాన్ని తెరసం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆవిష్కరించారు.

గరిష్టం/కనిష్టం
41.0/32.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.

హింస ద్వారా పరధర్మాన్ని అణచడం రక్తపాతం కంటే అత్యంత తీవ్రమైనది.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
మంగళ 6:36	బుధ 4:30

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

రాములోరి హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న వలంటీర్లు

ఇల్లందకుంట(హుజూరాబాద్): అపర భద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు చేపట్టారు. 45 రోజులకు గాను 34 హుండీలను లెక్కించగా మొత్తం రూ.32,28,150, 18 గ్రాముల బంగారం, 320 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి సుధాకర్ తెలిపారు. కాగా గతేడాది కంటే సుమారు రూ.4 లక్షల ఆదాయం ఎక్కువగా వచ్చిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కంకణాల శ్రీలత, కరీంనగర్ డివిజన్ దేవాదాయశాఖ పరిశీలకుడు సత్యనారాయణ, అర్చకులు, సిబ్బంది, కల్కి సేవా సమితి (జమ్మికుంట) సభ్యులు పాల్గొన్నారు.

దశాబ్దాలుగా చెప్పల్లేకుండానే..



చెప్పులు లేకుండా బీరయ్య

కరీంనగర్ అర్బన్: అసలే ఎండుతున్న మండలు.. ఆపై చెప్పులు ధరించకుండా నడకంటే ఊహించడం కష్టంగా ఉంది కదూ. కానీ.. రామడుగు మండల కేంద్రానికి చెందిన ఒగ్గరి బీరయ్యకు 70 ఏళ్లు. ఇప్పటికి వ్యవసాయం చేసుకుంటుండగా 2002 నుంచి చెప్పులు ధరించడం లేదు. మేకలు కాసుకోవడంతోపాటు ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తున్నాంటాడు. ఎండైనా, వానైనా, అడవుల్లోకి వెళ్లినా పాదరక్షలు లేకుండా నడక సాగిస్తున్నాడు. సోమవారం కలెక్టరేట్‌కు తన సమస్యపై ఫిర్యాదు చేసేందుకు వచ్చాడు. తన సాగు భూమిలోకి గ్రామ పంచాయతీ మురికి నీరు వదులుతూ నానా ఇబ్బందులు పెడుతోందని ఫిర్యాదు చేశాడు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సై

గన్నేరువరం(మానకొండూర్): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సీపీ సుబ్బారాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల వివరాలు తెలుసుకుని సంబంధిత రికార్డులు పరిశీలించారు. ఠాణా నిర్మాణానికి కేటాయించిన స్థలం, టెండర్ ప్రక్రియ వివరాలు తెలుసుకున్నారు. సీపీ వెంట ఏసీపీ కరుణాకర్ రావు, సీఐ రమేశ్, ఎస్సై సురేందర్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో (రామంతపూర్, బేగంపేట్) 1వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో చేరేందుకు ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ఎస్సీ సంక్షేమశాఖ డీడీ నేతానియల్ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు రెండు సీట్లు కేటాయించారని (రామంతపూర్ -1, బేగంపేట-1) ఆసక్తి గల విద్యార్థులు మే 1 సాయంత్రం 5 గంటలలోపు కరీంనగర్ ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1,50,000, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు మించరాదన్నారు. దరఖాస్తుతో పాటు నేటివిటీ, పుట్టిన తేదీ, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను జతపరచాలని తెలిపారు. రెండు కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే మే 4న మధ్యాహ్నం 2 గంటలకు కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని వివరించారు. లాటరీ ద్వారా నిర్వహించే ఎంపికకు హాజరయ్యేందుకు ఎలాంటి రవాణా ఖర్చులు చెల్లించబడవని తెలిపారు. గడువు తరువాత వచ్చిన, అసంపూర్తిగా ఉన్న దరఖాస్తు ఫారాలు, సంబంధిత సర్టిఫికెట్స్(జిరాక్స్)కాపీలు జత చేయకుంటే అట్టి దరఖాస్తులను తిరస్కరించబడునని పేర్కొన్నారు.



చొప్పదండిలో రాత్రి వేళ రోడ్డుపై వాహనాలను ఆపుతున్న యువకులు (ఫైల్)

చొప్పదండిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ రవీందర్ (ఫైల్)

'చొప్పదండి ప్రాంతంలో గంజాయి సేవించడం అలవాటు గల యువకుడు ఇటీవల తన స్నేహితుడితో బైక్‌పై అతివేగంగా వెళ్తుండగా నగర శివారుల్లో బైక్ అదుపుతప్పి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతడి తలకు బలమైన గాయం కాగా, ఒళ్లంతా రక్తంతో తడిసిపోవడంతో తన స్నేహితుడు, స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ యువకుడు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతున్నాడని తెలిసింది. చాలా మంది యువత మత్తు పదార్థాలు సేవిస్తూ రోడ్డు ప్రమాదాలకు గురవుతూ తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చుతున్నారు'.

మత్తులో మరణ మృదంగం

చాపకింద నీరులా గంజాయి సరఫరా

- చొప్పదండిలో బానిసలుగా మారిన యువత
- రాత్రి పగలు లేకుండా గంజాయి సేవనం
- మైనర్లే మత్తుకు బానిసలు..!
- చొప్పదండిలో గంజాయి సేవనానికి అద్దెగదులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: గంజాయి మత్తులో యువత ప్రమాదాలకు గురవుతున్నారు. యువతరం మత్తుకు బానిసై అతివేగంగా వాహనాలు నడుపుతూ మృత్యువు ఒడికి చేరుతున్నారు. ఇప్పటివరకు ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోగా వివిధ ప్రమాదాల్లో ఆసుపత్రిల్లో చికిత్స పొందిన వారు అనేకం. అడ్డూ అదుపు లేకుండా చొప్పదండిలో గంజాయి సరఫరా సాగుతోందని ఆరోపణలున్నాయి. చొప్పదండి పట్టణంతోపాటు పరిసరప్రాంతాల్లో గంజాయి వాడకం చాపకింద నీరులా పెరిగింది. ఇతర ప్రాంతాల నుంచి పలువురు గంజాయిని అక్రమంగా తరలిస్తూ.. స్థానిక యువకులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. గంజాయి సేవించడానికి బానిసలైన యువకులు రాత్రి వేళల్లో పట్టణంలోని చీకటి ప్రాంతాల్లో అమ్మకందారుల నుంచి కొనుగోలు చేసి వాడుతూ విచ్చలవిడితనానికి అలవాటు పడుతున్నారు. గత కొంతకాలంగా గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులు యువతను లక్ష్యంగా చేసుకొని అమ్మకాలు చేపట్టగా సుమారు యాభై మంది వరకు యువకులు ఇప్పటికే గంజాయి సేవించడానికి పగలు, రాత్రి తేడా లేకుండా బానిసలుగా మారారని సమాచారం. పట్టణ శివారు ప్రాంతాల్లో రాత్రివేళల్లో పోలీసుల కళ్లు గప్పి గంజాయి వ్యాపారాన్ని యథేచ్ఛగా నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అందరూ ఒకే చోటుకు..

ఇంట్లో కుటుంబ సభ్యులకు తెలియకుండా గంజాయి సేవించడానికి అలవాటు పడ్డ పలువురు యువకులు ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు గాలం వేస్తున్నారు. ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులు ఇంట్లో నుంచి వచ్చి గంజాయి వాడకానికి అలవాటు పడుతున్నారు. మత్తుకు బానిస అయిన విద్యార్థులు ఒకే చోట చేరి అర్ధరాత్రి వరకు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం. గంజాయి మత్తులో రాత్రి వేళల్లో రోడ్లపై త్రిబుల్ రైడింగ్, వాహనాలను ఇష్టారీతిన నడుపడం, మైకంలో వాహనాలను నిలిపివేయడం వంటి చేష్టలతో ప్రయాణికులు కూడా ఇబ్బంది పడుతున్నారు.

మత్తు కలిపిన గుట్కాలు అమ్మకం

గంజాయితోపాటు వివిధ మత్తు పదార్థాలను సేవిస్తున్న యువకులు రాత్రి వేళల్లో ప్రజా జీవనానికి ఆటంకం కలిగిస్తున్నారు. ముఖ్యంగా రోడ్లపై మైకంలో వాహనాలను ఆపుతూ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో మత్తు పదార్థాలు కలిపిన గుట్కాలను అమ్ముతున్నట్లు ఆరోపణలున్నాయి. మత్తు పదార్థాల విస్తరణతో దానికి బానిస అవుతున్న యువకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇది ఇలా ఉండగా ఎక్కువ మంది చొప్పదండికి జనగామ, హైదరాబాద్ నుంచి గంజాయి దిగుమతి చేసుకుంటున్నట్లు సమాచారం.

గంజాయి సేవనానికి గదులు అద్దెకు..

చొప్పదండి పట్టణంలో కేవలం గంజాయి సేవనానికి ప్రత్యేకంగా గదులు అద్దెకు తీసుకున్నారంటే పరిస్థితి ఎంత దూరం వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. అద్దెకు తీసుకొని మత్తు పదార్థాలకు బానిసవుతున్న విషయం చొప్పదండి మొత్తం బహిరంగ రహస్యమే. చొప్పదండితో పాటు పరిసర గ్రామాల నుంచి కూడా యువకులు, విద్యార్థులు గంజాయి సేవించడానికి చొప్పదండికి తరలివస్తుండడం ఈ పరిస్థితికి దారితీస్తుంది. గతేడాది జూన్‌లో గంజాయి సేవించి రోడ్డుపై అనుచిత ప్రవర్తనకు పాల్పడ్డవారిని అప్పటి చొప్పదండి పోలీసులు పట్టుకున్నారు. గ్రూపులుగా ఏర్పడి కొట్టుకోవడం, రహదారిపై వాహనదారులతో అనుచిత ప్రవర్తన, ఇతర న్యూసెన్స్ కార్యక్రమాలపై చొప్పదండి పోలీసులు కేసు నమోదు చేశారు. బ్లూకోల్ట్స్ పోలీసుల ఫిర్యాదుతో కేసు నమోదు చేయగా, కేసు నమోదైన యువకులకు పోలీస్‌స్టేషన్‌లో వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

కరీంనగర్‌అర్బన్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 2022–23 యాసంగి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కొనుగోలు కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చే రైతుల కోసం షామియానా, మంచినీరు, కుర్చీలు ఏర్పాటు చేయాలని, ధాన్యాన్ని ఎఫ్‌ఏక్యూ ప్రమాణాలకు అనుగుణంగా వెనువెంటనే కొనుగోలు పూర్తి చేయాలన్నారు. ధాన్యం వివరాలు ఏ రోజుకారోజు ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని ఆదేశించారు. ఏవైన సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్రాల నుంచి ధాన్యం తరలింపులో లారీల కొరత ఏర్పడకుండా చూడాలని, లారీలు సరిపోకుంటే డీసీఎం, ట్రాక్టర్లను వినియోగించాలని పేర్కొన్నారు. ప్రతీ కేంద్రంలో ప్యాడీ క్లీనర్లు, తేమశాతం కొలుచు మిషన్‌లు అందుబాటులో ఉండాలన్నారు. మిల్లర్లు ఎఫ్‌ఏక్యూ ప్రమాణాల విషయంలో ఇబ్బందులు సృష్టించరాదని, కేంద్రాల నుంచి వచ్చే ప్రతి ధాన్యం గింజను కొనాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ సీజన్లో 4,52,885 మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వస్తుందని అంచనా వేయడం జరిగిందని వివరించారు. తదనుగుణంగా 353 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఒక కోటి 13 లక్షల గన్నీ సంచులు అవసరం కాగా ప్రస్తుతం 65 లక్షల సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీఏఓ శ్రీధర్, జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మావతి, పౌరసరఫరాల శాఖ అధికారి సురేష్, డీఆర్డీఓ శ్రీలత, సహకార శాఖ అధికారి శ్రీమాల, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారం అందుకున్న తిమ్మాపూర్ ఎంపీపీ



అవార్డు స్వీకరిస్తున్న ఎంపీపీ వనిత, అదనపు కలెక్టర్ అగర్వాల్, డీపీఓ వీరబుచ్చయ్య, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి

తిమ్మాపూర్(మానకొండూర్): నానాజీ దేశముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ అవార్డులను ఢిల్లీలో కేంద్ర మంత్రి గిరిరాజ్‌కిశోర్ సోమవారం ప్రదానం చేశారు. జాతీయ స్థాయి బ్లాక్ పంచాయతీ అవార్డులో భాగంగా తిమ్మాపూర్ మండలం రెండో స్థానంలో ఉత్తమ మండలంగా ఎంపికైంది. ఈ సందర్భంగా ఎంపీపీ కేతిరెడ్డి వనిత, అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్, డీపీఓ వీరబుచ్చయ్య, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి అవార్డు స్వీకరించారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ జరిగిన కార్యక్రమంలో షీల్డ్, ప్రశంసాపత్రంతో పాటు రూ.1.75 క్యాష్ రివార్డును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, కమిషనర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. కాగా అవార్డు సాధనకు సహకరించిన మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కలెక్టర్ కర్ణన్, జెడ్పీ సీఈవో ప్రియాంక, డీఆర్డీవో, డీఎల్‌పీవోకు ఎంపీపీ వనిత కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీపీని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సన్మానించారు.

మండల ప్రజలకు అవార్డు అంకితం

తిమ్మాపూర్ మండలానికి అవార్డు రావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, మండల ప్రజలకు ధన్యవాదాలు. అందరి సహకారంతోనే అవార్డు సాధ్యమైంది. సమష్టి కృషితో సాధించిన అవార్డు మండల ప్రజలకే అంకితం.
– కేతిరెడ్డి వనితాదేవేందర్‌రెడ్డి, ఎంపీపీ, తిమ్మాపూర్

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభంపై సందిగ్ధత

- 1న తీగల వంతెన.. 3న టీటీడీ భూమిపూజ జరిగేనా!
- మంత్రి గంగుల కాలికి గాయంతో ఇంట్లోనే విశ్రాంతి



గంగులను పరామర్శిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, సీపీ సుబ్బారాయుడు, ఏసీపీ శ్రీనివాస్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితరులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్‌రూరల్ మండలం చెర్లభూత్కూర్ గ్రామంలో వేదిక కూలి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ కాలికి గాయం కావడంతో పది రోజులపాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దీంతో జిల్లాకు తలమానికమైన తీగల వంతెన ప్రారంభోత్సవంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏప్రిల్ 14న తీగలవంతెనను ప్రారంభించాలని అనుకున్నా హైదరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఉండడంతో వాయిదా వేశారు. రెండు మూడు రోజుల్లో ప్రారంభించుకుందామనుకున్న సమయంలోనే మంత్రి కాలికి గాయమైంది. దీంతో ప్రారంభోత్సవం మరోసారి వాయిదాపడ్డట్లయింది. అయితే.. తాజాగా మే 1న తీగల వంతెన ప్రారంభోత్సవంతోపాటు తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో నిర్మించే ఆలయ నిర్మాణానికి మే 3న భూమిపూజ కార్యక్రమ షెడ్యూల్ ఖరారైంది. అయితే.. అప్పటివరకు మంత్రి గాయం నుంచి కోలుకుంటారో లేదోనన్న సందేహం నెలకొంది. దీంతో అభివృద్ధిపనులు, ప్రారంభోత్సవాల కార్యక్రమాలపై సందిగ్ధత నెలకొంది. కాగా.. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన నేపథ్యంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సోమవారం మంత్రి ఇంట్లోనే చర్చలు జరిపారు. రైతులకు ఎలాంటి ఇక్కట్లు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని, గన్నీ సంచుల కొరత ఉండబోదని అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్షించారు. మంత్రిని పరామర్శించేందుకు వస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులతో అభివృద్ధి, పథకాల అమలు, షెడ్యూల్ పరంగా ముందస్తు ఉన్న కార్యక్రమాల తీరు తెన్నులపై ఆరా తీస్తున్నారు. పార్టీ ఆత్మీయ సమ్మేళనాలపైనా నియోజకవర్గ నాయకులతో మాట్లాడుతున్నారు.

కర్ర సాయంతోనైనా పాల్గొంటా..

మే 1న తీగలవంతెన ప్రారంభోత్సవం, 3న టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆలయ నిర్మాణ పనుల భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటా. అప్పటివరకు కాలి గాయం తగ్గే అవకాశాలు ఉన్నాయి. నొప్పి తగ్గకుంటే కర్ర సాయంతోనైనా హాజరవుతా.
– గంగుల కమలాకర్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి

ప్రజా'వాణి'.. ఇక్కట్ల బాణి

- భానుడి ప్రతాపానికి వృద్ధులు, చిన్నారుల విలవిల



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కర్ణన్, అధికారులు

కరీంనగర్ అర్బన్: సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణికి ప్రతి సోమవారం వందల మంది వస్తుంటారు. గతంలో పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదైన సమయాల్లో 8 నుంచి 12గంటల వరకే నిర్వహించేవారు. ప్రస్తుతం సదరు విధానానికి స్వస్తి పలకడంతో వడగాలులు, ఉక్కబోతతో చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం 209 అర్జీలు రాగా వారి వెంట వచ్చినవారితో కలిపి సుమారు 400 మంది వరకు ప్రజావాణికి వచ్చారు. ఉన్నతాధికారులు ప్రజావాణి సమయాన్ని మార్చితేనే ప్రయోజనమని ఇంట, బయటా వినిపిస్తున్న వాదన. కాగా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్, శిక్షణ కలెక్టర్లు నవీన్‌నికోలస్, లెనిన్ వత్సల్ టోప్పో, జెడ్పీ సీఈఓ ప్రియాంక, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. కాగా ప్రజావాణిలో ఆందోళనలు, ఆత్మహత్యాయత్నాల క్రమంలో భద్రతను పెంచారు.

అక్రమ మైనింగ్‌పై ఎన్నిసార్లు ఫిర్యాదు చేయాలే..?

శంకరపట్నం మండలం కాచాపూర్ శివారు సర్వేనంబర్ 189లో అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం. పర్మిట్ లేకుండా గ్రానైట్ రాయిని తరలిస్తున్నారు. మా పట్టా భూముల్లో వేస్ట్‌రాయిని కుప్పలుగా పోస్తున్నారు. ఇదెక్కడి అన్యాయం. వీరిపై చర్యలుండవా..?



కాచాపూర్ బాధితులు

వినూత్న నిరసన



కంకులు, ఫ్లకార్డుతో ఫిర్యాదు చేస్తున్న రైతు

మొక్కజొన్న కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఓ రైతు చర్య విస్తుగొల్పింది. మొక్కజొన్న కంకులతో ప్లకార్డును ప్రదర్శిస్తూ సోమవారం ప్రజావాణిలో ట్రెయినీ కలెక్టర్ నికోలస్‌కు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లుగా మొక్కజొన్న కేంద్రాలను తెరవాలని సైదాపూర్ మండలం బొమ్మకల్‌కు చెందిన రుద్రారపు సంజీవ్ కోరారు.

తాగునీరు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



ప్రజావాణి ఆవరణలో తాగునీరు

ప్రజావాణిలో ఎట్టకేలకు తాగునీటి సౌకర్యం కల్పించారు. గత నెల 28న 'ప్రజావాణి సమయాన్ని మార్చరూ.. కనీస సౌకర్యాలు కరువు' పేరిట చిత్రాలతో 'సాక్షి' మినీలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దిద్దుబాటు చర్యలు చేపట్టగా సమయాన్ని మార్చకపోగా నీటి సౌకర్యం మాత్రం కల్పించారు.





నగరంలోని తెలంగాణ చౌక్‌లో ఏర్పాటు చేయనున్న కూడలి నమూనా

స్మార్ట్ జంక్షన్లు

- నగరంలో మోడ్రన్ జంక్షన్ల నిర్మాణం
- ఇప్పటికే కూడళ్ల ఆధునికీకరణ పనులు ప్రారంభం.. పలు చోట్ల పూర్తి

కరీంనగర్‌సిటీ: స్మార్ట్‌సిటీగా మారుతున్న కరీంనగర్ నగరంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇప్పటికే తీగలవంతెన, ఐటీ టవర్, వాటర్ పైలాన్ నిర్మాణాలు చేపట్టగా, మానేరు రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభించారు. వాటికి అనుసంధానం చేయడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ప్రతిబింబించేలా మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యేక చొరవతో మేయర్ సునీల్‌రావు ఆధ్వర్యంలో మోడ్రన్ జంక్షన్లు నిర్మించాలని నిర్ణయించారు. వీటితో పాటు నగరంలో పలు కూడళ్ల ఆధునికీకరణ పనులు కూడా కొనసాగుతుండగా, కొన్ని పూర్తయ్యాయి. గాంధీ చౌరస్తాలో రూ.27 లక్షలతో గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేసి ప్రారంభించారు. మొత్తంగా స్మార్ట్‌సిటీలో భాగంగా నిర్మించే జంక్షన్ల నిర్మాణాలకు సుమారు రూ.68 కోట్లు వెచ్చిస్తున్నారు.

తెలంగాణ సంస్కృతి..

నగరపాలక పరిధిలో నాలుగు మోడ్రన్ జంక్షన్లు నిర్మించాలని నిర్ణయించారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా నిర్మాణాలు చేయాలని డీపీఆర్‌లు సిద్ధం చేశారు. తెలంగాణ ఖ్యాతిని పెంచిన పలువురి విగ్రహాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు పద్మనగర్–చింతకుంట, కమాన్–సదాశివపల్లి రోడ్డులో కేబుల్ బ్రిడ్జిని కలుపుకుంటూ జంక్షన్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని నగరంలోని కాపువాడ, సదాశివపల్లి సమీపంలో రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేయనున్నారు. జంక్షన్లకు ఇరువైపులా ట్యాంక్ బండ్ తరహాలో నీటి ఫౌంటేన్లు, విగ్రహాలు, వాటి చరిత్ర వంటివి ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తీగలవంతెన అందం మరింత పెరిగేలా దానికి అనుబంధంగా ఉన్న రహదారిలో నాలుగు ప్రత్యేక జంక్షన్లు నిర్మించాలని నిర్ణయించారు. ప్రత్యేక డిజైన్లు రూపొందించి నిధులు కేటాయించారు. వాటిలో పవర్ జంక్షన్ల నిర్మాణానికి రూ.83 లక్షలు, హెచ్‌కేఆర్ జంక్షన్‌కు రూ.88 లక్షలు, సదాశివపల్లి జంక్షన్‌కు రూ.72 లక్షలు, సదాశివపల్లి వరంగల్ జంక్షన్ల నిర్మాణానికి రూ.25 లక్షలు కేటాయించారు.

కూడళ్ల వివరాలు..

- బస్టాండ్ ఇన్‌గేట్, అవుట్‌గేట్, వన్‌టౌన్ పీఎస్, కమాన్, బద్దం ఎల్లారెడ్డిభవన్ టీ కూడలి, ఎన్టీఆర్ విగ్రహం, అలుగునూర్, ఇందిరాచౌక్ టీ కూడలి, టుటౌన్ పీఎస్, డ్యాం బైపాస్ రోడ్డు, రాంనగర్, పద్మనగర్ బైపాస్ రోడ్డు, చింతకుంట బైపాస్ రోడ్డు, గౌతమినగర్ టీ కూడలి.
- మల్కాపూర్, శాతవాహన యూనివర్శిటీ వద్ద వై కూడలి. రేకుర్తి, కొత్తపల్లి, వెలిచాల, ఎస్సారార్ కాలేజీ, చైతన్యపురి వద్ద టీ కూడలి. కోర్టు చౌరస్తా, పాత ఎంప్లాయిమెంట్ కార్యాలయం కూడలి, మంచిర్యాల చౌరస్తా, మసీద్ వద్ద వై కూడలి.
- ఆదర్శనగర్, సుభాష్‌నగర్, ఎస్సీ వసతి గృహం, తీగలగుట్టపల్లి వద్ద, గాంధీరోడ్, నాకా చౌరస్తా, బొమ్మకల్, చల్మెడ ఆస్పత్రి, దుర్శెడ్, లారీ ఒనర్ అసోసియేషన్ వద్ద కూడళ్ల నిర్మాణం.
- ఓల్డ్ లేబర్ అడ్డా, ఐబీ చౌరస్తా, అటవీ ఆఫీస్, కేన్సర్ ఆస్పత్రి, ఎక్స్‌రోడ్, రాజీవ్‌చౌక్, ప్రతిమ, సెవెన్ హిల్స్ వద్ద కూడళ్ల అభివృద్ధి.

తెలంగాణ సంస్కృతి..

తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా జాతీయ నాయకుల ప్రతిమలు ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కో కూడలిని ఒక్కో రకంగా ఆధునికీకరిస్తున్నాం. ఇప్పటికే గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. త్వరలోనే మిగిలిన కాంస్య విగ్రహాలు రానున్నాయి. రెండు నెలల్లో పనులు పూర్తి చేసి అందమైన కూడళ్లను ప్రజలకు అందిస్తాం.
– సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

క్లుప్తంగా

లేక్ పోలీసులకు రివార్డు



కరీంనగర్ క్రైం: ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరు యువతులను రక్షించిన లేక్ అవుట్ పోస్ట్ ఆర్ఎస్సై, సిబ్బందికి కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు సోమవారం రివార్డు అందించి, అభినందించారు. ఈ నెల 15న ఎల్ఎండీలో ఆత్మహత్యాయత్నం చేసిన యువతులను రక్షించడంలో ఆర్ఎస్సై ఎ.సురేష్, సిబ్బంది వీరాస్వామి, సఫ్దర్ అలీ, కానిస్టేబుళ్లు కీలక పాత్ర పోషించారు. పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచేలా పని చేసే అన్ని స్థాయిలకు చెందిన పోలీసులకు రివార్డులు, అవార్డులు అందజేస్తామని సీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(పరిపాలన) జి.చంద్రమోహన్, మహేశ్ బాబాసాహెబ్(ట్రైనీ ఐపీఎస్) తదితరులు పాల్గొన్నారు.

కిష్టంపల్లిని ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేయాలి



రామడుగు(చొప్పదండి): మండలంలోని వెంకట్రావుపల్లి పరిధి కిష్టంపల్లి గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామానికే చెందిన గొల్లపల్లి వినోద్ కుమార్ సోమవారం కిష్టంపల్లి ప్రధాన చౌరస్తా వద్ద బీఎస్పీ నాయకులతో కలిసి నిరహార దీక్ష చేపట్టారు. తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను పట్టించుకునే నాథులే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రేషన్ షాపు కూడా లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పందించి, కిష్టంపల్లిని గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

క్వింటాల్ పత్తి రూ.7,950



జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7,950 పలికింది. సోమవారం మార్కెట్‌కు 74 వాహనాల్లో రైతులు 1,266 క్వింటాళ్ల పత్తిని విక్రయానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,850, కనిష్ట ధర రూ.7,300 వ్యాపారులు చెల్లించారు. గన్నీ సంచుల్లో 9 మంది రైతులు 15 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,300, మోడల్ ధర రూ.7,000, కనిష్ట ధర రూ.6000కు కొనుగోలు చేశారు. కాగా మార్కెట్‌లో క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

అమెరికా యంగ్ ఇంజనీర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపిక



నితేశ్

హుజూరాబాద్‌రూరల్: పట్టణానికి చెందిన గోలి నితేశ్ అమెరికన్ సొసైటీ ఫర్ సివిల్ ఇంజినీర్స్ సంస్థ ఇచ్చే యంగ్ ఇంజినీర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికయ్యారు. వ్యాపారి గోలి శ్రీనివాస్–రజని దంపతుల కుమారుడైన నితేశ్ అమెరికాలోని ఫ్లోరిడా యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేశారు. సివిల్ ఇంజినీరింగ్‌లో పలు పరిశోధనలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ సొసైటీలకు పరిశోధన పత్రాలు సమర్పించారు. ప్రస్తుతం రాడిస్ సంస్థలో సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. అవార్డుకు ఎంపికవడం పట్ల ఆయన కుటుంబసభ్యులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.









లిఫ్ట్ ఉన్నా.. ఉపయోగం సున్నా..

కరీంనగర్ మాతా శిశు ఆస్పత్రిలో గర్భిణులు, పేషెంట్లకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసిన లిఫ్ట్ నిరుపయోగంగా మారింది. గర్భిణులు, పేషెంట్లను విస్మరిస్తూ కేవలం వైద్యులు మాత్రమే లిఫ్ట్‌ను వాడుకుంటున్నారు. కాగా గర్భిణులకు పైఅంతస్తులో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్‌కు వెళ్లిరావడానికి మెట్లు ఎక్కుతూ.. దిగుతూ నానా అవస్థలు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ఈటలవి మతిభ్రమించిన మాటలు

- సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఆయనకు లేదు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు



మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

కరీంనగర్: బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌వి మతిభ్రమించిన మాటలని, సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఆయనకు లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని చెల్పూర్ సర్పంచ్‌ను వితంతువుపై లైంగిక వేధింపుల కేసులో పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. ఎమ్మెల్యే ఈటల ధర్నాకు దిగి, సర్పంచ్‌కు వత్తాసు పలకడం, ప్రభుత్వం, సీఎం కేసీఆర్, పోలీసు అధికారులపై అడ్డగోలు విమర్శలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. బీజేపీ తలుచుకుంటే తిరగలేరని హెచ్చరికలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. చేతనైతే మెడికల్, నర్సింగ్ కాలేజీలు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ తీసుకురావాలన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఇప్పటికైనా ఈటల రాజేందర్ తన తప్పు తెలుసుకొని, చెల్పూర్ ఘటనలో బాధిత మహిళకు క్షమాపణ చెప్పాలని, సర్పంచ్‌కు వత్తాసు పలకడం మానుకోవాలని హితవు పలికారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఈటలకు లేదని, బీజేపీ అబద్ధాలను నిజాలుగా, నిజాలను అబద్ధాలుగా మార్చి ప్రజల్లో ఎలాగైనా సానుభూతి పొందాలని చూస్తోందన్నారు. చెల్పూర్ ఘటనలో బాధిత మహిళకు ఈటల అండగా నిలవాలని సూచించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఏఎంసీ చైర్మన్ మధు, నాయకులు చీటి రాజేందర్‌రావు, కామారపు శ్యాం, ఏవీ రమణ, వొల్లాల శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కులదీప్ వర్మ, రాజేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీని నమ్మే పరిస్థితి లేదు

- అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి, సీఎం చరిత్ర సృష్టించారు
- ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్: రాష్ట్రంలో బీజేపీని నమ్మే పరిస్థితి లేదని, హైదరాబాద్ నడిబొడ్డున బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి, సీఎం కేసీఆర్ చరిత్ర సృష్టించారని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యకుడు బండి సంజయ్‌కుమార్‌తోపాటు ఇతర పార్టీల అధ్యక్షులు అవగాహనారాహిత్యంతో మాట్లాడుతున్నారని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇంతటి భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదని బండి సంజయ్ మాట్లాడుతున్నారని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రధాని మోదీ తొమ్మిదేళ్లలో ఎన్ని కోట్ల ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం బీసీ మంత్రిత్వ శాఖను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని, బీసీ జనాభా లెక్కలు ఎందుకు తీయడం లేదని ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు పరిపాటేనని విమర్శించారు. దేశంలో ఏ రాష్ట్రానికీ ఇవ్వని నిధులు గుజరాత్‌కు ఇచ్చారని, వాటిని అక్కడి సీఎం, మంత్రులు దండుకున్నారని, మోదీ, అమిత్‌షాలకూ వాటా ఉందని ఆరోపించారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసినందుకు గాను మే 10న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద, జూన్ 10న కరీంనగర్ జిల్లా కేంద్రంలో కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 19 నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు సముద్రాల అజయ్, గజ్జల ఆనందరావు, కల్లెపల్లి శంకర్, షుక్రుద్దీన్, బొంకూరి సురేందర్, ఆవారు లత తదితరులు పాల్గొన్నారు.

‘మన్ కీ బాత్’కు ప్రజల్లో ఆదరణ

- బీజేపీ నేత, మాజీ ఎంపీ చాడ సురేశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: దేశవ్యాప్తంగా ప్రజలతో మమేకం కావడానికి, కేంద్ర ప్రభుత్వ పనితీరును వారికి వివరించడానికి ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన మన్ కీ బాత్ కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోందని బీజేపీ నేత, మాజీ ఎంపీ చాడ సురేశ్ రెడ్డి అన్నారు. మన్ కీ బాత్, బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ ప్రోగ్రాం రివ్యూ మీటింగ్ సోమవారం కరీంనగర్‌లోని పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల హయాంలో నిర్వీర్యమైన ఆకాశవాణిని మన్ కీ బాత్ ద్వారా ప్రధాని మోదీ ప్రజలకు దగ్గర చేయడం గొప్ప విషయమన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అన్ని పోలింగ్ బూత్‌లలో ప్రతినెలా నాలుగో ఆదివారం విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. స్థానిక ప్రజలను ఇందులో భాగస్వామ్యం చేయాలని చెప్పారు. సమావేశంలో పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి శేఖర్, అసెంబ్లీ కన్వీనర్లు దుబాల శ్రీనివాస్, పెరుక శ్రావణ్, గౌతం రెడ్డి, సుఖేందర్ గౌడ్, నాయకులు పుప్పాల రఘు, గాయత్రీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు



కరీంనగర్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 15, 16 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవిలు తెలిపారు. పది కిలోమీటర్ల నడకలో విష్ణువర్ధన్ బంగారు, నాగరాజు రజత, ఐదు, మూడు కిలోమీటర్ల పరుగులో వినయ్ రజత, కాంస్య, 1500 మీటర్ల పరుగులో సంతోష్ కాంస్య, బాలికల విభాగంలో సుదీక్ష కాంస్య పతకాలు సాధించారన్నారు. వారిని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, బిషన్ సింగ్, సీఐ నరేందర్, రవి, సుమన్ కల్యాణ్, కనకయ్య సోమవారం అభినందించారు.

బాలుడిని బలిగొన్న కారు

- పాఠశాల నుంచి వస్తుండగా ఘటన
- తండ్రి, ఇద్దరు పిల్లలకు గాయాలు
- రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొట్టిన కారు
- తండ్రి కళ్లెదుటే ఓ కొడుకు కన్నుమూత
- బాధితులది హుజూరాబాద్ మండలం జీలుగుల





మనుక్షిత్ మృతదేహం, గాయపడిన శ్రీనివాస్, సాయికీర్తన్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఆయన దివ్యాంగుడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూడా. తన ఇద్దరు పిల్లలను తాను పనిచేస్తున్న పాఠశాలలోనే చేర్పించి ప్రతిరోజూ తన మూడు చక్రాల బండిపై తీసుకెళ్తున్నాడు. ఎప్పటిలాగే తన ఇద్దరు కుమారులతో బడికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఇంతలో వేగంగా దూసుకొచ్చిన కారు వీరి వాహనాన్ని ఢీకొంది. ముగ్గురూ కింద పడిపోయారు. తేరుకునేలోపే ఓ కుమారుడు రక్తపు మడుగులో కన్నుమూశాడు. తండ్రితోపాటు మరో కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కాల్వశ్రీరాంపూర్ మండలంలో చోటుచేసుకుంది. హుజూరాబాద్ మండలం జీలుగుల గ్రామానికి చెందిన ఆరెపెల్లి శ్రీనివాస్ దివ్యాంగుడు. కాల్వశ్రీరాంపూర్ మండలం మంగపేట పంచాయతీ పరిధి తెనుగుపల్లె ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. మండలకేంద్రంలోనే కుటుంబంతో కలిసి ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు మనుక్షిత్ (రెండో తరగతి), సాయికీర్తన్ (ఒకటో తరగతి) అదే బడిలో చదువుతున్నారు. రోజూ మాదిరిగానే సోమవారం పాఠశాలకు త్రిచక్ర వాహనంపై వెళ్లి వస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్–గంగారం గ్రామాల మధ్య వీరి వాహనాన్ని హనుమకొండ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో మనుక్షిత్ అక్కడికక్కడే మృతిచెందగా శ్రీనివాస్, సాయికీర్తన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రాజవర్ధన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108లో కరీంనగర్ తీసుకెళ్లారు. మనుక్షిత్ మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

టీఎస్ ఐ–పాస్ దరఖాస్తులు పరిష్కరించండి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

కొత్తపల్లి(కరీంనగర్): పరిశ్రమల స్థాపనకు టీఎస్ ఐ–పాస్ ద్వారా అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా పరిశ్రమల శాఖ డీఐపీసీ/డీఎల్‌సీపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 19 ఫిబ్రవరి 2023 నుంచి 15 ఏప్రిల్ 2023 వరకు టీఎస్ ఐ–పాస్ పోర్టల్‌లో సుమారు రూ.19.24 కోట్ల విలువైన 29 యూనిట్లకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వారి అభ్యర్థనలు క్షుణ్ణంగా పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలన్నారు. పరిశ్రమల స్థాపనను ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఏడీ మైన్స్, కాలుష్య నియంత్రణ మండలి సైంటిస్ట్, ఐపీవోలు పరిశ్రమలను పరిశీలించాలన్నారు. అనంతరం ప్రధానమంత్రి ఉపాధి హామీ కల్పన పథకం సమీక్ష సమావేశంలో ఈ ఏడాది వచ్చిన దరఖాస్తులు, వాటికి సంబంధించిన రుణాల మంజూరుపై కలెక్టర్ సమీక్షించారు. బ్యాంకుల్లో పెండింగ్, తిరస్కరణ గురైన దరఖాస్తులపై లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు, నెహ్రూ యువ కేంద్ర కో–ఆర్డినేటర్ వెంకట రాంబాబు, ఐపీవో మధులత, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు ఏకగ్రీవ తీర్మానం

- టీఎన్జీవోల సంఘం భవనంలో అత్యవసర సమావేశం



మాట్లాడుతున్న జగదీశ్వర్

కరీంనగర్ అర్బన్: సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎన్జీవోల సంఘం ఏకగ్రీవ తీర్మానం చేసింది. సంఘం జిల్లా అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అధ్యక్షతన సోమవారం నగరంలోని సంఘం భవనంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. తీర్మానంలో కొన్ని అంశాలను జిల్లా కార్యదర్శి దారం శ్రీనివాస్ రెడ్డి ప్రతిపాదించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ పునరుద్ధరించాలని, జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వీఆర్వో వ్యవస్థను రద్దు చేసి, పునర్విభజనలో భాగంగా వివిధ డిపార్ట్‌మెంట్లకు వీఆర్వోలను అలాట్ చేశారని, రెగ్యులరైజ్ చేయాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టి, లేనివారికి సూపర్ న్యూమరీ పోస్ట్ క్రియేట్ చేసి, జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఇవ్వాలని కోరారు. పీఆర్సీ కమిటీ వేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, జీపీఎఫ్ లోన్లు, ఇతర బిల్లులను త్వరగా ఇవ్వాలన్నారు. సంఘం జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు రాజ శ్రీనివాస్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి నేరెళ్ల కిషన్, మహిళా అధ్యక్షురాలు శారద, నాయకులు సునీత, సబిత, సరిత, విజయ, లక్ష్మి, రవీందర్ రెడ్డి, మల్క రాజేశ్వర్‌రావు, రమేశ్ గౌడ్, రాఘవరెడ్డి, జలాలుద్దీన్ అక్బర్, రాజ మనోహర్, పోలు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండం ప్రజలు తెలంగాణ వారు కాదా?

- ఇక్కడి నిధులు గజ్వేల్‌కు ఎత్తుకుపోతున్నారు
- ‘బీపీఎల్’ భూముల్లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మించాలి
- పీపుల్స్ మార్చ్‌లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



పాదయాత్రలో భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, నాయకులు

సాక్షి, పెద్దపల్లి: బొగ్గు ఖనిజ సంపద ఉన్న రామగుండం ప్రజలు తెలంగాణ వారు కాదా..? ఇక్కడ ఖర్చు చేయాల్సిన డీఎంఎఫ్‌టీ, సీఎస్సార్ నిధులు గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లకు ఎత్తుకెళ్లే హక్కు ఎవరిచ్చారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పీపుల్స్‌మార్చ్‌లో భాగంగా రామగుండం నియోజకవర్గంలో సోమవారం పాదయాత్ర చేపట్టారు. ముర్మూర్, గొల్లపల్లి, బ్రహ్మణపల్లి, ఆకేనపల్లి, తక్కెలపల్లి శివారు, పుట్నూర్, జయ్యారం, రచ్చపల్లి గ్రామాల్లో స్థానికుల సమస్యలు వింటూ.. భరోసా కల్పిస్తూ ముందుకుసాగారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ఉండవని ప్రకటించిన కేసీఆర్.. రామగుండం నడిబొడ్డున ఓపెన్‌కాస్ట్ తెరిచి చిన్నపాటి భూకంపాలకు కారణమయ్యారని మండిపడ్డారు. వాటిని రద్దు చేయించాలన్న సోయి స్థానిక ఎమ్మెల్యేకు లేకపోవడం విచారకరమన్నారు. ఎల్లంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయకుండా తొమ్మిదిన్నరేళ్లుగా ఈ ప్రభుత్వం గాడిదలను కాస్తోందా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తిచేసి అంతర్గాం, పాలకుర్తి ప్రాంతాలకు నీళ్లు ఇస్తామన్నారు. బీపీఎల్ కంపెనీ ఏర్పాటుకు 1200 ఎకరాలు భూసేకరణ చేసి రెండు దశాబ్దాలు అవుతున్నా.. ఇప్పటివరకు కంపెనీ ఏర్పాటు చేయకుండా ఏం చేస్తున్నారని విమర్శించారు. కంపెనీ ఏర్పాటు చేయకుంటే సేకరించిన భూములను రైతులకైనా ఇవ్వాలని, లేకుంటే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసమైనా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇసుక, బూడిద దందా చేసుకునేందుకు ప్రజలు ఎమ్మెల్యేలుగా గెలిపించలేదన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు లేబర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే డబ్బులు వసూలు చేయడం సిగ్గు చేటన్నారు. ఉద్యోగాలు రాక.. వసూలు చేసిన డబ్బులు తిరిగి బాధితులకు ఇవ్వకపోవడంతో బాధితుల ఆత్మహత్యలకు కారణమైన ఎమ్మెల్యే రామగుండానికి అవసరమా? అని ప్రశ్నించారు. ఇక్కడి నదిజలాలను హైదరాబాద్‌కు తరలిస్తున్నా ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. తలాపునే గోదావరి పారుతున్నా ఇక్కడి రైతులకు సాగునీరు.. ప్రజలు తాగడానికి నీరు అందించని చరిత్ర బీఆర్ఎస్ పార్టీదేనని విమర్శించారు.

బీపీఎల్ భూములు తిరిగి ఇవ్వాలి

డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ.. రైతులు తమ భూములను త్యాగం చేస్తే నేడు వారికి మిగిలింది శూన్యమేనని, కనీసం వారికి అందే పరిహారం కోసం కాళ్లరిగేలా తొమ్మిదేళ్లుగా తిరుగుతున్నా ఇచ్చిన పాపన పోవడంలేదన్నారు. సూపర్ క్రిటికల్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుపై పాలకులకు సోయిలేదన్నారు. సేకరించిన బీపీఎల్ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలన్నారు. నిరుపేదలు వేలాదిగా ఇళ్లు లేక కిరాయి ఇళ్లల్లో నివాసం ఉంటుంటే డబుల్ బెడ్ రూమ్ పేరుతో ఏదో నామమాత్రంగా వారి కార్యకర్తలకే కేటాయించారని విమర్శించారు.

బీఎస్ఎన్ఎల్ ఆఫీస్‌కు ఆధునిక పరికరాలు

కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి ఆధునిక పరికరాలు రెండు రోజుల క్రితం చేరుకున్నాయి. వారం రోజుల్లోగా వాటిని అమర్చి, వేగవంతమైన సేవలందిస్తామని అధికారులు తెలిపారు. కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని, ఇంటర్‌నెట్‌కు సంబంధించిన పరికరాలు కాలిపోయిన విషయం విదితమే. ఈ ఘటనలో దాదాపు రూ.15 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. దీంతో వారం రోజులపాటు ఇటు ఇంటర్‌నెట్, అటు మొబైల్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికారులు అప్పటికప్పుడు ఏర్పాట్లు చేసినా అవి నామమాత్రంగానే మిగిలిపోయాయి. ఇక్కడి అధికారులు ఉన్నతాధికారులతో మాట్లాడి, ఆధునిక పరికరాలు తెప్పించారు. ఇవి ఒక్కొక్కటి సుమారు రూ.కోటి విలువ చేసేవని తెలిసింది. గత నెల ఇంటర్‌నెట్ బిల్లుల్లో 50 శాతం మాఫీ చేయడంతోపాటు చెల్లించే గడువు కూడా పెంచామని అధికారులు తెలిపారు. కేవలం కరీంనగర్‌లోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు సమారు రూ.45 లక్షల వరకు మాఫీ చేశారని సమాచారం.


అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



రవి మృతదేహం

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన గొల్లెన రవి(40) అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు కేశవపట్నం ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రవి అంబాల్‌పూర్‌కే చెందిన స్వప్నను 2005లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. రవి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రెండేళ్లుగా స్వప్న తన పుట్టింటికి వెళ్తోంది. ఈ నెల 9న ఎల్లమ్మ బోనాల జాతరకు ఆమె మేనమామ దామోదర్ వచ్చి స్వప్న, రవితోపాటు పిల్లలను తీసుకెళ్లాడు. 16న రవి అనారోగ్యానికి గురవగా మానకొండూర్ మండలంలోని గట్టుదుద్దెనపల్లి ఆర్ఎంపీ వైద్యుని వద్దకు వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా అతను మృతిచెందాడు. అయితే తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని మృతుడి తండ్రి కొంరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాహితీ గౌతమి అధ్యక్షుడిగా నంది శ్రీనివాస్



కరీంనగర్‌కల్చరల్: జిల్లా సాహితీ సంస్థల సమాఖ్య సాహితీ గౌతమి సంస్థ ఎన్నికలు ఆదివారం రాత్రి కరీంనగర్‌లోని గణాంక భవన్‌లో జరిగాయి. అధ్యక్ష, కార్యదర్శులుగా నంది శ్రీనివాస్, అనిల్‌కుమార్, సహాధ్యక్షుడిగా డాక్టర్ కలువకుంట రామకృష్ణ, కోశాధికారిగా స్తంభంకాడి గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా డాక్టర్ మచ్చ హరిదాసు, దాస్యం సేనాధిపతి, అన్నవరం దేవేందర్ వ్యవహరించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, గాజుల రవీందర్, కందుకూరి అంజయ్య, అన్నాడి గజేందర్‌రెడ్డి, వెరాగ్యం ప్రభాకర్, సంకేపల్లి నాగేంద్రశర్మ, దొమ్మటి శంకర్ ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎల్ఎండీపై ఎన్సీసీ కేడెట్ల స్వచ్ఛభారత్



వ్యర్థపదార్థాలు తొలగించిన ఎన్సీసీ కేడెట్లు

కరీంనగర్‌క్రైం: ఎన్సీసీ 9టీ బెటాలియన్ కేడెట్లు, ఎస్సారార్, వివేకానంద కళాశాలల ఎన్సీసీ కెడెట్ల ఆధ్వర్యంలో లోయర్ మానేరు డ్యాంపై సోమవారం పునీత్‌సాగర్ కార్యక్రమం చేపట్టారు. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను తొలగించారు. డ్యామ్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరాదని సందర్శకులకు సూచించారు. జలాశయం శుభ్రత అందరి బాధ్యత అని వివరించారు. కార్యక్రమంలో ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, ఎన్సీసీ అధికారులు లెఫ్టినెంట్ రాజు, కెప్టెన్ కిరణ్‌జ్యోతి, లేక్ ఆర్ఎస్సై సురేశ్, 9టీ తెలంగాణ సిబ్బంది మనోహర్, దుర్గారావు, ఎన్సీసీ కేడెట్లు పాల్గొన్నారు. అనంతరం 80 కిలోల ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించారు.

కృపాదానంకు బంగారు నంది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కృపాదానం

కరీంనగర్‌కల్చరల్: జీవీఎస్ వల్లూరు ఫౌండేషన్ అందించే ఉగాది జాతీయస్థాయి బంగారు నంది పురస్కారాన్ని కరీంనగర్‌కు చెందిన జానపద వృత్తి కళాకారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, నాటక రంగ కళాకారుడు జి.కృపాదానం అందుకున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా హాజరైన దైవజ్ఞశర్మ, లక్ష్మీపార్వతి, కృష్ణ జిల్లా కలెక్టర్ శంకర్, లక్డీకపుల్ ఏసీపీ తేజావత్నాయక్ సినీ హీరో కిరణ్, ఫౌండేషన్ చైర్మన్ వల్లూరు శ్రీనివాస్‌లు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు అధికారులు, కళాకారులు, అభినందనలు తెలిపారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్, గుంటూరుపల్లిల్లో ఎల్ఐసీ సహకారంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సోమవారం సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎస్వీ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ మధుకుమార్, అడ్వయిజర్ గాదె ఆదిరెడ్డి, సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ చెట్టి జగన్‌పటేల్, వార్డుసభ్యులు జకినపల్లి శంకర్, సుజాత రవీందర్, సదానందం, బక్కయ్య, సర్వర్ పాల్గొన్నారు.

హిందీ ప్రచారసభ పరీక్షలో ప్రతిభ



సప్తగిరికాలనీ(కరీంనగర్): దక్షిణ భారత హిందీ ప్రచార సభ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ ప్రచారసభ పరీక్షలో మెహర్‌నగర్‌లోని వింధ్యావాలీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభకనబర్చిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ పృథ్వీరావులు అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్

విద్యానగర్(కరీంనగర్): ఆడపిల్లలు, మహిళలు స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని 16వ డివిజన్ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ అన్నారు. సోమవారం పద్మనగర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వరక్షడే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్‌లలో చాటింగ్ వల్ల ఎన్నో అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కరీంనగర్ అర్బన్ సీడీపీవో ఉమారాణి స్వరక్ష డే గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్ సంపత్, సూపర్‌వైజర్ స్వప్న, మహిళా శక్తి కోఆర్డినేటర్ శైలజ, అంగన్‌వాడీ టీచర్ వనజ, సరిత పాల్గొన్నారు.

స్టార్ట్.. కెమెరా.. యాక్షన్

- నటనలో నవరసాలు నేర్చుకుంటున్న చిన్నారులు
- యాక్టింగ్, ఎమోషనల్, హాస్యం తదితర రంగాల్లో రాణిస్తామంటున్న బాలలు
- భూనాథచారి ఆధ్వర్యంలో ఉచితశిక్షణ



యాక్టింగ్‌లో మెళకువలు నేర్చుకుంటున్న చిన్నారులు

కరీంనగర్‌కల్చరల్: చదువే కాదు.. పిల్లలు వివిధ రంగాల్లో రాణించాలని నేటితరం తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. చదువుతో పాటు పలు అంశాల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. చాలా మంది పిల్లలు క్రీడారంగంతో పాటు యాక్టింగ్‌లోనూ మెరవాలని ఆశిస్తున్నారు. మొదట రంగస్థలం.. తరువాత బుల్లితెర.. ఆపై వెండితెరపై కనిపించాలని కోరుకుంటున్నారు. ఇలాంటి పిల్లలకు చక్కని అవకాశం కల్పిస్తున్నారు మాస్క్ ఇనిస్టిట్యూట్ ఫౌండర్, యాక్టింగ్ ట్రైనర్, దర్శకుడు భూనాథచారి. నగరంలోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలోని పట్టణ స్వర్ణకారుల సంఘ భవనంలో కరీంనగర్ యాక్టర్స్ క్లబ్‌ఏర్పాటు చేసి 60 మంది చిన్నారులకు నటనలో ఈనెల 25 వరకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. షార్ట్‌ఫిల్మ్ ద్వారా నూతన నటీనటులుగా పరిచయం చేయడమే కాకుండా సినిమా, డ్రామా జూనియర్స్, సీరియల్స్ సెలక్షన్స్‌కు పంపుతున్నారు. నటనలో వాటి కలలను నిజం చేస్తున్నారు.

వివిధ విభాగాల్లో శిక్షణ

నటన అంటే తనది కాని పాత్రను తనదని నమ్మి ఎదుటి వారిని నమ్మించడం. అందుకు నటనలో శిక్షణ ఎంతో అవసరం. బాడీలాంగ్వేజ్, వాయిస్ అండ్ స్పీచ్, డైలాగ్ మాడ్యులేషన్, ఎక్స్‌ప్రెషన్స్, నవరసాలు నేర్పించి, కెమెరా ప్రాక్టికల్స్ నిర్వహించి వారిని నటీనటులుగా తీర్చిదిద్దుతున్నారు. ఇంకా ఈ శిక్షణలో మెమొరీ, కాన్సంట్రేషన్, అబ్జర్వేషన్, ఎక్సర్‌సైజ్‌లు వ్యక్తిత్వం వికాసానికి ఎంతగానో తోడ్పడ్తాయి. భయం పోతుంది. క్రియేటివిటీ పెరుగుతుంది.

డ్రామా జూనియర్స్‌కు ఎంపికయ్యా



నాకు మంచి యాక్టర్ కావాలని కోరిక, నటన మీద ఆసక్తితో మాస్ యాక్టింగ్ ఇనిస్టిట్యూట్‌లో చేరా. ఇక్కడ శిక్షణ తీసుకొని నటనలో మెలకువలు నేర్చుకుంటున్న. ప్రేమ, భయం, కోపం, హాస్యం ఎలా నటించాలో శిక్షణ తీసుకున్న, జీ తెలుగు డ్రామా జూనియర్ ఫైనల్‌కు ఎంపికయ్యా.

– ఆద్య, భగత్‌నగర్

యాక్టింగ్ అంటే ఇష్టం



చిన్నప్పుడు నుంచి యాక్టింగ్ అంటే ఇష్టం. గతేడాది ఈ ఇనిస్టిట్యూట్ చేరా. స్టేజ్ ఫియర్ లేకుండా ఎలా నటించడం, ఎమోషన్స్ ఎలా పలికించాలో శిక్షణ తీసుకుంటున్న, టీవీలో కనబడాలని నా కోరిక. ఇటీవల జీ తెలుగు డ్రామా జూనియర్స్ సెలెక్ట్ అయ్యా.

– తునికి ఆదిత్య, భగత్‌నగర్

మెళకువలు నేర్చుకుంటున్న..



నటించడం అంటే చాలా ఇష్టం, మాది గోదావరిఖని ఇక్కడ నటనలో శిక్షణ ఇస్తున్నారని అక్కడ నుంచి వస్తున్నాం. మంచి యాక్టర్ కావాలని నా లక్ష్యం. ఎమోషన్స్ సీన్స్, డైలాగ్స్ ఎలా చెప్పాలో నటనలో మెలకువలు నేర్చుకుంటున్న. జీ తెలుగు డ్రామా జూనియర్స్‌కు ఎంపికయ్యా. –వరుణి, గోదావరిఖని

షార్ట్ ఫిల్మ్‌లో నటించా



అమ్మ లేని బతుకు షార్ట్ ఫిల్మ్‌లో నటించా. మంచి గుర్తింపు వచ్చింది. ఇంకా నటనలో మంచి తర్ఫీదు పొందాలని మాస్క్ ఇనిస్టిట్యూట్‌లో చేరా. ఇక్కడ నటనలో మంచి మెలకువలు నేర్పుతున్నారు. భూనాథాచారి సార్ యాక్టింగ్ ఎప్పుడు ఎమోషన్స్‌లో నటించాలో చక్కగా వివరిస్తున్నారు.

– నిధి, శివాజీనగర్

నటనలో అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో..



నటనలో శిక్షణ ఇవ్వటంతో పాటు అవకాశాలు కల్పించాలని యాక్టర్స్ క్లబ్ ఏర్పాటు చేశాం. శిక్షణ పొందటం వల్ల సినిమా, షార్ట్ ఫిలిమ్స్, సీరియల్స్‌లో అవకాశాలు అందుకోవచ్చు. శిక్షణలో నేర్పించే మెమోరీ, వాయిస్ అండ్ స్పీచ్, బాడీలాంగ్వేజ్, డైలాగ్ మోడ్యూలేషన్, మరికొన్ని ఎక్సర్ సైజుల వల్ల సిగ్గు, భయం, స్టేజ్ ఫియర్ పోతుంది, ఇప్పుడిప్పుడే యాక్టింగ్ నేర్చుకునేందుకు పిల్లలు, పెద్దలు చాలా మంది జాయిన్ అవుతున్నారు. – అనసూరి భూనాథ చారి, మాస్క్ ఇనిస్టిట్యూట్, కరీంనగర్ యాక్టర్స్ క్లబ్ ఫౌండర్, యాక్టింగ్ ట్రైనర్, డైరెక్టర్

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్

కరీంనగర్‌సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. సోమవారం 59వ డివిజన్ మంకమ్మతోటలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. నగరంలోని 3 లక్షల మందికి కంటి పరీక్షలు చేసేలా నగర పాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. డివిజన్ల వారీగా మీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో పరీక్షలు చేయించుకొని కంటి సమస్యలు దూరం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికి 40 వేల మందికి కంటి అద్దాలు అందించామని, కంటి ఆపరేషన్ అవసరమైన వారికి శిబిరాల అనంతరం ప్రభుత్వం ఉచితంగా ఆపరేషన్ చేయించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్ గంధం మాధవి, నగరపాలక సంస్థ అధికారులు, వైద్య శాఖ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

చింతకుంటలో కంటి వెలుగు శిబిరం ప్రారంభం

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంటలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం జెడ్పీటీసీ పిట్టల కరుణతో కలిసి ఎంపీపీ పిల్లి శ్రీలత ప్రారంభించారు. 18 ఏళ్ల పైబడిన ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ మొగిలి మంజులసమ్మయ్య, ఉప సర్పంచ్ మంగారాణి, ఎంపీటీసీలు పట్టెం శారదలక్ష్మీనారాయణ, భూక్యా తిరుపతినాయక్, ఎంపీటీ శ్రీనివాస్. శిబిరం ఇన్‌చార్జి డాక్టర్ మౌనిక, వైద్యుడు రాకేశ్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఏఎన్ఎంలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సంపత్

కరీంనగర్‌రూరల్: స్మార్ట్‌ఫోన్లు, సోషల్‌మీడియాతో ఆడపిల్లలు దూరంగా ఉండాలని కరీంనగర్ అర్బన్ సీడీపీవో బి.ఉమారాణి అన్నారు. సోమవారం కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వరక్ష దినోత్సవంలో మాట్లాడారు. ఆడపిల్లలు బాల్యవివాహాలు, అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, ఆడపిల్లలు చట్టాల ద్వారా రక్షణ పొందాలని సూచించారు. జిల్లా హెల్ప్‌లైన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ ఏదైనా ఆపద ఏర్పడినప్పుడు వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 181, 100 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల, మహిళాశక్తి కోఆర్డినేటర్ శైలజ, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి



సంతకాల సేకరణ చేస్తున్న జర్నలిస్టులు

విద్యానగర్(కరీంనగర్): జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే డిమాండ్‌తో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మెర తిరుపతిరెడ్డి, బండోజు శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జర్నలిస్టుల కృషిని పలు సందర్భాల్లో కొనియాడిన కేసీఆర్ వారి సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీ హామీగానే మిగిలిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బిక్షపతి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ కూడుతాడి బాపురావు, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొండ సత్తయ్య, జయందర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ వెంకటరమణ, జాయింట్ సెక్రెటరీలు నరేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో మంగళవారం 47 కంటి వెలుగు బృందాలతో కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని 3, 9, 14, 19, 20, 21, 25, 29, 34, 48, 50, 59వ డివిజన్లలో, హుజూరాబాద్‌లోని 19, 25వ వార్డుల్లో, మండలంలోని సింగపూర్, పోతిరెడ్డిపేటల్లో, జమ్మికుంటలోని 13వ వార్డు, మండలంలోని శాయంపేట, అంకుసాపూర్ గ్రామాల్లో, వీణవంక మండలం గన్ముక్కుల, మల్లారెడ్డిపల్లి, హిమ్మత్‌నగర్, చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి, ఓగులాపూర్, చొప్పదండి మండలం ఆర్నకొండ, కురుమపల్లె, ఇల్లందకుంట మండలం సీతంపేట, గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి, కాసారం, రామడుగు మండలం వెలిచాల, రంగసాయిపల్లి, కొత్తపల్లి మండలం చింతకుంట, మల్కాపూర్, కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్, నగునూర్, మానకొండూరు మండలం వన్నారం, అన్నారం, సైదాపూర్ మండలం వెన్కేపల్లి, రాయికల్, కేశవపట్నం మండలం గద్దపాక, కరీంపేట్, రంగపేట్, తిమ్మాపూర్ మండలం రేణిగుంట, పోలంపల్లి, పర్లపల్లి, గన్నేరువరం మండలం మైలారంలో కంటి వెలుగు బృందాలు పని చేస్తాయన్నారు.

అల్ఫోర్స్‌లో కరాటే బెల్టుల ప్రదానం



బెల్టులు స్వీకరించిన విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్ ఇటీవల నిర్వహించిన 2వ దశ కరాటే పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు సోమవారం బెల్టుల ప్రదానం చేశారు. 28 మందికి ఆరెంజ్ బెల్టు, నలుగురికి గ్రీన్‌బెల్ట్, ఒకరికి బ్లాక్‌బెల్టును అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అందజేశారు.అద్భుత ప్రదర్శన కనబర్చిన ఇ.సుహాన్, బి.సహస్ర, ఎస్.కార్తీక్, ఎస్.రికేష్, పి.శ్రీనిధి తదితర విద్యార్థులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలపై అవగాహన కల్పించేందుకు అనేక పోటీలు నిర్వహిస్తూ వారిలో పోటీతత్వాన్ని పెంపొందిస్తున్నట్లు తెలిపారు. కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ వసంత్‌కుమార్, శిక్షకుడు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30న ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కంది కృష్ణారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ఈనెల 17న నామినేషన్‌తో ప్రారంభమైందని, 18న పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, 30న ఓటింగ్, సాయంత్రం కౌంటింగ్, ఫలితాల వెల్లడి జరుగుతుందన్నారు.

ఆర్ట్స్ క్లబ్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ క్రైం: కలెక్టరేట్ సమీపంలోని కెమెరా ఆర్ట్స్ క్లబ్ ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కౌశికుమార్, గట్ల గణేశ్‌లు సోమవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముగ్గురు వ్యక్తులు అక్రమంగా నిర్మాణంలో ఉన్న సంఘం భవనం పిల్లర్లను కూల్చివేశారని, రూ.5 లక్షల మేర నష్టం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వార్షికోత్సవ హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు యాకయ్య ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తమ ఆటపాటలతో హుషారెత్తించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ సమత, కోఆర్డినేటర్ సుష్మ, స్టాఫ్ సెక్రెటరీ రోజారమణి, కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ — తడకలు సరే.. తాగునీరేదీ.!



జిల్లా పరిపాలనకు కేంద్రమైన కలెక్టరేట్‌లో కనీస సౌకర్యాలు అంతంతే. నిత్యం వందల మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ఈ క్రమంలో ప్రతి వేసవిలో ఉద్యోగ సంఘాలు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంటాయి. ఈసారి తడకలు ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. - కరీంనగర్ అర్బన్

ప్రహరీ తొలగించేందుకు చర్యలు

- మూసిన తూమును పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్



మొగ్దుంపూర్‌లో తూమును పరిశీలిస్తున్న అధికారులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లోని గొర్మిల్లకుంట తూమును ఇరిగేషన్ అధికారులు పరిశీలించి ప్రహరీ తొలగించేందుకు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. సోమవారం 'సాక్షి'లో 'మైసమ్మకుంట తూము కబ్జాకు యత్నం' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఇరిగేషన్ డీఈ సంతోష్, ఏఈ మౌనిక, జేఈ నవీన్‌లు కుంట తూమును సందర్శించారు. కుంట నీరు కిందకు పోకుండా రియల్టర్లు మూసివేసిన తూముతో పాటు కట్ట కింద నిర్మిస్తున్న ప్రహరీని పరిశీలించారు. పంచాయతీ అనుమతి లేకుండా ప్రహరీ నిర్మించిన వ్యక్తులకు వెంటనే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సల్మాన్‌కు డీఈ సంతోష్ ఫోన్‌లో తెలిపారు. అనంతరం రాజీవ్ రహదారి సమీపంలో కొందరు వ్యక్తులు ఒర్రెను మట్టితో పూడ్చివేస్తున్నారనే స్థానిక రైతుల సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బఫర్‌జోన్ విడిచి పెట్టి మట్టి పోసుకోవాలని సదరు వ్యక్తులకు సూచించారు.

ఉపాధి హామీలో పనిగంటలు తగ్గించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: వేసవి ఎండల దృష్ట్యా జాతీయ ఉపాధి హామీ పథకంలో పని గంటలు తగ్గించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ ఎండలు రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా ఉపాధి హామీ పథకం పని గంటలు తగ్గించాలని కోరారు. జీవో 333 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పనిచేస్తున్న కార్మికులకు రోజుకు రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని అన్నారు. కేరళ మాదిరిగా మున్సిపాలిటీల్లో పని కల్పించాలని, పనిచేస్తున్న ప్రదేశంలో టెంటు, మంచినీరు, మెడికల్ కిట్, మజ్జిగ ప్యాకెట్స్‌లను ప్రభుత్వమే అందించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిట్టవేణి పెద్ద మల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు మల్యాల పవన్, గజ్జల శ్రీహరి, గజ్జల రాజలింగయ్యలు ఉన్నారు.

కొనసాగుతున్న ఎల్లమ్మ తల్లి బోనాల జోగు



కరీంనగర్‌కల్చరల్: గౌడ కులస్తుల అధ్వర్యంలో కరీంనగర్ రేణుకదేవి ఎల్లమ్మ తల్లి బోనాల జాతరలో భాగంగా జోగు కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎక్సైజ్ క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో జోగు నిర్వహించారు. 25న జరిగే బోనాల జాతరకు రావాలని ఆహ్వానం అందించారు. అలాగే రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు కూడా ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్, కార్పొరేటర్లు భూమాగౌడ్, గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, కృష్ణగౌడ్, నాయకులు కోడూరి మహేందర్, సత్యం, అనిల్‌కుమార్, పంజాల కృష్ణ, కలర్ సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



కరీంనగర్‌టౌన్: అలయన్స్ క్లబ్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సోమవారం భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో జరిగింది. ముఖ్యఅతిథిగా మేయర్ వై.సునీల్‌రావు హాజరయ్యారు. అలయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పండుగ నాగరాజు, సెక్రెటరీగా కె.సుధాకర్, ట్రెజరర్‌గా బి.నగేశ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, కోల అన్నారెడ్డి, ఈద కుమారస్వామి, గాలిపెల్లి నాగేశ్వర్, వెంకటేశ్వర్లు, చీకోటి శ్రీనివాస్ గాంధీ, శీలం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు

కొత్తపల్లి: జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం కేంద్రానికి చెందిన నగునూరి నర్సాగౌడ్ విద్యుత్ చౌర్యం కేసులో ఆరు నెలల శిక్ష అనుభవించాలని లేదంటే జరిమానా చెల్లించాలని జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కె.వీరయ్య తీర్పు చెప్పినట్లు కరీంనగర్ విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. నర్సాగౌడ్ తన ఇంటికి ఎలాంటి అనుమతి లేకుండా 2017లో విద్యుత్‌ను అక్రమంగా వాడుతూ పట్టుబడ్డాడు. అధికారులు మొదటి తప్పుగా భావించి, రూ.1,000 జరిమానా విధించి, వదిలేశారు. అతను మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడగా అధికారులు పట్టుకొని కరీంనగర్ విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నర్సాగౌడ్‌ను సోమవారం జగిత్యాల కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువవ్వడంతో ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాలి లేదంటే రూ.64,122 జరిమానా చెల్లించాలని తీర్పు వెల్లడించారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక



అరవింద్



శ్రీకాంత్

సప్తగిరికాలనీ(కరీంనగర్): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కరీంనగర్ నూతన కమిటీ ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగారపు రజనీకాంత్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా కాంపల్లి అరవింద్, కార్యదర్శిగా గజ్జెల శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా తిప్పారపు రోహిత్, అభిలాష్, హరీశ్, సిరికొండ సాగర్, సహాయ కార్యదర్శిగా వినీషా, వినయ్ మనోజ్, తిప్పారపు శ్రీజతో పాటు 22 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించేందుకు, పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల, సంక్షేమ హాస్టళ్లలో మెస్, కాస్మోటింగ్ చార్జీలు పెంచేందుకు నడుం బిగించాలని సూచించారు.

క్లుప్తంగా...

అంబేడ్కర్ వర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశానికి నోటిఫికేషన్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2022–23 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ అర్హత పరీక్ష కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇంగ్లిష్, హిందీ, ఎడ్యుకేషన్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఎ.వి.ఆర్.ఎన్.రెడ్డి తెలిపారు.

దీక్షకు అనుమతి కోసం హైకోర్టుకు వెళతాం: గట్టు



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులకు మద్దతుగా తలపెట్టిన దీక్షకు అనుమతి కోసం హైకోర్టును ఆశ్రయిస్తామని వైఎస్సార్‌టీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ (పీఏసీ) సభ్యుడు గట్టు రామచంద్రరావు తెలిపారు. ఇందిరా పార్క్ వద్ద నిరుద్యోగుల పక్షాన దీక్షను ఆపేది లేదన్నారు. సోమవారం లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌టీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ క్రమంలో పోలీస్ శాఖను కూడా కలుస్తామన్నారు. ఈ పోరాటంలో 'టీ–సేవ్'ద్వారా అన్ని వర్గాల వారిని కలుపుకుపోతామన్నారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో తలపెట్టిన దీక్షకు పోలీసులు చివరి వరకు అనుమతి పెండింగ్‌లో పెట్టి తర్వాత లేదని చెప్పారన్నారు. వైఎస్ షర్మిలకు భయపడి తమ గళాన్ని నొక్కి పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ ఆఫీస్‌కి రావడానికి కూడా అనుమతి అంటున్నారన్నారు. కాగా, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏ పార్టీలోకి వెళ్తారనేది ఆయన ఇష్టమని గట్టు రామచంద్రరావు అన్నారు. ఆయన వైఎస్సార్‌టీపీలోకి రావాలనుకుంటే గేట్లు తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు.

మే 6 వరకు టీఎస్ఐసెట్ దరఖాస్తుకు గడువు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశ పరీక్షకు అపరాధ రుసుము లేకుండా మే 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని టీఎస్ఐసెట్ కన్వీనర్, కాకతీయ వర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ఐసెట్‌ను మే 26, 27 తేదీల్లో నాలుగు సెషన్‌లలో నిర్వహించనున్నారు.

లీకేజీ ఎలా చేశారు? పేపర్లు ఎవరెవరికి అమ్మారు?

టీఎస్‌పీఎస్సీ కేసులో ఈడీ ప్రశ్నల వర్షం

- ప్రధాన నిందితులు ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిలను ఐదుగంటలకు పైగా ప్రశ్నించిన ఈడీ అధికారులు
- ఆర్థిక లావాదేవీలపై ఆరా తీసిన నలుగురు అధికారుల బృందం
- నేడు మరోమారు ఇద్దరినీ ప్రశ్నించనున్న ఈడీ అధికారులు



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో ఈడీ దూకుడు పెంచింది. పేపర్ లీకేజీ నిందితులు, పేపర్లు కొనుగోలు చేసిన వారి మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీల మూలాలపై ఈడీ అధికారులు దృష్టి పెట్టారు. ఇప్పటికే సిట్ కేసు వివరాల ఆధారంగా ఈసీఐఆర్(ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదు చేసిన ఈడీ అధికారులు విచారణ ముమ్మరం చేశారు. కేసులో ప్రధాన నిందితులైన ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను కోర్టు అనుమతితో సోమవారం నలుగురు సభ్యుల ఈడీ అధికారుల బృందం ప్రశ్నించింది. సోమవారం ఉదయం 11–45 గంటల సమయంలో ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్లు సుమిత్ గోయల్, దేవేందర్‌సింగ్‌ల నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం చంచల్‌గూడ జైలుకు చేరుకుంది.

జైలు లోపలే వేర్వేరుగా విచారణ

జైలు లోపలే ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను వేర్వేరుగా ప్రశ్నించారు. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఈ దర్యాప్తులో ఇద్దరి తరఫు న్యాయవాదుల సమక్షంలోనే ఈడీ అధికారులు ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిల స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్టు తెలిసింది. తొలి రోజు విచారణలో ప్రధానంగా ఇద్దరి కుటుంబ నేపథ్యాలు. బ్యాంకు లావాదేవీలు, టీఎస్‌పీఎస్సీలో ఇతర అధికారులు, సిబ్బందితో పరిచయాలు, పేపర్ లీకేజీకి ఎలా పాల్పడ్డారు..అనంతరం ఎవరెవరితో పేపర్ విక్రయానికి సంబంధించి సంప్రదింపులు జరిపారు..అన్న అంశాలపై లోతుగా ఆరా తీసినట్టు తెలిసింది.

మధ్యవర్తులుగా ఎవరెవరున్నారు?

టీఎస్‌పీఎస్సీ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ నుంచి దొంగిలించిన పేపర్లు కొనుగోలుకు మధ్యవర్తులుగా ఎవరెవరు ఉన్నారు? వారితో ఎలా పరిచయం...? పేపర్ల కొనుగోలు చేసేందుకు ఎవరెవరు ఎలా సంప్రదించారన్న ప్రాథమిక అంశాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. వాస్తవానికి ఈ కేసులో ఆర్థిక అంశాలపైనే ఈడీ ఫోకస్ పెట్టినప్పటికీ, అందుకు ఎలా మార్గాలు ఏర్పడ్డాయన్నది సైతం ఈడీ అధికారులు కూలంకషంగా ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే ఈడీ అధికారులు టీఎస్‌పీఎస్సీ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ అధికారి శంకరమ్మ, మరో అధికారి సత్యనారాయణలను సైతం ఈ నెల 13న ప్రశ్నించిన విషయం తెలిసిందే. వారి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా కూడా కొన్ని ప్రశ్నలు అడిగినట్టు తెలిసింది. మంగళవారం మరోమారు ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డిలను ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు.

ప్రేమ పేరుతో మైనర్‌ను వేధిస్తున్నాడనే..

- నల్లగొండ జిల్లాలో యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- 9 మంది నిందితుల అరెస్ట్.. వారిలో ఇద్దరు మైనర్లు

నల్లగొండ క్రైం: ప్రేమ పేరుతో వేధిస్తున్నాడన్న కారణంతోనే నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం జి.అన్నారం గ్రామానికి చెందిన ఇరిగి నవీన్ అనే యువకుడిని బాలిక సోదరుడు తన బంధుమిత్రులతో కలసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. హత్యలో పాల్గొన్న మొత్తం 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నారు. నిందితులను సోమవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టిన నల్లగొండ ఎస్పీ అపూర్వరావు కేసు వివరాలను వెల్లడించారు.

మందలించినా వినకపోవడంతో

త్రిపురారం మండలం అన్నారం గ్రామానికి చెందిన నవీన్ చదువు మధ్యలోనే ఆపేసి మిర్యాలగూడలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తన గ్రామానికే చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక సోదరుడు మణిదీప్ నవీన్‌ను మందలించాడు. బాలిక కూడా తనను మర్చిపోవాలని చెప్పడంతో మనస్తాపం చెంది మార్చి 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఆస్పత్రిలో కోలుకున్నాక మళ్లీ బాలిక ఇంటి చుట్టూ తిరుగడం మొదలు పెట్టాడు. దీంతో బాలిక సోదరుడు మణిదీప్, అతని స్నేహితుడు శివప్రసాద్‌లు కలిసి ఇంటి వైపు వస్తే చంపుతామని బెదిరించారు. ఆ విషయాన్ని నవీన్ నిడమనూరు మండలం గుంటిపల్లికి చెందిన తన స్నేహితుడు ఈట అనిల్‌కుమార్‌కు చెప్పి సాయం కోరాడు. దీంతో ఈ నెల 9న అనిల్ మధ్యవర్తిగా మాట్లాడేందుకు గుంటిపల్లి గ్రామంలోని స్నేహితుడైన తిరుమల్ ఇంటి వద్దకు మణిదీప్, అతని స్నేహితుడు శివప్రసాద్‌లను పిలిచాడు. ఇదే అదునుగా నవీన్‌ను చంపాలనుకున్న మణిదీప్‌తో పాటు మరో 8 మంది బంధువులు మూడు బైకులపై తిరుమల్ ఇంటికి వెళ్లి కర్రలతో దాడి చేయగా ముగ్గురూ పారిపోయారు. 9 మందిలో ఒకరైన రామలింగం వెంట తెచ్చుకున్న కత్తితో నవీన్‌ను 11 సార్లు పొడవగా అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం నిందితులు తొలుత గుంటూరుకు పారిపోయారు. అయితే చేతిలో డబ్బుల్లేక తిరిగి గ్రామానికి చేరుకున్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. మృతుడు ఎస్సీ కావడంతో ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

పంచాయతీలకు అవార్డుల పంట

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, అధికారులు అందుకున్నారు.

4 కేటగిరీల్లో నాలుగు మొదటి ర్యాంకులు

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ విభాగంలో నాలుగు కేటగిరీల్లో నాలుగు గ్రామాలు మొదటి ర్యాంకులు సాధించగా, రెండు గ్రామాలు రెండో ర్యాంకులను, మరో రెండు గ్రామాలు మూడో ర్యాంకులను సాధించాయి. ఐదు నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలను తెలంగాణ కైవసం చేసుకుంది. అవార్డుల కార్యక్రమం అనంతరం మంత్రి ఎర్రబెల్లి తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ వల్ల జరుగుతున్న పల్లెప్రగతి కార్యక్రమం, అది సాధించిన ఫలితాలను వివరించారు. దేశంలో తెలంగాణ మాత్రమే కేంద్ర ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు సక్రమంగా అందజేస్తోందని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆలోచనా పథంలో పనిచేస్తూ, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, దేశానికి ఆదర్శంగా తెలంగాణను నిలపాలని అవార్డు గ్రహీతలకు సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేయాలని మంత్రి ఎర్రబెల్లి కోరారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ :

1) **ఆరోగ్యకర పంచాయతీ:** గౌతంపూర్– 1వ ర్యాంకు (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)
2) **నీరు సమృద్ధిగా ఉన్న పంచాయతీ:** నెల్లుట్ల– 1వ ర్యాంకు(జనగాం జిల్లా)
3) **సామాజిక భద్రత పంచాయతీ:** కొంగట్‌పల్లి–1వ ర్యాంకు (మహబూబ్‌నగర్ జిల్లా)
4) **మహిళలకు స్నేహపూర్వక పంచాయతీ:** అయిపూర్–1 వ ర్యాంకు (సూర్యాపేట జిల్లా)
5) **పేదరికంలేని మెరుగైన జీవనోపాధి పంచాయతీ:** మన్‌దొడ్డి– 2వ ర్యాంక్ (జోగుళాంబ గద్వాల్ జిల్లా)
6) **సుపరిపాలన పంచాయతీ:** చీమలదారి– 2వ ర్యాంక్ (వికారాబాద్ జిల్లా)
7) **పరిశుభ్ర పంచాయతీ :** సుల్తాన్‌పూర్–3వ ర్యాంకు (పెద్దపల్లి జిల్లా)
8) **స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు ఉన్న పంచాయతీ:** గంభీరావ్‌పేట– 3వ ర్యాంకు (రాజన్న సిరిసిల్ల జిల్లా)

నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తం పంచాయత్ సతత్ వికాస్ పురస్కారం...

బెస్ట్ బ్లాక్ పంచాయతీ: తిమ్మాపూర్(ఎల్ఎండీ)– 2వ ర్యాంకు (కరీంనగర్ జిల్లా)
బెస్ట్ డిస్ట్రిక్ట్ పంచాయతీ: ములుగు– 2వ ర్యాంకు
గ్రామ ఊర్జా స్వరాజ్ ప్రత్యేక పంచాయతీ అవార్డు : ముక్రా– 3వ ర్యాంకు (ఆదిలాబాద్ జిల్లా)
కార్బన్ న్యూట్రల్ ప్రత్యేక పంచాయతీ అవార్డు: కన్హా– 2వ ర్యాంకు (రంగారెడ్డి జిల్లా)
గ్రామ ఊర్జా స్వరాజ్ ప్రత్యేక పంచాయతీ అవార్డు : ఎర్రవెల్లికి ప్రత్యేక ప్రశంస (సిద్ధిపేట జిల్లా)

తెలంగాణ స్ఫూర్తితో దేశమంతటా పల్లెల అభివృద్ధి: సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: పచ్చదనం, పరిశుభ్రత, ఇతర విభాగాల్లో తెలంగాణ పంచాయతీలు దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలవడం రాష్ట్రానికే గర్వకారణమని బీఆర్ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. పంచాయతీల అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ప్రతి అంశంలోనూ అగ్రగామిగా నిలిచి, అత్యధిక అవార్డులు గెలుచుకున్న స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పల్లెల అభివృద్ధికి తమ కృషి కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లితో పాటు అవార్డులు అందుకున్న ప్రజాప్రతినిధులను, అధికారులను సీఎం అభినందించారు. 'దేశవ్యాప్తంగా 2.5 లక్షల గ్రామపంచాయతీలు పోటీపడితే 46 గ్రామాలు అవార్డులు దక్కించుకున్నాయి. వాటిలో 13 అవార్డులు తెలంగాణకే వచ్చినయి. అంటే ప్రకటించిన మొత్తం జాతీయ అవార్డుల్లో 30% తెలంగాణ కైవసం చేసుకున్నది. ఈ 13 ర్యాంకుల్లోనూ 4 ఫస్టు ర్యాంకులు తెలంగాణకే రావడం గొప్ప విషయం' అని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు షురూ

450 కొనుగోలు కేంద్రాలే ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వరికోతలు మొదలై 20 రోజులు దాటినప్పటికీ, కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే విషయంలో తాత్సారం కొనసాగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 450 కొనుగోలు కేంద్రాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. నిజామాబాద్, కామారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ , కరీంనగర్ వంటి కొన్ని జిల్లాల్లోనే ఈ సెంటర్లను ప్రారంభించారు. ఖమ్మం, పెద్దపల్లి తదితర జిల్లాల్లో చాలా చోట్ల సెంటర్ల కోసం రైతులు ఆందోళనలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. అయితే కోతలు పెరిగి ధాన్యం పెద్ద ఎత్తున అమ్మకానికి తీసుకొచ్చే పరిస్థితి ఉన్న చోటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం: గంగుల కమలాకర్ , పౌరసరఫరాల శాఖ మంత్రి

రాష్ట్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. కొన్ని పెద్ద గ్రామాల్లో రెండేసి కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తాం. రైతులు తమ గ్రామ పరిధిలోని కొనుగోలు కేంద్రానికే వెళ్లి పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవచ్చు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయడమే సెంటర్ల నిర్వాహకుల పని. మిల్లర్లతో రైతులకు ఎలాంటి సంబంధం ఉండదు. తరుగు, తేమ, నాణ్యత పేరుతో మిల్లర్లు రైతులను వేధిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.

స్ట్రాంగ్‌రూమ్ తాళంచెవుల మాయంపై ఆరా

జగిత్యాల: జగిత్యాల జిల్లాలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓ స్ట్రాంగ్ రూమ్ తాళం చెవుల మాయంపై ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు విచారణ చేపట్టారు. స్ట్రాంగ్‌రూమ్‌లో ఎన్నికల సామగ్రిని ఎలా భద్రపర్చారు.. తాళంచెవులు ఎలా తప్పిపోయాయి.. అనే దానిపైనే సుదీర్ఘంగా విచారణ జరిపినట్లు తెలిసింది. 2018 ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం ఫలితాల్లో అక్రమాలు జరిగాయని అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అప్పట్లో హైకోర్టును ఆశ్రయించడంతో ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తెరిచి 17ఏ, 17సీ డాక్యుమెంట్ కాపీలు, సీసీ ఫుటేజీలు, ఎన్నికల ప్రొసీడింగ్స్‌ను ఈ నెల 11న తమకు సమర్పించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. అయితే, మొత్తం మూడు స్ట్రాంగ్‌రూమ్‌లకుగాను రెండు తెరుచుకున్నాయి. కోర్టు అడిగిన 17ఏ, 17సీ వీడియో ఫుటేజీలు భద్రపర్చిన మూడోగది తాళంచెవులు లేవు. ఈ విషయంపై కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ ఈ నెల 12న మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాళంచెవులు మాయం కావడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక అందజేయాలని చీఫ్ ఎలక్షన్ కమిషన్‌ను ఆదేశించింది.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు, పరారీలో ఇద్దరు
- వెల్లడించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



పోలీసుల అదుపులో నిందితులు

ఆదిలాబాద్‌రూరల్: అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పోలీసుల అదుపులో నలుగురు నిందితులు, పరారీలో ఇద్దరు ఉన్నారని తెలిపారు. మావల పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌లోని తాటిగూడకు చెందిన సయ్యద్ ఫారూక్, వడ్డెర కాలనీకి చెందిన టెంపు సురేష్, మంచిర్యాలకు చెందిన షేక్ అక్బర్, మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన బాలాజీ అభిమాన్ మన్య చోరీలు చేస్తూ జల్సాలకు అలవాటుపడ్డారు. డబ్బులు సరిపోక వివిధచోట్ల పార్కింగ్ చేసిన బైక్‌లను దొంగలించి కిన్వట్‌లో బాలాజీ అభిమాన్, ఆదిల్‌కు విక్రయించి వచ్చిన డబ్బులను పంచుకునేవారు. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో నిందితులు ఫారుక్, టెంపు సురేష్, షేక్ అక్బర్, బాలాజీ అభిమాన్ మన్య దస్నాపూర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. సమాచారం అందుకున్న మావల పోలీసులు వారిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 19 బైక్‌లు, 5 గ్రాముల ఆభరణాలు, 10 తులాల వెండి సామగ్రి, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీకి చెందిన మాడే రతన్, మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన ఆదిల్ పరారీలో ఉన్నారు. దొంగల ముఠాను పట్టుకుని సొత్తు రికవరీకి చొరవ చూపిన ఎస్సై విష్ణువర్ధన్, ఆదిలాబాద్ రూరల్ సీఐ రఘుపతి, జె.సవిత, ఎంఏ కరీంను ఎస్పీ అభినందించి రివార్డు ప్రకటించారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ పాల్గొన్నారు.

ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో..

ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1, బాల్కొండలో 1, నిర్మల్‌లో 3, మావలలో 4, బోథ్‌లో 1, నిర్మల్ రూరల్‌లో 1, ఆదిలాబాద్ రూరల్‌లో 1, ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో 1, టూటౌన్ పరిధిలో 6 బైక్‌లను నిందితులు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీని గద్దె దింపాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి
- హుజూరాబాద్‌లో ప్రజాచైతన్య యాత్ర



ప్రజాచైతన్య యాత్రలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి, పక్కన నాయకులు

హుజూరాబాద్‌రూరల్: దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని గద్దె దింపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో సీపీఐ ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రూ.72 లక్షల కోట్లు ప్రజలకు పంచుతామని చెప్పిన ప్రభుత్వం పూర్తిగా ఆ విషయాన్ని పక్కన బెట్టిందని అన్నారు. రూ.50 వేల కోట్ల ఆస్తులు ఉన్న ఆదానీ రూ.50 లక్షల కోట్లకు ఎలా ఎదిగారన్నారు. దేశంలో ఎమ్మెల్యే, ఎంపీలను వెలగొట్టే దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయన్నారు. 26 రాష్ట్రాల్లో సీపీఐ కమిటీలు ఉన్నాయని, గుర్తింపు రద్దు చేయడం ముమ్మాటికీ బీజేపీ రాజకీయ కుట్రేనని పేర్కొన్నారు. డబుల్ బెడ్రూమ్‌లు ఎంతమందికి ఇచ్చారో తెలంగాణ ప్రభుత్వం లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ.. బీజేపీ ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా దగా చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్, సీపీఐ మండలం నాయకులు రవీందర్ రెడ్డి, రాజు, చంద్రన్న, కొమురమల్లు తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారు

ఇల్లందకుంట(హుజూరాబాద్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నియంతలా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ రంగసంస్థలన్నింటినీ యథేచ్ఛగా అమ్మివేస్తూ దేశసంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నాడని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఇల్లదకుంట మండల కేంద్రంలో పల్లెపల్లెకు సీపీఐ–ప్రజల వద్దకు సీపీఐ ప్రజాజైతన్యయాత్ర యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచినా పేదల బతుకులు మారలేదని, చౌకీదారుగా ప్రజలను ప్రజాధనాన్ని కాపాడుతానని అధికారంలోకి వచ్చిన మోదీ విదేశాల నుంచి నల్లధనం తీసుకురాలేదని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, ఆయా జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తాండ్ర సదానందం, సురేశ్, మండల కార్యదర్శి మాదారపు రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖరా(కె) గ్రామానికి కేంద్ర పురస్కారం



కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ గాడ్గే మీనాక్షి

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముఖరా(కె) పంచాయతీకి స్పెషల్ కేటగిరీ కింద గ్రామ ఊర్జాస్వరాజ్ పంచాయతీ విశేష్ పురస్కార్ అవార్డు దక్కింది. నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయతీ సతత్ వికాస్ 2023 పురస్కార్ అవార్డులను ఢిల్లీలో సోమవారం ప్రదానం చేశారు. విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ చేతుల మీదుగా విశేష్ పురస్కార్ అవార్డును ముఖరా కె సర్పంచ్ గాడ్గే మీనాక్షి అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పాల్గొన్నారు.

రూ.50 లక్షల రివార్డు...

అవార్డు అందుకున్న ముఖరా (కె) పంచాయతీకి కేంద్రం రూ.50 లక్షల రివార్డును ప్రకటించింది. ఈ నగదును కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీ ఖాతలో జమ చేయనున్నట్లు సర్పంచ్ మీనాక్షి తెలిపారు. కేంద్రం విడుదల చేసిన నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జిల్లా అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీపీవో శ్రీనివాస్, ముఖరా బి ఎంపీటీసీ గాడ్గేసుభాష్ పాల్గొన్నారు.

ఉద్యోగం రావడం లేదని ఆత్మహత్య



మృతుడు అనుష్‌రాజ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: ఉద్యోగం రావడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై తౌసినొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన ఓరెం ప్రేమ్‌సాగర్ స్థానిక మెడికల్ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆయన కుమారుడు అనుష్‌రాజ్(26) ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. స్నేహితులకు ఉద్యోగాలు రావడం, తనకు ఉద్యోగం రాకపోవడంపై ఆవేదన చెందేవాడు. సోమవారం వేకువజామున అనుష్‌రాజ్ పురుగుల మందు తాగాడు. అనుష్‌రాజ్‌ను నిద్రలేపేందుకు అతడి చెల్లెలు కరుణశ్రీ ప్రయత్నించగా లేవలేదు. పురుగుల మందు తాగిన విషయాన్ని గమనించి స్థానికుల సహాయంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ప్రేమ్‌సాగర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

వెటరన్ అథ్లెటిక్స్‌లో దంపతుల ప్రతిభ



పతకాలు అందుకుంటున్న ఆనంద్‌రావు, శకుంతల

ఆసిఫాబాద్‌రూరల్: వెటరన్ అథ్లెటిక్స్‌లో కుమురంభీం జిల్లాకు చెందిన దంపతులు సత్తాచాటారు. ఈ నెల 16న హైదరాబాద్‌లో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్స్‌లో ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామానికి చెందిన ఆనంద్‌రావు, శకుంతల దంపతులు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. 3 కిలోమీటర్ల రన్నింగ్, వాకింగ్ పోటీల్లో ఇద్దరూ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం గెలుచుకున్నారు. 1,500 మీటర్ల రన్నింగ్ మహిళా విభాగంలో శంకుతల బంగారు, ఆనంద్‌రావు కాంస్య పతకం సాధించారు. గతంలోనూ దంపతులు జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటారు.





రాజన్నకు పూజలు.. కోడెమొక్కులు

వేములవాడ: రాజన్నను సోమవారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు.. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.20 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

మేడిపెల్లి(జగిత్యాల): అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని వల్లంపల్లిలో ఎస్సారెస్పీ కాలువపై రూ.2కోట్ల 60 లక్షలతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో లక్షా పదివేలుగా ఉన్నా తలసరి ఆదాయం రాష్ట్రం ఏర్పడిన తర్వాత 3 లక్షల 10 వేలకు పెరిగిందన్నారు. అనంతరం రంగాపూర్‌లో కంటివెలుగు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కాచారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్ రావు, ఎంపీపీ దోనకంటి ఉమాదేవి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లోకబాపురెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


మిల్లెట్ సాగులో రైతు మహిళలు

పండించారు... వడ్డించారు!

ఒక చేత్తో నాగలి... ఇంకో చేత్తో గరిట!

**రైతుకు కొత్త నిర్వచనం కావాలి.
వ్యవసాయానికి కొత్త అర్థం చెప్పాలి.
మహిళ సాగు చేస్తే నేల పులకిస్తుంది.
గాజుల చేతిలో గరిటే కాదు...
నాగలి కూడా గర్వంగా చాలుదీరుతుంది.
అనంతపురంలో మహిళలు 'ఆదర్శసాగు' చేస్తున్నారు.
ఆరోగ్యం కోసం ఏం తినాలో ఎలా తినాలో నేర్పిస్తున్నారు.**

దేశానికి పట్టుగొమ్మలు గ్రామాలు. వినడానికి బావుంటుంది. దేశానికి కంచంలో అన్నంగా మారేది గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలే... కాబట్టి గ్రామానికి, రైతుకి అంతటి గుర్తింపు వచ్చింది. మరి అదే పొలం రైతుకి సమాధి అవుతుంటే వ్యవసాయం బతికి బట్టకట్టేదెలా? నాగలి కర్రు రైతు గుండెను చీలుస్తుంటే భూమిలో బంగారం పండేదెప్పుడు? రైతు వాణిజ్య పంటల మాయలో పడి అప్పుల పాలైతే ఆ రైతుని, ఎరువులతో కలుషితమైన ఆ భూమిని కాపాడేదెవరు? పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలనే కసితో రైతు మహిళలు ఆ పనిని చేపట్టారు. భర్తను మింగేసిన పంటపొలాల్లోనే భవితను వెతుక్కుంటున్నారు. సంఘటితంగా వ్యవసాయం చేస్తూ దిగుబడితో లాభాలు కళ్ల చూస్తున్నారు. ఇది అనంతపురంలోని మహిళలు సాధించిన విజయం. వాళ్లకు దారి చూపిన భానుజ సంకల్పం.

అనంతపురం జిల్లా, రూరల్ మండలం, కురుగుంట్ల గ్రామం. ఒకప్పుడు రైతుల ఆత్మహత్యలను చూసిన గ్రామం. ఇప్పుడు ఆ రైతు కుటుంబాల మహిళలు నిర్వహిస్తున్న రెస్టారెంట్‌ను చూస్తోంది. ఆ రెస్టారెంట్‌లో వంటకు అవసరమైన ధాన్యాలను పండిస్తున్న వ్యవసాయ క్షేత్రాలను చూస్తున్నారు. ఈ విజయాన్ని 'చెరువు భానుజ'... సాక్షితో పంచుకున్నారు.

'ఒంటరి' పోరాటం!


చెరువు భానుజ

''భర్త వాణిజ్య పంటలతో నష్టాల ఊబిలో కూరుకుపోయి, అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటే... అగమ్యగోచరంగా, అచేతనంగా మిగిలిన వాళ్లకు అండగా నిలిచాను. సింగిల్ పేరెంట్‌గా పిల్లల పోషణ బాధ్యతను మోస్తున్న మహిళలే వీరంతా. భర్తను కోల్పోయిన వాళ్లకు తక్షణ సహాయం చేస్తూ, ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయం కోసం కార్యాలయాలకు వెళ్లి పని చేయించడం వరకు తోడుగా ఉంటున్నాను. అంతటితో ఆ కుటుంబం గట్టెక్కదు. ఉపాధి కావాలి, వాళ్లకు వచ్చిన పని వ్యవసాయమే. అయితే పొలం లేదు. దాంతో కలెక్టివ్ ఫార్మింగ్ కోసం పొలం లీజుకు తీసుకున్నాం. వ్యవసాయ క్షేత్రాలకు 'పుడమి తల్లి, మన భూమి' అని పేర్లు పెట్టుకుని సేద్యం మొదలు పెట్టాం. తక్కువ ఖర్చుతో పంట చేతికి రావడానికి మిల్లెట్స్ సాగు, ఏడాది పొడవుగా రాబడి కోసం కూరగాయలు, పండ్లు సాగు చేస్తున్నాం. మా ప్రయాణంలో అసలైన టర్నింగ్ పాయింట్ ఇక్కడే. పంటతో ఆపేయకుండా వంట కూడా మొదలుపెట్టాం.


మిల్లెట్ రెస్టారెంట్ నిర్వహణలో మహిళలు

మార్కెట్ పుట్టింది!

హరిత విప్లవంతో మనదైన సాగు కనుమరుగైంది. మిల్లెట్స్ సాగు మర్చిపోయాం, విత్తనాలు అంతరించే దశకు చేరుకున్నాయి. ఇక ఈ వంటల గురించి ఈ తరానికి తెలియనే తెలియదు. ప్రభుత్వ సంస్థల సహకారంతో విత్తనాలు సేకరించాను. సేద్యం తెలిసిన మహిళలు కావడంతో సాగులో పెద్దగా ఇబ్బందులు రాలేదు. కానీ వీటిని ఎలా వండాలో నేర్పించడానికి మాస్టర్ షెఫ్‌లతో శిక్షణ ఇప్పించి మరీ కురుకుంట్లలో రెస్టారెంట్ పెట్టాం. రెస్టారెంట్ పెట్టడానికి ముందు ఆ ఊరిని డయాబెటిక్ ఫ్రీ విలేజ్‌గా మార్చాలనే సంకల్పంతో ఉచితంగా వండిపెట్టాం. డైటీషియన్‌లు సూచించినట్లు చిరుధాన్యాల వంటలను మూడు పూటలా తినాల్సిన మెనూను వండి వడ్డించాం. నాలుగవ వారానికి షుగర్ లెవెల్స్ అదుపులోకి రావడాన్ని స్వయంగా తెలుసుకున్నారు పేషెంట్‌లు. మిల్లెట్స్ పట్ల గ్రామస్థుల్లో అవగాహన కోసం చేసిన ప్రయత్నం అది. అయితే ఆ భోజనం తిన్న వాళ్లు, తెలిసిన వాళ్లు రెస్టారెంట్ పెట్టమని సూచించారు. మా మహిళలు కూడా ఉత్సాహంగా ముందుకొచ్చారు. అలా రెండు నెలల కిందట 'పుడమి తల్లి మిల్లెట్ హోటల్' ప్రారంభమైంది. 'ఆర్థిక భద్రత, ఆహార భద్రత, ఆరోగ్య భద్రత' మా ట్యాగ్‌లైన్. ఊహించనంత గొప్ప స్పందన వచ్చింది. ఆఫీసర్‌లు కూడా వచ్చి భోజనం చేస్తున్నారు. హోటల్ అనేక ప్రదేశాల్లో శాఖలు తెరవమని అడుగుతున్నారు. కానీ అది ఇప్పట్లో సాధ్యం కాదు. ఎందుకంటే హోటల్ మరో శాఖ ప్రారంభం కావాలంటే అందుకు తగిన వ్యవసాయ క్షేత్రాన్ని విస్తరించాలి. ఇప్పుడు మేము సాగు చేస్తున్న పొలంలో సహజమైన సేంద్రియ పద్ధతుల్లో పండినవే మా రెస్టారెంట్‌లో వండుతున్నాం. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ నాలుగు శాఖల్లో మొత్తం 1800 మంది రైతుమహిళలు మాతో సంఘటితమై ఉన్నారు. వారందరికీ ఉపాధిమార్గాల అన్వేషణ కోసం విస్తృతంగా పని చేయాల్సి ఉంది.

వెలుగు పుట్టింది!

'సూర్యోదయం అవుతున్నప్పుడు పుట్టింది, ఇంటికి వెలుగు తెస్తుంద'ని... మా నాన్న నాకు భానుజ అని పేరు పెట్టారు. మాది అనంతపురం జిల్లా, నల్లమాడ మండలం, బడవాండ్ల పల్లి. నాన్న చదువుకున్నది తక్కువే, కానీ కమ్యూనిస్ట్ నేపథ్యంలో చాలా నేర్చుకున్నారాయన. పాటలు రాసి పాడేవారు. చిన్నప్పుడు నాన్నతో సమావేశాలకు వెళ్లేదాన్ని. ఆ జ్ఞానమే నన్ను ఇలా తీర్చిదిద్దింది. సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చదువుకుంటున్నప్పుడు, సందర్శనకు వచ్చిన అధికారులకు మా హాస్టల్‌లో వసతులలేమిని చెప్పే ధైర్యం ఉండేది. టెన్త్ చదువుతూనే యంగ్ ఇండియా సంస్థలో వాలంటీర్‌గా పని చేశాను. అమ్మ పట్టుపట్టి ఇంటర్‌లో చదువాపించి మరీ పెళ్లి చేసింది. కానీ నేను గృహిణిగా ఇంటికే పరిమితం కాకుండా సామాజిక కార్యకర్తనయ్యాను. మహిళలు, పిల్లలు, దళితుల ఉన్నతి కోసం పని చేయాలనే ఉద్దేశంతో 1996లో రెడ్స్ స్థాపించాను. ట్రాఫికింగ్‌కి గురైన మహిళలను కాపాడడం నుంచి, డ్వాక్రా సంఘాల ఏర్పాటు, ఉమ్మడి అటవీ సంరక్షణ వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పని చేశాను. మహిళల అక్రమ రవాణాకు పాల్పడిన ఏజెంట్‌లు కదిరిలో నా ఇంటిని కాల్చేశారు. దాంతో నా నివాసం అనంతపూర్ పట్టణానికి మారింది'' అని తన సమాజ సేవాయాత్రను వివరించారు భానుజ.

– వాకా మంజులారెడ్డి

న్యూస్‌మేకర్



రెండు రోజుల క్రితం 'మిస్ ఇండియా 2023' ఫైనల్స్ జరిగాయి. రాజస్థాన్ సుందరి నందిని గుప్తా విజేత. ఢిల్లీకి చెందిన శ్రేయా పూజా ఫస్ట్ రన్నరప్. కాని మణిపూర్ అమ్మాయి స్ట్రెలా లువాంగ్ సెకండ్ రన్నరప్‌గా అందరి దృష్టిని ఆకర్షించింది. మణిపూర్ నుంచి మిస్ ఇండియా ఫైనల్స్ వరకూ చేరిన వారు ఇప్పటి దాకా లేరు. అదీగాక టీనేజ్‌లో మూర్ఛవ్యాధి వల్ల తీవ్రంగా బాధ పడిన స్ట్రెలా తన అందాల కల కోసం ఆ వ్యాధితో పోరాడి గెలిచింది. స్ఫూర్తిగా నిలిచింది.

మూర్ఛ నుంచి మిస్ ఇండియా వరకు



'అది నా భవిష్యత్తుకు అడ్డంకి అనుకోలేదు. ఒక ఆశీర్వాదం అనుకున్నాను' అంది టీనేజ్‌లో మూర్ఛ వ్యాధి బారిన పడ్డ స్ట్రెలా. 'అడ్డంకులు వస్తేనే కదా మనం పోరాడి మరింత శక్తిమంతులం అయ్యేది' అందామె.

ఇప్పుడు స్ట్రెలా మణిపూర్‌లో క్షణం తీరిక లేకుండా జనం అభిమానంతో ఇస్తున్న విందుల్లో పాల్గొంటోంది. సీఎం ఆమెను ఆహ్వానించి ప్రభుత్వ పెద్దలతో కలిసి డిన్నర్ ఇచ్చాడు. కారణం మణిపూర్‌లాంటి అతి చిన్న రాష్ట్రం నుంచి మొదటిసారి 'మిస్ ఇండియా' పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో ఒకరుగా ఆమె నిలవడం. ఏప్రిల్ 15న ఇంఫాల్‌లో జరిగిన 'మిస్ ఇండియా 2023' ఫైనల్స్‌లో 28 రాష్ట్రాలు 2 కేంద్ర ప్రాంతాల నుంచి 30 మంది పోటీ పడితే వారితో తలపడి మూడో స్థానంలో నిలిచింది స్ట్రెలా. అయితే ఈ విజయం అంత ఈజీగా రాలేదు. మానసికంగా ఆరోగ్యపరంగా ఆమె చాలా పోరాటం చేయాల్సి వచ్చింది.

వెక్కిరింతలు తట్టుకుని

14 ఏళ్ల వయసులో స్ట్రెలాకు మిస్ ఇండియా కావాలన్న లక్ష్యం ఏర్పడింది. కాని ఈశాన్య రాష్ట్రాల నుంచి ఎవరూ అలాంటి కలను కనరు. ఇంకా చెప్పాలంటే 'నిర్వచనాల ప్రకారం ఉండే ముక్కు, రూపు' వారికి లేవన్న భావన వారిలో బలంగా ప్రవేశపెట్టి చాలా కాలం అవుతోంది. అందుకే అందరూ ఏడ్పించేవారు స్ట్రెల్లాను. అది వొత్తిడిగా మారి ఆ తర్వాత నరాల జబ్బుగా పరిణమించింది. తరచూ మూర్ఛలు వచ్చేవి. ఒక్కోసారి మంచానికి అతుక్కు పోయేదాన్ని. అలాంటి స్థితిలో కూడా ఇదంతా దాటుతాను... నాకో అందమైన భవిష్యత్తు ఉంటుంది అని గట్టిగా అనుకునేదాన్ని. అదే నిజమైంది. ఇవాళ నా జబ్బును జయించాను. ఆత్మవిశ్వాసం పెంచుకున్నాను' అంటుందామె.

క్యాబిన్ క్రూగా పని చేసి

బిజినెస్ స్టడీస్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కొనసాగిస్తూనే మోడల్‌గా పని చేస్తోంది స్ట్రెల్లా. కొంతకాలం ఒక ఎయిర్ లైన్స్ సంస్థలో క్యాబిన్ క్రూగా చేసింది. 'ఇంతకు ముందు అందం నిర్వచనం వేరే ఉండేది. ఇప్పుడు సహజ రూపాలను కూడా అందంగా చూస్తున్నారు. అందుకే నేను టాప్ 3గా నిలిచానని అనుకుంటున్నాను.' అంది స్ట్రెల్లా.

రంజాన్ స్పెషల్ రెసిపీ

పత్థర్ కా గోష్

కావలసినవి: మటన్ (బోన్‌లెస్)– అరకేజీ ; నిమ్మకాయ – 1 ; ఉప్పు – ఒకటిన్నర టీ స్పూన్‌లు ; అల్లంవెల్లుల్లి పేస్ట్ – టేబుల్ స్పూన్ ; నూనె– టేబుల్ స్పూన్.

గరం మసాలా కోసం: దాల్చిన చెక్క – 2 అంగుళాలు ; నల్ల యాలకులు– 2 ; నక్షత్ర లవంగం – 1 ; మిరియాలు– ఒకటిన్నర టీ స్పూన్‌లు; ధనియాలు– టీ స్పూన్ ; షాజీరా– టీ స్పూన్.



తయారీ: ● మటన్ ముక్కలను శుభ్రంగా కడిగిన తరవాత ఒక్కొక్క ముక్కను చిన్న రోట్లో లేదా కటింగ్ బోర్డు మీద వేసి పూర్తిగా ముద్దయిపోకుండా రెండు–మూడు సార్లు దంచి తీయాలి. ఇలా ముక్కలన్నింటినీ చేయాలి. ముక్క కొద్దిగా వదులైతే మసాలా బాగా పడుతుంది. ఆ ముక్కల్లో అల్లం వెల్లుల్లి పేస్ట్, నిమ్మ రసం, ఉప్పు వేసి కలిపి ఓ గంట సేపు ఉంచాలి. ● గరం మసాలా కోసం తీసుకున్న దినుసులను పెనంలో నూనెలేకుండా దోరగా వేయించి, చల్లారిన తరవాత మిక్సీలో పొడి చేయాలి. ● ఓ గంట తర్వాత అల్లం వెల్లుల్లి మిక్స్‌లో నుంచి ఒక్కొక్క ముక్కను తీసి మరొక పాత్రలో వేయాలి. ఆ ముక్కల్లో ఇప్పుడు గరం మసాలా పొడి వేసి సమంగా పట్టేటట్లు కలిపి పైన ఒక స్పూన్ నూనె వేసి రెండు గంటల సేపు నానవ్వాలి. ● ఇప్పుడు మందపాటి పెనానికి నూనె రాసి మటన్ ముక్కలను మీడియం మంట మీద కాల్చాలి. రెండు వైపులా కాలిన తరవాత వేడిగా సర్వ్ చేయాలి. పత్థర్ కా గోష్ ఉల్లి పాయ, నిమ్మకాయ ముక్కలతో కలిపి తింటే బాగుంటుంది. ● రెస్టారెంట్‌లో వీటి కోసం పెద్ద రాయి ఉంటుంది. రాతిమీద కాలుస్తారు కాబట్టి పత్థర్ కా గోష్ అనే పేరు వచ్చింది. ఇంట్లో మందపాటి ఇనుప పెనం మీద చేసుకోవచ్చు.


పెద్ద గొడుగు నీడన మిరప కాయలు కోస్తున్న దృశ్యం

పొలంలో కూలీలకు పెద్ద గొడుగు!

- మండే ఎండ నుంచి రైతులు, వ్యవసాయ కార్మికులకు ఊరట
- పది మంది కూలీలకు నీడనిచ్చే 'సామూహిక గొడుగు'ను రూపొందించిన గ్రామీణ ఆవిష్కర్త
- రూ. 5 వేల ఖర్చుతో ఎవరైనా సులభంగా తయారు చేసుకోవచ్చు

పొలాల్లో లేదా ఆరుబయట పనులు చేసుకునే వారికి మండే ఎండ పెద్ద ఇబ్బంది కలిస్తుంటుంది. ముఖ్యంగా మిరప, పత్తి, కూరగాయలు తదితర ఆరుతడి పంటల్లో వ్యవసాయ పనులు చేసే కూలీలకు, రైతులకు ఎండ పెద్ద సమస్యగా ఉంటుంది. వేసవి వచ్చిందంటే రైతులు, వ్యవసాయ కూలీల పాట్లు, ముఖ్యంగా మహిళా కూలీల పాట్లు వర్ణించనలవి కాదు. మిట్ట మధ్యాహ్నం ఎండకు తట్టుకోలేక 2–3 గంటల సేపు పనులకు విరామం ఇచ్చి చెట్లు, షెడ్ల కింద సేదదీరాల్సిన పరిస్థితులు వచ్చాయి. కూలీల అవసరం ఎక్కువగా ఉండే మిరప, పత్తి, కూరగాయ తోటల్లో ఎండాకాలంలో సకాలంలో పనులు పూర్తికావటం లేదు. రైతులు, రైతు కూలీల ఎండ కష్టాలను తీర్చడానికి ఓ గ్రామీణ మోటారు మెకానిక్ చక్కటి ఆలోచన చేసి శభాష్ అనిపించుకుంటున్నారు. ఈ అద్భుత ఆవిష్కరణను అందించిన సృజనశీలి పేరు రేపల్లె షణ్ముగరావు. ఊరు కంబాలపల్లి. జిల్లా మహబూబాబాద్.

పొలంలో పక్కపక్కన సాళ్లలో పది మంది పనులు చేసుకోవడానికి సరిపోయేంత నీడనిచ్చే చక్రాలతో కూడిన 'సామూహిక గొడుగు'ను రూపొందించారు. 20 అడుగుల వెడల్పున 6 అడుగుల మేరకు నీడనిస్తుంది. 7 అడుగుల ఎత్తు ఉంటుంది. అవసరం మేరకు ముందుకు జరుపుకోవడానికి 4 చక్రాలను అమర్చారు. 6 అడుగులు నీడ పడే స్థలంలో పని పూర్తి చేసుకున్న తర్వాత ముందుకు తోస్తే గొడుగు సులభంగా ముందుకు జరుగుతుంది. ఆ విధంగా నీడలోనే వ్యవసాయ పనులు చేసుకోవచ్చని షణ్ముఖరావు తెలిపారు. ఇనుప పైపులతో చేసే దీని ఖరీదు రూ. 5–6 వేలు. బరువు 15–18 కిలోలు మాత్రమే. విడి భాగాలను 10 నిమిషాల్లో ఒకచోట చేర్చి గొడుగును నిలబెట్టుకోవచ్చు. పని పూర్తయ్యాక వేటికవి విడదీసి మడిచి ఇంటికి తీసుకెళ్లొచ్చు. చక్రాల దగ్గర, పైకప్పు దగ్గర రెండు చోట్ల మాత్రమే వెల్డింగ్ ఉంటుంది. మిగతా అన్ని చోట్లా నట్లు, బోల్టులే. తయారీ ఖర్చు రూ. 5–6 వేలు. ఖాళీ సంచులను కుట్టి పై కప్పుగా వేసుకుంటే ఖర్చుతగ్గుతుంది.

దగ్గర్లో ఉండే వారికి షణ్ముఖరావు తయారు చేసి ఇస్తున్నారు. అయితే, దూరప్రాంతాలకు దీన్ని పంపాలంటే (పొడవు 20 అడుగులు ఉంటుంది కాబట్టి) రవాణా చార్జీ తయారీ ఖర్చంత అవుతోంది. దీన్ని గమనించిన షణ్ముఖరావు రైతులు ఎవరికి వారు తయారు చేసుకోవటం మేలని సూచిస్తున్నారు. ఏయే కొలతల్లో ఎలా ఈ పెద్ద గొడుగును తయారు చేసుకోవాలో చెబుతూ డిజైన్‌ను బహిరంగ పరిచారు. ఈ వివరాలు చూపిస్తే గ్రామాల్లో స్థానికంగా ఉండే వెల్డర్ ఎవరైనా సులభంగా దీన్ని తయారు చేసేయగలుగుతారు. ఇప్పటికే పలువురు రైతులు తయారు చేయించుకొని వాడుతున్నారని షణ్ముఖరావు సంతోషంగా చెప్పారు. ఎర్రని ఎండ కాచే మిట్ట మధ్యాహ్న వేళల్లో కూడా నిశ్చింతగా వ్యవసాయ పనులను సులువుగా, భద్రంగా పూర్తి చేసుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతోందని దీన్ని వాడుతున్న రైతులు తెలిపారు.

కలుపు లేదా పత్తి తీయటమో, మిరపకాయలు కోయటమో, కల్లాల్లో తాలు ఏరటమో, కూరగాయలు కోయటమో ఏ పనులైనా ఈ 'సామూహిక గొడుగు' నీడన చేసుకోవచ్చు. కరోనా అనంతర కాలంలో ఎండను పెద్దగా తట్టుకోలేకపోతున్నామని కొందరు రైతులు వాపోతున్నారు. ఎండ తీవ్రత ప్రతి ఏటా పెరుగుతున్న నేపథ్యంలో షణ్ముఖరావు ఆవిష్కరణ ప్రజలకు ఉపయోగకరంగా మారటం సంతోషదాయకం.

చక్రాలతో కూడిన పెద్ద గొడుగు నమూనా



ఎవరైనా తయారు చేసుకోవచ్చు



30 ఏళ్లుగా మోటారు మెకానిక్‌గా రైతులు, కూలీలు ముఖ్యంగా మహిళల బాధలను దగ్గరి నుంచి చూస్తున్నాను. ఎండ తీవ్రత పెరుగుతున్నందు వల్ల తట్టుకోలేకపోతున్నారు. వారి బాధను కొంతైనా తగ్గించాలని ఈ ఆవిష్కరణ చేశా. ఇటు 20 అడుగులు, అటు 6 అడుగుల మేరకు నీడనిస్తుంది. ఎత్తు 7 అడుగులు ఉంటుంది. కొలతలు పొలంలో సాళ్లను బట్టి మార్చుకోవచ్చు. బొమ్మలో చూపిన విధంగా కొలతల ప్రకారం ఎవరైనా గ్రామాలు, పట్టణాల్లోనే దీన్ని తయారు చేసుకోవచ్చు. వెల్డింగ్ చేసే వ్యక్తికి సందేహాలుంటే నాతో ఫోన్‌లో మాట్లాడిస్తే వివరంగా చెబుతాను. నాకు రూపాయి ఇవ్వక్కర్లేదు. రైతులు సంతోషంగా ఉంటే అంతే చాలు. ఇప్పటికే అనేక మంది రైతులు తయారు చేయించుకొని వాడుతున్నారు. గత ఐదేళ్లలో 8 ఆవిష్కరణలు చేశాను. వరుసగా 4 ఏళ్లు ఉత్తమ ఆవిష్కర్తగా కలెక్టర్ నుంచి అవార్డులు తీసుకున్నాను.

– రేపల్లె షణ్ముఖరావు (94921 13609), పెద్ద గొడుగు ఆవిష్కర్త, కంబాలపల్లి, మహబూబాబాద్ జిల్లా

మూడేళ్ల నుంచి వాడుతున్నాం.. చాలా సంతోషంగా ఉంది..



పత్తి, మిరప, వేరుశనగ పంటలు పండిస్తున్నాం. మూడేళ్ల క్రితం షణ్ముఖరావు చెప్పినట్లు మా ఊళ్లోనే 15x7x7 అడుగుల కొలతతో తయారు చేయించుకున్నాం. ఎండ బాధ లేకుండా సంతోషంగా పనులు చేసుకుంటున్నాం. మా పనులకు కూలీలు పిలిస్తే చాలు వస్తున్నారు. మధ్యాహ్నం కూడా పని ఆపకుండా కొనసాగిస్తున్నాం. 2 గంటలు పని కలిసి వస్తోంది. ఈ పెద్ద గొడుగును పది నిమిషాల్లో బిగించుకొంటున్నాం. పని పూర్తి చేసుకున్నాక పది నిమిషాల్లో మడిచి ఇంటికి తెచ్చుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉన్నాం.

– గడ్డం జైపాల్‌రెడ్డి (97019 26657) రైతు, మణుగూరు

సాగుబడి

అశ్విని కార్తె: ఏప్రిల్ 27 వరకు


లాభదాయకంగా సుగంధ పంటల సాగు

హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగానికి స్వస్తి చెప్పిన గమిని రాఘవ చైతన్య భార్య రాణి తోడ్పాటుతో ఐదేళ్ల క్రితం సుగంధ పంటల సాగు చేపట్టారు. లెమన్ గ్రాస్ (నిమ్మ గడ్డి), పామ రోజా (కాశాగడ్డి)ని సాగు చేస్తూ సుగంధ తైలాలతో పాటు మరో 4 ఉప ఉత్పత్తులను సైతం తయారు చేసి స్వయంగా విక్రయిస్తూ మంచి ఆదాయం గడిస్తున్నారు. 5 ఏళ్ల క్రితం సిద్దిపేట జిల్లా కొండపాక మండలం బందారం గ్రామ శివారులో 50 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. 30 ఎకరాల్లో లెమన్ గ్రాస్ (నిమ్మగడ్డి), మరో 20 ఎకరాల్లో పామారోజా పంటలను సాగు చేస్తున్నారు. అంతకుముందే బోడుప్పల్‌లోని కేంద్రీయ ఔషధ, సుగంధ పంటల పరిశోధనా స్థానం (సీమాప్)లో శిక్షణ పొందారు. 25 దేశీ ఆవులను పెంచుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. దేశీ ఆవుల నెయ్యిని విక్రయిస్తున్నారు. ఎండాకాలంలో వారానికి రెండు సార్లు రెయిన్ గన్స్ ద్వారా నీటితో కలిపిన జీవామృతాన్ని పంటలకు అందిస్తున్నారు.

లెమన్ గ్రాస్, పామ రోజా.. ఈ రెండు పంటలూ ఒకసారి నాటితే ఐదేళ్ల పాటు ప్రతి 65–70 రోజులకోసారి కోతకు వస్తాయి. ఏటా 5 సార్లు కత్తిరించి, డిస్టిల్లరీ ద్వారా సుగంధ తైలాలను తయారు చేసుకోవాలి. ఈ పంటలకు అడవి పందులు, కోతులు, పక్షులు, పశువుల బెడద లేదు. పామరోజా లేతగా ఉన్నప్పుడు పశువులు తింటాయన్నారు రాఘవ.

లెమన్‌గ్రాస్ ఆకులు, పామరోజా విత్తనాల సుగంధ తైలాన్ని వెలికి తీసేందుకు స్వయంగా ఆధునిక డిస్టిల్లరీని ఆయన ఏర్పాటు చేసుకున్నారు. పామరోజాను ట్రాక్టర్‌కు అమర్చిన రీపర్‌తో కోయవచ్చు. లెమన్ గ్రాస్‌ను కూలీలతో కోయించాల్సి ఉంటుందన్నారు. లెమన్‌గ్రాస్, పామరోజా పంటల ద్వారా ఎకరానికి ఏడాదిలో 50–60 కిలోల వరకు ఆయిల్ దిగుబడి వస్తున్నదన్నారు. జిరేనియల్, సిట్రల్ శాతాన్ని బట్టి ధర పలుకుతుంది. లెమన్ గ్రాస్ ఆయిల్ ధర కిలో ప్రస్తుతం రూ. వెయ్యి–1,100 వరకు ఉంది. పామరోజా కిలో ధర రూ. 2 వేలు–2,300 వరకు ఉంది. సేంద్రియ పద్ధతుల్లో పండిస్తే కిలోకు రూ. 500 వరకు అదనపు ఆదాయం వస్తుందని ఆయన అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌ను బట్టి ఏటా ఈ ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటాయన్నారు. డిస్టిల్లరీ ద్వారా ఆయిల్ తీసిన తర్వాత మిగిలే వ్యర్థాలతో మస్కిటో రెపల్లెంట్ లిక్విడ్, డిష్‌వాష్ లిక్విడ్, ఫ్లోర్ క్లీనర్, ఫినాయిల్, లెమన్‌గ్రాస్ పిడకలను తయారు చేస్తున్నారు. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో దుకాణాన్ని తెరిచి గోడైవిక్ బ్రాండ్ పేరుతో విక్రయిస్తుండటం విశేషం.

– గజవెల్లి షణ్ముఖరాజు, సాక్షి, సిద్దిపేట
ఫోటోలు: కె. సతీష్ కుమార్


లెమన్ గ్రాస్ పంట


పామరోజా పంట



5-10 ఎకరాల రైతులకు లాభదాయకం

లెమన్ గ్రాస్ ద్వారా ఏడాదిలో ఐదు పంటలు తీసి అన్ని ఖర్చులు పోను ఏడాదికి రూ. 40–45 వేల ఆదాయం వస్తుంది. 5–10 ఎకరాల సొంత భూమిలో సాగు చేసే రైతులకు లాభదాయకం. ఔత్సాహిక రైతులకు సూచనలు ఇవ్వటంతో పాటు తైలం వెలికితీయటం, మార్కెటింగ్‌లో తోడ్పాటు నందిస్తా.

– గమిని రాఘవ చైతన్య (97014 19007), సుగంధ పంటల రైతు


అధునాతన డిస్టిల్లరీ

మే 5-7 తేదీల్లో గ్రామభారతి కిసాన్ ఎక్స్‌పో


పాలేకర్

గ్రామభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మే 5,6,7 తేదీల్లో హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో కిసాన్ ఎక్స్‌పో–2023 జరగనుంది. ఇది రైతుల కోసం రైతులే నిర్వహిస్తున్న వ్యవసాయ ప్రదర్శన కావటం విశేషమని గ్రామభారతి కార్యదర్శి సామ ఎల్లారెడ్డి తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తదితర రాష్ట్రాల నుంచి రైతులు, వ్యవసాయ అధికారులు తరలివస్తారన్నారు. సేంద్రియ రైతుల ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెటింగ్ నదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. మే 5న ఉ. 10 గం.కు జరిగే ప్రారంభోత్సవంలో తెలంగాణ వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ పితామహులు పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. ఖాదర్ వలి, బయోచార్ నిపుణులు డా. నక్కా సాయిభాస్కర్ రెడ్డి, ప్రకృతివనం వ్యవస్థాపకులు ఎంసీవీ ప్రసాద్ తదితరులు ప్రసంగిస్తారని ఎల్లారెడ్డి తెలిపారు. సందర్శకులు (ఫోన్ ద్వారా/ వచ్చిన తర్వాతయినా) పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రవేశ పాసులను వెబ్‌సైట్ నుంచి కూడా పొందవచ్చు. వివరాలకు.. జ్యోత్స్న – 74161 60182.
www.gramabharathinaturalfpc.com

నిర్వహణ:
పంతంగి రాంబాబు,
సాగుబడి డెస్క్



మూడో సీడ్‌పై సాకేత్ జోడీ విజయం

బీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ సంచలన విజయంతో శుభారంభం చేసింది. జర్మనీలోని మ్యూనిక్‌లో సోమవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-యూకీ ద్వయం 6-3, 7-6 (7/4)తో మూడో సీడ్ నథానియల్ లామోన్స్-జాక్సన్ విత్రో (అమెరికా) జోడీని ఓడించి క్వార్టర్ ఫైనల్ చేరింది. 93 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్, యూకీ జోడీ ఆరు ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1 టోర్నీ బరిలో సురేఖ



కొన్నేళ్లుగా ఆర్చరీ ప్రపంచకప్ టోర్నీలలో నిలకడగా పతకాలు సాధిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ వెన్నం జ్యోతి సురేఖ మరో కొత్త సీజన్‌కు సిద్ధమైంది. అంటాల్యాలో నేటి నుంచి వరల్డ్‌కప్ స్టేజ్-1 టోర్నీ జరగనుంది. జ్యోతి సురేఖతోపాటు అవ్‌నీత్ కౌర్, అదితి స్వామి, సాక్షి చౌదరి మహిళల కాంపౌండ్ టీమ్, వ్యక్తిగత విభాగాల్లో బరిలోకి దిగుతారు. 52 దేశాల నుంచి 394 మంది ఆర్చర్లు రికర్వ్, కాంపౌండ్ ఈవెంట్స్‌లో ఈ టోర్నీలో ఆడనున్నారు.

చాంపియన్ గుకేశ్



చెన్నై: భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ మెనోర్కా ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో వరుసగా రెండో ఏడాది టైటిల్ సాధించాడు. స్పెయిన్‌లో జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత గుకేశ్‌తోపాటు మరో తొమ్మిదిమంది ఏడు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... గుకేశ్, ప్రణవ్‌లకు తొలి రెండు ర్యాంక్‌లు లభించాయి. విజేతను నిర్ణయించేందుకు గుకేశ్, ప్రణవ్ మధ్య రెండు బ్లిట్జ్ టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల గుకేశ్ 1.5-0.5తో ప్రణవ్‌ను ఓడించి చాంపియన్‌గా నిలిచాడు. గుకేశ్‌కు 3,000 యూరోలు (రూ. 2 లక్షల 69 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. తొమ్మిది రౌండ్లలో గుకేశ్ ఐదు గేముల్లో గెలిచి, నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచాడు. ఇదే టోర్నీలో పాల్గొన్న తెలంగాణ ప్లేయర్లు హర్ష భరతకోటి 6.5 పాయింట్లతో 11వ ర్యాంక్‌లో, వుప్పాల ప్రణీత్ 6 పాయింట్లతో 19వ ర్యాంక్‌లో, రాజా రిత్విక్ 5.5 పాయింట్లతో 37వ ర్యాంక్‌లో నిలిచారు.

రన్నరప్ అనిరుధ్ జోడీ



సాక్షి, హైదరాబాద్: స్ప్లిట్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-75 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. క్రొయేషియాలో జరిగిన ఈ టోర్నీలో అనిరుధ్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ ఫైనల్లో ఓడిపోయింది. 70 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో అనిరుధ్-విజయ్ సుందర్ ప్రశాంత్ 4-6, 4-6తో సాదియో డుంబియా-ఫాబ్రైస్ రెబూల్ (ఫ్రాన్స్) ద్వయం చేతిలో ఓటమి పాలైంది. తొలి రౌండ్‌లో భారత జోడీ 6-2, 6-1తో అర్తెమ్ సితాక్ (న్యూజిలాండ్)-కైచి ఉచిడా (జపాన్) జంటను ఓడించింది. క్వార్టర్ ఫైనల్లో, సెమీఫైనల్లో అనిరుధ్-విజయ్‌లకు తమ ప్రత్యర్థుల నుంచి వాకోవర్ లభించడంతో నేరుగా ఫైనల్ ఆడారు. అనిరుధ్-విజయ్‌లకు 2,450 యూరోల (రూ. 2 లక్షల 20 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 50 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

బెంగళూరు చిన్నబోయింది!

- ఉత్కంఠ పోరులో ఓడిన ఆర్‌సీబీ
- 8 పరుగులతో చెన్నై గెలుపు
- కాన్వే, దూబే మెరుపులు
- మ్యాక్స్‌వెల్, డుప్లెసిస్ శ్రమ వృథా

బెంగళూరు: పరుగుల వరద పారిన పోరు... ఏకంగా 33 సిక్సర్లు నమోదు... చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) భారీ స్కోరు సాధిస్తే మేమేం తక్కువ అన్నట్లుగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) కూడా విరుచుకుపడింది. అయితే తుది ఫలితంలో మాత్రం సూపర్ కింగ్స్‌దే పైచేయి అయింది. ఒకదశలో గెలుపు ఖాయమనిపించిన ఆర్‌సీబీ ఓటమి బాట పట్టడంతో చిన్నస్వామి మైదానంలో అభిమానులకు తీవ్ర నిరాశ ఎదురైంది. సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో చెన్నై 8 పరుగుల తేడాతో బెంగళూరును ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (45 బంతుల్లో 83; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), శివమ్ దూబే (27 బంతుల్లో 52; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీలు సాధించగా, అజింక్య రహానే (20 బంతుల్లో 37; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్లకు 218 పరుగులు చేసి ఓడిపోయింది. గ్లెన్ మ్యాక్స్‌వెల్ (36 బంతుల్లో 76; 3 ఫోర్లు, 8 సిక్స్‌లు), డుప్లెసిస్ (33 బంతుల్లో 62; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) మూడో వికెట్‌కు 61 బంతుల్లోనే 126 పరుగులు జోడించారు.

సమష్టి ప్రదర్శన...

సిరాజ్ తొలి ఓవర్లోనే రుతురాజ్ (3) అవుట్ కావడంతో చెన్నైకి సరైన ఆరంభం లభించలేదు. అయితే రహానే, కాన్వే భాగస్వామ్యంలో స్కోరు జోరందుకుంది. వీరిద్దరు పోటీ పడి పరుగులు సాధించడంతో పవర్‌ప్లేలో స్కోరు 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 53 పరుగులకు చేరింది. హసరంగ తన తొలి ఓవర్లో చక్కటి బంతితో రహానేను బౌల్డ్ చేయడంతో 74 పరుగుల (43 బంతుల్లో) భాగస్వామ్యం ముగిసింది. అయితే ఆ తర్వాత కాన్వే, దూబే మరింత ధాటిగా పరుగులు సాధించారు. వైశాక్ ఓవర్లో కాన్వే 2 ఫోర్లు, సిక్స్ కొట్టగా, సిరాజ్ ఓవర్లో దూబే ఫోర్, సిక్స్ బాదాడు. వైశాక్ తర్వాతి ఓవర్లో వీరిద్దరు 19 పరుగులు రాబట్టారు. కాన్వే 32 బంతుల్లో, దూబే 25 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. మూడో వికెట్‌కు 80 పరుగులు (37 బంతుల్లో) జోడించిన వీరిద్దరు ఎనిమిది బంతుల వ్యవధిలో వెనుదిరిగినా... చివర్లో అంబటి రాయుడు (6 బంతుల్లో 14; 1 ఫోర్, 1 సిక్స్), మొయిన్ అలీ (9 బంతుల్లో 19 నాటౌట్; 2 సిక్స్‌లు) వేగంగా ఆడి కీలక పరుగులు జోడించారు. దాంతో ఐపీఎల్ చరిత్రలో చెన్నై జట్టు 25వసారి 200 అంతకంటే ఎక్కువ స్కోరు చేసింది.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కాన్వే



మ్యాక్స్‌వెల్



డుప్లెసిస్



శివమ్ దూబే

శతక భాగస్వామ్యం...

భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆర్‌సీబీకి షాక్ తగిలింది. ఆకాశ్ సింగ్ తొలి ఓవర్లోనే కోహ్లి (6) షాట్‌ను వికెట్లపైకి ఆడుకోగా, ఆ వెంటనే లోమ్రోర్ (0) వెనుదిరిగాడు. అయితే డుప్లెసిస్, మ్యాక్స్‌వెల్ అద్భుత భాగస్వామ్యం జట్టును నడిపించింది. వీరిద్దరు చెన్నై బౌలర్లందరిపై విరుచుకుపడి పరుగుల వర్షం కురిపించారు. 'సున్నా' వద్ద డుప్లెసిస్ క్యాచ్‌ను ధోని వదిలేయడం కూడా కలిసొచ్చింది. ఆకాశ్ ఓవర్లో మ్యాక్స్‌వెల్ 2 సిక్స్‌లు బాదగా, అతని తర్వాతి ఓవర్లో డుప్లెసిస్ 2 ఫోర్లు, సిక్స్ కొట్టాడు. తుషార్ ఓవర్లో డుప్లెసిస్ వరుస బంతుల్లో 4, 4, 6... తీక్షణ ఓవర్లో మ్యాక్సీ 2 సిక్స్‌లు కొట్టడంతో ఆరు ఓవర్లలోనే స్కోరు 75 పరుగులకు చేరింది. ఈ క్రమంలో డుప్లెసిస్ 23 బంతుల్లో, మ్యాక్స్‌వెల్ 24 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నారు. 12వ ఓవర్ వరకు వీరి ధాటి కొనసాగింది. అయితే వరుస ఓవర్లలో వీరిద్దరిని అవుట్ చేయడంతో చెన్నైకి మళ్లీ పట్టు చిక్కింది. ఆఖర్లో దినేశ్ కార్తీక్ (14 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) గెలిపించేందుకు ప్రయత్నించినా చెన్నై కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఉత్కంఠ క్షణాలను దాటి మ్యాచ్‌ను కాపాడుకుంది.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) పార్నెల్ (బి) సిరాజ్ 3; కాన్వే (బి) హర్షల్ 83; రహానే (బి) హసరంగ 37; దూబే (సి) సిరాజ్ (బి) పార్నెల్ 52; రాయుడు (సి) కార్తీక్ (బి) వైశాక్ 14; అలీ (నాటౌట్) 19; జడేజా (సి) (సబ్) ప్రభుదేశాయ్ (బి) మ్యాక్స్‌వెల్ 10; ధోని (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 226.** **వికెట్ల పతనం:** 1-16, 2-90, 3-170, 4-178, 5-198, 6-224. **బౌలింగ్:** సిరాజ్ 4-0-30-1, పార్నెల్ 4-0-48-1, వైశాక్ 4-0-62-1, మ్యాక్స్‌వెల్ 2.4-0-28-1, హసరంగ 2-0-21-1, హర్షల్ పటేల్ 3.2-0-36-1.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (బి) ఆకాశ్ 6; డుప్లెసిస్ (సి) ధోని (బి) అలీ 62; లోమ్రోర్ (సి) రుతురాజ్ (బి) తుషార్ 0; మ్యాక్స్‌వెల్ (సి) ధోని (బి) తీక్షణ 76; షహబాజ్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 12; కార్తీక్ (సి) తీక్షణ (బి) తుషార్ 28; ప్రభుదేశాయ్ (సి) జడేజా (బి) పతిరణ 19; పార్నెల్ (సి) దూబే (బి) తుషార్ 2; హసరంగ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 218.** **వికెట్ల పతనం:** 1-6, 2-15, 3-141, 4-159, 5-191, 6-192, 7-197, 8-218. **బౌలింగ్:** ఆకాశ్ సింగ్ 3-0-35-1, తుషార్ దేశ్‌పాండే 4-0-45-3, తీక్షణ 4-0-41-1, జడేజా 4-0-37-0, పతిరణ 4-0-42-2, మొయిన్ అలీ 1-0-13-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	5	4	1	8	1.354
లక్నో	5	3	2	6	0.761
చెన్నై	5	3	2	6	0.265
గుజరాత్	5	3	2	6	0.192
పంజాబ్	5	3	2	6	-0.109
కోల్‌కతా	5	2	3	4	0.320
బెంగళూరు	5	2	3	4	-0.318
ముంబై	4	2	2	4	-0.389
హైదరాబాద్	4	2	2	4	-0.822
ఢిల్లీ	5	0	5	0	-1.488

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ × ముంబై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

శ్రీలంక 591/6 డిక్లేర్డ్

చండీమల్, సమరవిక్రమ సెంచరీలు



చండీమల్ సమరవిక్రమ

గాలె: ఐర్లాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టుపై శ్రీలంక రెండో రోజే పట్టు బిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 386/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 6 వికెట్లకు 591 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. దినేశ్ చండీమల్ (102 నాటౌట్; 12 ఫోర్లు), సమరవిక్రమ (104 నాటౌట్; 11 ఫోర్లు) అజేయ సెంచరీలు సాధించారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 183 పరుగుల భాగస్వామ్యం జోడించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఐర్లాండ్ ఆట ముగిసే సమయానికి 7 వికెట్లు కోల్పోయి 117 పరుగులు చేసి కష్టాల్లో పడింది. జేమ్స్ మెకొల్లమ్ (35; 5 ఫోర్లు), హ్యారీ టెక్టర్ (34; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. టకెర్ (21 బ్యాటింగ్), మెక్‌బ్రైన్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. లంక బౌలర్లలో ప్రభాత జయసూర్య 5 వికెట్లు, ఫెర్నాండో 2 వికెట్లు పడగొట్టారు. లంక స్కోరుకు ఐర్లాండ్ మరో 474 పరుగులు వెనుకబడి ఉంది.

సినిమా




సెంథిల్ దంపతులతో రామ్‌చరణ్



పార్టీలో ఓ సెల్ఫీ

'ఆర్ఆర్ఆర్' ఆస్కార్ సాధించిన నేపథ్యంలో వరుస పార్టీలు జరుగుతున్నాయి. ఆదివారం చిత్ర ఛాయాగ్రాహకుడు సెంథిల్ కుమార్ ఓ గ్రాండ్ పార్టీ ఏర్పాటు చేసి, 'ఆర్ఆర్ఆర్' టీమ్‌తో పాటు పలువురు చిత్రరంగ ప్రముఖులను ఆహ్వానించారు. రాజమౌళి, కీరవాణి సతీ సమేతంగా పార్టీకి హాజరయ్యారు. రామ్‌చరణ్ స్టయిలిష్ ఎంట్రీ ఇచ్చారు. కాలభైరవ, ప్రేమ్ రక్షిత్.. ఇలా 'ఆర్ఆర్ఆర్' టీమ్‌లో కొందరు పాల్గొనగా.. లక్ష్మీప్రసన్న, నూతన దంపతులు మంచు మనోజ్, మౌనిక, అడివి శేష్ తదితరులు ఈ పార్టీలో సందడి చేశారు.

కేజీఎఫ్ నేపథ్యంలో...



విక్రమ్

పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేస్తారు విక్రమ్. ఇప్పటికే పలు వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించిన ఆయన తాజాగా 'తంగలాన్' చిత్రం కోసం ఊర మాస్ లుక్‌లోకి మారిపోయారు. పా. రంజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పార్వతి, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సోమవారం విక్రమ్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఓ మేకింగ్ గ్లింప్స్‌తో పాటు వీడియోను విడుదల చేసింది యూనిట్. ఇందులో ఊర మాస్ లుక్‌లో కనిపిస్తున్నారు విక్రమ్. ''కోలార్ గోల్డ్ ఫీల్డ్ (కేజీఎఫ్) నేపథ్యంలో కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా కంప్లీట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు రంజిత్. పాన్ ఇండియన్ సినిమాగా బహు భాషల్లో ఈ చిత్రం విడుదలవుతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. హాలీవుడ్ నటుడు డేనియల్ కాల్టాగిరోన్ కీలక పాత్ర చేస్తున్న ఈ చిత్రానికి నిర్మాణ సంస్థలు: స్టూడియో గ్రీన్ (కేఈ జ్ఞానవేల్ రాజా), పా. రంజిత్ (నీలం ప్రొడక్షన్స్), యూవీ క్రియేషన్స్.

లవ్ అంటేనే ఇష్టం లేదు



సిద్ధార్థ్, దివ్యాంశా కౌశిక్

'నేనంటే ఇష్టం లేదా' అని అబ్బాయి అంటే... 'లవ్ అంటేనే ఇష్టంలేదు' అని అంటుంది అమ్మాయి. ఈ ఇద్దరి కథ ఏంటనేది 'టక్కర్'లో తెలుస్తుంది. సిద్ధార్థ్, దివ్యాంశా కౌశిక్ జంటగా రూపొందుతున్న చిత్రం 'టక్కర్'. సోమవారం సిద్ధార్థ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన టీజర్ పైన పేర్కొన్న సంభాషణలతో సాగుతుంది. కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ తెలుగులో విడుదల చేస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం మే 26న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: నివాస్ కె. ప్రసన్న, కెమెరా: వాంచినాథన్ మురుగేశన్.

ముచ్చటగా మూడు



విజయ్ రెడ్డి, మిత్ర, బాబూమోహన్

తెలుగు పరిశ్రమలోకి 'రెడ్డీస్ మల్టీ ఫ్లెక్స్ మూవీస్' అనే నిర్మాణ సంస్థ ఎంట్రీ ఇచ్చింది. సోమవారం హైదరాబాద్‌లో మూడు సినిమాల్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు సంస్థ అధినేత విజయ్ రెడ్డి. తొలి ప్రయత్నంగా ప్రసాద్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ 'సోషల్ వర్కర్స్' సినిమా నిర్మిస్తున్నారు. ఇందులో ఎనిమిది మంది హీరోయిన్లు ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. అలాగే మహేందర్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ మిత్ర ప్రధాన పాత్రలో మిత్ర మూవీస్ భాగస్వామ్యంతో 'కోబలి'ని రెండో చిత్రంగా నిర్మిస్తున్నారు. మూడో మూవీగా 'హ్యాపీ విమెన్స్ డే' రూపొందనుంది. తొలి సీన్‌కి నటుడు బాబూ మోహన్ క్లాప్ కొట్టారు. విజయ్ రెడ్డి మాట్లాడుతూ- ''రెడ్డీస్ మల్టీప్లెక్స్ మూవీస్ ఆఫీసులను ముంబై, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నంలో ప్రారంభించాం. ఔత్సాహిక దర్శకులు, నూతన నటీనటులు మమ్మల్ని సంప్రదించవచ్చు'' అన్నారు.

అందుకే మాకు హిట్లు ఎక్కువ!

- నిర్మాత టీజీ విశ్వప్రసాద్

"గోపీచంద్, శ్రీవాస్‌గార్ల కాంబినేషన్‌లో వచ్చిన 'లక్ష్యం, లౌక్యం' సూపర్ హిట్ అయ్యాయి. ఆ చిత్రాల తరహాలోనే ఫ్యామిలీ, యాక్షన్, బ్రదర్ సెంటిమెంట్ నేపథ్యంలో 'రామబాణం' ఉంటుంది. ఈ చిత్రంతో గోపీచంద్-శ్రీవాస్‌గార్లు హ్యాట్రిక్ హిట్ కొడతారు" అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. గోపీచంద్, డింపుల్ హయతి జంటగా జగపతిబాబు, ఖుష్బూ ప్రధాన పాత్రల్లో శ్రీవాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మించిన ఈ సినిమా మే 5న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా టీజీ విశ్వప్రసాద్ చెప్పిన విశేషాలు.



- సినిమాలపై ఉన్న ప్యాషన్‌తో సాఫ్ట్‌వేర్ రంగం నుంచి ఇండస్ట్రీకి వచ్చాను. నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టడానికి ముందే ఫిల్మ్ ఇండస్ట్రీ గురించి పరిశోధన చేసి, ఫ్యాక్టరీ మోడల్‌లో ప్రొడక్షన్ స్టార్ట్ చేశాం. మిగతా కొత్త నిర్మాతల్లాగా ఒకట్రెండు సినిమాలు కాకుండా ఎక్కువ తీస్తున్నాం. మంచి విజయాలతో విజయవంతమైన సంస్థగా ఎదగడం హ్యాపీ.
- శ్రీవాస్‌గారు 'రామబాణం' కథ చెప్పినప్పుడు ఇదొక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అవుతుందనిపించింది. క్రియేటివ్ సైడ్ ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం.. మంచి ఔట్‌పుట్ తీసుకొచ్చారు.
- కాన్సెప్ట్ నచ్చితే చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అన్ని రకాల సినిమాలు నిర్మిస్తున్నాం. అయితే సినిమా విజయం అనేది మన చేతుల్లో ఉండదు.. కానీ వంద శాతం మన ప్రయత్నం చేయాలి. మేం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుండటంతో విజయాల శాతం ఎక్కువగానే ఉంది. మా అబ్బాయి వ్యాపారం చూసుకుంటున్నాడు. మా అమ్మాయికి సినిమాపై ఆసక్తి ఉంది. శర్వానంద్‌తో చేస్తున్న సినిమా విషయంలో తన ప్రమేయం ఉంది. ప్రస్తుతం ప్రభాస్‌గారు హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా షూటింగ్ జరుగుతోంది. చిరంజీవిగారు, అల్లు అర్జున్.. ఇలా అందరి హీరోలతో సినిమాలు నిర్మించాలనుంది.. ఆ ప్రయత్నాలు చేస్తున్నాం.


ముత్తయ్యగా మధుర్



మధుర్ మిట్టల్

క్రికెట్ ప్రపంచంలో ఎన్నో రికార్డులు సాధించిన ప్రముఖ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం '800'. సోమవారం (ఏప్రిల్ 17) ముత్తయ్య పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ఎంఎస్ శ్రీపతి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. 'స్లమ్‌డాగ్ మిలియనీర్'లో చేసిన సలీమ్ మాలిక్ పాత్ర ద్వారా గుర్తింపు తెచ్చుకున్న మధుర్ మిట్టల్ ఈ బయోపిక్‌లో ముత్తయ్య పాత్రను పోషిస్తున్నారు. ముత్తయ్య భార్య మదిమలర్ పాత్రను మహిమా నంబియార్ చేస్తున్నారు. శ్రీపతి మాట్లాడుతూ – ''కెరీర్‌లో 800 టెస్ట్ వికెట్స్ తీసిన ఏకైక ఆఫ్ స్పిన్నర్ బౌలర్‌గా మురళీధరన్ అరుదైన రికార్డు సాధించారు. అందుకే ఈ చిత్రానికి '800'నే టైటిల్‌గా పెట్టాం. మురళికి తమిళనాడులో మూలాలు ఉన్నాయి. అతని తాతలు భారతీయులు. బ్రిటిష్ వారు అక్కడి టీ తోటలలో పని చేయడానికి వారిని శ్రీలంకకు తీసుకెళ్లారు. ఇలా ముత్తయ్య మురళీధరన్‌లోని పలు కోణాలను చూపించే చిత్రం ఇది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అన్నారు. వివేక్ రంగాచారి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.

అంజనాద్రి కోసం పోరాటం



తేజ సజ్జ

తేజ సజ్జ హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'హను-మాన్'. అమృతా అయ్యర్ కథానాయిక. శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ సోమవారంతో పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''హనుమంతుని శక్తులను పొందిన హీరో అంజనాద్రి కోసం ఎలా పోరాటం చేశాడు? అనేది చిత్ర కథాంశం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ, కన్నడ, మలయాళ, ఇంగ్లిష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్‌తో సహా పలు భారతీయ భాషల్లో పాన్ వరల్డ్‌గా ఈ చిత్రం విడుదల కానుంది. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తాం'' అన్నారు.

తొలి అడుగు!



జాన్వీ కపూర్

తెలుగు సెట్స్‌లోకి జాన్వీ కపూర్ తొలి అడుగు సోమవారం ఆరంభమైంది. శ్రీదేవి ఫ్యాన్స్ అందరూ ఆమె కుమార్తె జాన్వీ దక్షిణాదికి ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ సరసన జాన్వీ సినిమా కమిట్ కావడం ఫ్యాన్స్‌ని ఆనందపరిచింది.

కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం సెకండ్ షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ షూటింగ్‌లోకి జాన్వీ తొలి అడుగు వేశారు. ఎన్టీఆర్, జాన్వీపై కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారు కొరటాల శివ.

మంచి శకునములే...



సంతోష్ శోభన్, మాళవిక

సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నందినీ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'అన్నీ మంచి శకునములే...'. ప్రియాంక దత్ నిర్మించిన ఈ సినిమా మే 18న రిలీజ్ కానుంది. కాగా 'ఏప్రిల్ 20న మీట్ రిషి- ఆర్య ఇన్ ఇటలీ' అంటూ ఓ వీడియో ద్వారా అనౌన్స్ చేసింది యూనిట్. ''ఫీల్ గుడ్ ఎమోషన్స్‌తో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే...'. విభిన్న మనస్తత్వాలు కలిగిన రిషి, ఆర్యల మధ్య అందమైన బంధం ఎలా ఏర్పడింది? వారి జర్నీ ఎలా సాగింది? అన్నది ఆసక్తిగా ఉంటుంది. మిక్కీ జె. మేయర్ సంగీతం అందించారు. రిలీజ్ చేసిన రెండు పాటలు బ్లాక్ బస్టర్ అయ్యాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సన్నీ కూరపాటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దివ్య విజయ్.

సాక్షి **బిజినెస్**
మంగళవారం
18-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	520	59,911
నిఫ్టీ ▼	121	17,707

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,094	▼	30
డోజోన్స్	33,864	▼	23
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,880	▲	8
డాక్స్	15,790	▲	18
షాంఘై	3,386	▲	46
నికాయ్	28,515	▲	21

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో – ముంబై	
బంగారం (24 క్యారెట్)	60,629
బంగారం (22 క్యారెట్)	60,386
వెండి (కిలో)	75,530

విశాఖ ఉక్కు ఈవోఐలకు గడువు పెంపు



న్యూఢిల్లీ: కొత్త వ్యాపార విధానానికి సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణ పత్రాల (ఈవోఐ) దాఖలుకు గడువును ఏప్రిల్ 20 వరకు పొడిగించినట్లు విశాఖ ఉక్కు (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్–ఆర్ఐఎన్ఎల్) వెల్లడించింది. వాస్తవానికి ఇది ఏప్రిల్ 15తో ముగిసింది. తమకు వర్కింగ్ క్యాపిటల్ లేదా ఒకటికి మించి ముడి వస్తువులను సమకూర్చే సంస్థలకు ఫినిష్డ్ స్టీల్ ఉత్పత్తులను సరఫరా చేసేలా విశాఖ ఉక్కు వినూత్న ప్రతిపాదనతో ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. నిబంధనల ప్రకారం ఈవోఐ సమర్పించే సంస్థకు ఉక్కు వ్యాపారంలో లేదా ఉక్కు తయారీలో ఉపయోగించే ముడి వస్తువుల వ్యాపారంలో కార్యకలాపాలు ఉండాలి. వైజాగ్ స్టీల్ వార్షిక సామర్థ్యం 7 మిలియన్ టన్నులుగా ఉంది.

భారత్‌లో మిత్సుబిషి ప్లాంటు



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్ తయారీలో ఉన్న జపాన్ కంపెనీ మిత్సుబిషి భారత్‌లో ప్లాంటు నెలకొల్పుతోంది. చెన్నై సమీపంలో ఉన్న మహీంద్రా వరల్డ్ సిటీ డెవలపర్స్ ఇండస్ట్రియల్ పార్కులో 52 ఎకరాల్లో ఇది ఏర్పాటవుతోంది. ఏసీలతోపాటు కంప్రెసర్లను ఇక్కడ తయారు చేస్తారు. భారత్‌లో సంస్థకు ఏసీల తయారీలో తొలి ప్లాంటు కానుంది. 2025 అక్టోబర్‌లో ఈ కేంద్రంలో ఉత్పత్తి కార్యకలాపాలు మొదలు కానున్నాయి. ప్లాంటు కోసం కంపెనీ రూ.1,820 కోట్లు ఖర్చు చేస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-4-2023	
విశాఖ	390–00
చిత్తూరు	408–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	355–00
విజయవాడ	355–00
రిటైల్ ధర (డజను)	60.00
17-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	350–00
వరంగల్	352–00
రిటైల్ ధర	4.10

2025 నాటికే 20 శాతం ఇథనాల్

- పెట్రోల్‌లో కలిపే లక్ష్యాన్ని చేరుకుంటాం
- కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్‌పురి



న్యూఢిల్లీ: పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపే లక్ష్యాన్ని 2025 నాటికే సాధిస్తామని పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్‌పురి తెలిపారు. ముందుగా నిర్దేశించుకున్న 2030తో పోలిస్తే ఐదేళ్ల ముందుగానే చేరుకుంటామని ప్రకటించారు. దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ విక్రయాలను ఈ ఫిబ్రవరిలో ప్రయోగాత్మకంగా ఆరంభించడం గమనార్హం. కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు, పెట్రోల్ దిగుమతుల భారాన్ని తగ్గించుకోవాలన్న రెండు లక్ష్యాలు ఇందులో ఉన్నాయి. ప్రస్తుతం 10 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను దేశవ్యాప్తంగా విక్రయిస్తున్నారు. వచ్చే ఏడాదికే 20 శాతం పెట్రోల్‌ను సరఫరా చేయగలమన్న నమ్మకంతో ఉన్నట్టు పురి చెప్పారు. పెట్రోల్‌లో 10 శాతం ఇథనాల్ మిశ్రమంతో రూ.41,500 కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఒక ఏడాదిలో ఆదా అవుతుండగా, దేశీయ రైతులకు, పరిశ్రమలకు ఈ మేరకు ప్రయోజనం లభించనుంది. చెరకు, విరిగిన, తినడానికి అనుకూలం కాని బియ్యంతో ఇథనాల్‌ను ప్రస్తుతం మన దేశంలో తయారు చేస్తున్నారు. 20 శాతం ఇథనాల్ కలపడం వల్ల ద్విచక్ర వాహనాల నుంచి కార్బన్ మోనాక్సైడ్ విడుదలను 50 శాతం, నాలుగు చక్రాల వాహనాల నుంచి 30 శాతం మేర తగ్గించొచ్చని అంచనా. మన దేశ ముడి చమురు అవసరాల్లో 85 శాతాన్ని దిగుమతి చేసుకుంటున్న విషయం తెలిసిందే. 2021–22లో ముడి చమురు దిగుమతుల కోసం మన దేశం 120.7 బిలియన్ డాలర్లు వెచ్చించింది.

టోకు ద్రవ్యోల్బణం @ 29 నెలల కనిష్టం

- మార్చిలో 1.34 శాతం
- తగ్గిన ఇంధనం, తయారీ ఉత్పత్తుల భారం
- ఆహార ఉత్పత్తులు ప్రియం



న్యూఢిల్లీ: టోకు ధరల ఆధారిత (డబ్ల్యూపీఐ) ద్రవ్యోల్బణం మార్చిలో 29 నెలల కనిష్టానికి దిగి వచ్చింది. 1.34 శాతానికి పరిమితమైంది. ఇంధనాలు, తయారీ ఉత్పత్తుల ధరలు తగ్గగా, ఆహార ఉత్పత్తుల భారం మాత్రం పెరిగింది. డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 3.85 శాతంగాను, గతేడాది మార్చిలో 14.63 శాతంగాను నమోదైంది. ఇది తగ్గడం వరుసగా పదో నెల. చివరిసారిగా 2020 అక్టోబర్‌లో డబ్ల్యూపీఐ ఆధారిత ధరల పెరుగుదల 1.31 శాతంగా నమోదైంది. '2023 మార్చిలో ద్రవ్యోల్బణం రేటు తగ్గడానికి ప్రధానంగా ప్రాథమిక లోహాలు, టెక్స్‌టైల్స్, ఆహారయేతర ఆర్టికల్స్, ఖనిజాలు, రబ్బర్.. ప్లాస్టిక్ ఉత్పత్తులు, క్రూడ్ పెట్రోలియం .. సహజ వాయువు, పేపర్ .. పేపర్ ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టడమే కారణం' అని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సోమవారం తెలిపింది. తాజాగా ఫుడ్ బాస్కెట్‌లో గోధుమలు వంటి ధాన్యాల ధరలు నెమ్మదించగా.. కూరగాయలు, పండ్లు, పాలు, పప్పులు మొదలైన వాటి రేట్లు పెరిగాయని ఈక్విరస్ సెక్యూరిటీస్ ఒక నోట్‌లో పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ ఇప్పుడు కూడా వడ్డీ రేట్ల పెంపు విషయంలో నిర్ణయం తీసుకునే ముందు డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం స్థిరపడేలా చూడటంపైనా, వినియోగ ధరల ఆధారిత (సీపీఐ) ద్రవ్యోల్బణం మరింత తగ్గేలా చూడటంపైనా దృష్టి పెట్టాల్సి ఉంటుందని టీఐడబ్ల్యూ క్యాపిటల్ సీఈవో మోహిత్ రాల్హన్ అభిప్రాయపడ్డారు.

– ఆహార ఉత్పత్తుల రేట్ల పెరుగుదల ఫిబ్రవరిలో 3.81 శాతంగా ఉండగా, మార్చిలో 5.48 శాతంగా నమోదైంది. కూరగాయల ధరలు ఫిబ్రవరిలో 21.53 శాతం తగ్గగా (2022 ఫిబ్రవరి ధరతో పోలి్చ), మార్చిలో ఈ తగ్గుదల రేటు 2.22 శాతంగానే ఉంది. ఉల్లి విషయంలో ఫిబ్రవరిలో 40.14 శాతం ధరలు తగ్గగా, మార్చిలో తగ్గుదల రేటు 36.83 శాతంగానే నమోదైంది.

– గోధుమల ధరలు 9.16 శాతం, పప్పుల రేట్లు 3.03 శాతం పెరిగాయి.

మార్కెట్ ర్యాలీకి ఐటీ షేర్ల బ్రేక్..!

- 9 రోజుల వరుస లాభాలకు విరామం
- సెన్సెక్స్ నష్టం 530 పాయింట్లు
- మళ్లీ 60 వేల దిగువకు
- 121 పాయింట్లు పతనమైన నిఫ్టీ
- ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్లకు డిమాండ్

ముంబై: స్టాక్ మార్కెట్లో గడచిన రెండేళ్లలో మునుపెన్నడూ సాగని తొమ్మిది రోజుల సుదీర్ఘ ర్యాలీకి సోమవారం బ్రేక్ పడింది. ఐటీ, టెక్నాలజీ, టెలికం షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సూచీలు దాదాపు ఒకశాతం నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ఇన్ఫోసిస్ క్యూ4 క్వార్టర్ ఆర్థిక ఫలితాలు అంచనాల కంటే తక్కువగా నమోదవడంతో సెంటిమెంట్ బలహీనపడినట్లు నిపుణులు తెలిపారు. ఉదయం సెన్సెక్స్ 45 పాయింట్ల నష్టంతో 60,385 వద్ద, నిఫ్టీ 35 పాయింట్లు లాభంతో 17,863 వద్ద మిశ్రమంగా మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే బలహీనంగా కదలాడిన సూచీలు చివరి దాకా అదే వైఖరిని ప్రదర్శించాయి. ఒక దశలో సెన్సెక్స్ 989 పాయింట్లు క్షీణించి 59,442 వద్ద, నిఫ్టీ 254 పాయింట్లు పతనమై 17,574 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. చివరి గంటలో కనిష్ట స్థాయి వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాలు కొంతమేర తగ్గాయి. ఆఖరికి సెన్సెక్స్ 520 పాయింట్లు నష్టపోయి 59,911 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121 పాయింట్లు పతనమై 17,707 వద్ద నిలిచింది. ప్రభుత్వరంగ బ్యాంక్స్, ఇంధన, మెటల్, ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్ సూచీలు అరశాతం చొప్పున లాభపడ్డాయి. పదిరోజుల వరుస కొనుగోళ్ల తర్వాత విదేశీ ఇన్వెస్టర్లు తొలిసారి రూ.533 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.269 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 16 పైసలు క్షీణించి 82.01 వద్ద నిలిచింది.

సూచీలకు నష్టాలు ఎందుకంటే

మొత్తం 9 ట్రేడింగ్ సెషన్లలో సూచీలు ఐదుశాతం ర్యాలీ చేసిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. సూచీల్లో అధిక వెయిటేజీ ఇన్ఫోసిస్(9%), హెచ్‌డీఎఫ్‌సీ(2%) షేర్లు పతనమవడంతో సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. ఐటీ, ప్రైవేట్ రంగ బ్యాంక్ దిగ్గజ కంపెనీలు అంచనాల కంటే తక్కువగా త్రైమాసిక ఫలితాలను వెల్లడించడంతో ఈ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. రానున్న రోజుల్లో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపునకు అనువుగా అమెరికాలో మెరుగైన ఉద్యోగాల గణాంకాలు నమోదయ్యాయి. రేట్ల పెంపు అంచనాలతో ఇన్వెస్టర్లు ఈక్విటీలను విక్రయించి సురక్షితమైన బాండ్లలో పెట్టుబడులకు మొగ్గుచూపారు. ఆర్థిక మాంద్య భయాలు, వడ్డీరేట్ల పెంపు ఆందోళనలతో ఆసియా మార్కెట్లు 1.50–1% పతనమయ్యాయి. యూరప్ సూచీలు పావు శాతం క్షీణించాయి.



ఇన్ఫోసిస్‌కి క్వార్టర్ ఫలితాల షాక్

దేశీయ రెండో అతిపెద్ద ఐటీ దిగ్గజం నాలుగో క్వార్టర్ ఫలితాలు అంచనాల కంటే తక్కువగానే నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి అంచనాలు మార్కెట్ అంచనాల కంటే తక్కువగా 4–7% ఉంటుందని పేర్కొంది. దీంతో పలు బ్రోకరేజ్ సంస్థలు ఈ షేరుకు డౌన్‌గ్రేడ్ రేటింగ్‌ను కేటాయించడంతో పాటు టార్గెట్ ధరను తగ్గించాయి. ఫలితంగా బీఎస్‌ఈలో ఈ షేరు 12% క్షీణించి రూ.1,219 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది. చివర్లో తేరుకొని 9.5% నష్టపోయి రూ.1,258 వద్ద నిలిచింది. షేరు భారీ పతనంతో ఒక్కరోజులోనే కంపెనీ రూ.59,350 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయింది. ఈ ప్రభావం ఇదే రంగానికి చెందిన ఇతర ఐటీ కంపెనీల షేర్లపై పడింది. ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, టెక్ మహీంద్రా, పర్సిస్టెంట్, హెచ్‌సీఎల్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, ఎంఫసిస్ షేర్లు 7–2% చొప్పున నష్టపోయాయి. ఫలితంగా నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా ఐదుశాతం నష్టపోయింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నష్టాల మార్కెట్లోనూ ఐటీసీ షేరు జీవితకాల గరిష్టాన్ని తాకింది. 0.5% లాభంతో రూ.393 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 2% బలపడి రూ.402 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. చివరికి 1% లాభపడి తొలిసారి రూ.400 స్థాయి వద్ద ముగిసింది.
- చివరి క్వార్టర్ ఆర్థిక ఫలితాలపై సానుకూల అంచనాలతో ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్లు భారీగా లాభపడ్డాయి. అత్యధికంగా పంజాబ్ సింధ్ బ్యాంక్ షేరు 18 శాతం ర్యాలీ చేసింది. ఇండియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, ఐఓబీ, మహారాష్ట్ర బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఇండియా, షేర్లు 8–4% చొప్పున పెరిగాయి.

యాపిల్ స్టోర్ ప్రారంభం నేడే



ముంబై: టెక్నాలజీ దిగ్గజం యాపిల్ తొలి స్టోర్ నేడు (మంగళవారం) ముంబైలో ప్రారంభం కానుంది. సంస్థ సీఈవో టిమ్ కుక్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. దేశంలో కంపెనీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ స్టోర్‌ను ప్రారంభిస్తోంది. ఈ కేంద్రంలో 18 భాషలకు చెందిన 100 మంది సిబ్బంది ఉన్నారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఔట్‌లెట్‌ను ఏప్రిల్ 20న ప్రారంభించనున్నారు. 'భారతదేశం చాలా అందమైన సంస్కృతి, అద్భుత శక్తిని కలిగి ఉంది. సుదీర్ఘ చరిత్రను నిర్మించడానికి సంతోషిస్తున్నాం. మా వినియోగదారులకు మద్దతు ఇవ్వడం, స్థానిక కమ్యూనిటీలలో పెట్టుబడి పెట్టడం, మానవాళికి సేవ చేసేందుకు ఆవిష్కరణలతో మెరుగైన భవిష్యత్తును నిర్మించడానికి కలిసి పని చేస్తాం' అని ఈ సందర్భంగా టిమ్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత్‌లో యాపిల్‌కు 2,500 మంది ఉద్యోగులు ఉన్నారు. యాప్ వ్యవస్థ ద్వారా పరోక్షంగా 10 లక్షల ఉద్యోగాలను సృష్టించామని సంస్థ రిటైల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డియోడ్రా ఓబ్రాయెన్ వెల్లడించారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

సిల్వర్ సెట్-2023

కర్నూలులోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల (కోఎడ్యుకేషన్, అటానమస్) 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి సిల్వర్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2023 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా వివిధ డిగ్రీ కోర్సు(ఇంగ్లిష్ మీడియం)ల్లో ప్రవేశాలు పొందవచ్చు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత బోధన, భోజన, వసతి, శిక్షణ అందుతుంది.

» **అర్హత:** మార్చి–2023లో 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అర్హులు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్, ప్రత్యేక కేటగిరీ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.05.2023.
» **హాల్ టికెట్/అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేది:** 18.05.2023.
» **కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష తేది:** 25.05.2023.
» **వెబ్‌సైట్:** www.sjgckurnool.edu.in

ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఐఏటీ-2023)

కేంద్ర విద్యాశాఖ పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) 2023 విద్యాసంవత్సరంలో బీఎస్, బీఎస్–ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకోసం ఐసర్ అప్టిట్యూడ్ టెస్ట్–2023ని నిర్వహిస్తుంది. కేవైపీవై, జేఈఈ అడ్వాన్స్‌డ్, ఐసర్ అప్టిట్యూడ్ టెస్టు విధానాల్లో అడ్మిషన్ కల్పిస్తారు.

» **అర్హత:** ఏదైనా బోర్డు నుంచి అభ్యర్థులు సైన్స్ గ్రూప్‌లో10+2/ ఇంటర్మీడియెట్ 2022 లేదా 2023లో ఉత్తీర్ణులై ఉండాలి. 12వ తరగతి/ఇంటర్‌లో బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్‌లలో ఏవైనా మూడు సబ్జెక్టులు చదివి ఉండాలి.
» **పరీక్ష విధానం:** పరీక్షలో 60 ప్రశ్నలు ఉంటాయి. బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులలో ప్రతీ సబ్జెక్టు నుంచి 15 ప్రశ్నలు ఉంటాయి.
» **దరఖాస్తు ప్రారంభతేది:** 15.04.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 25.05.2023
» **పరీక్ష తేది:** 17.06.2023.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.iiseradmission.in

కేంద్ర కొలువుల్లో.. వేస్తారా పాగా!

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కొలువుల నగారా మోగించింది! కేంద్ర ప్రభుత్వ శాఖల్లో.. మొత్తం 7,500 గ్రూప్-బి, గ్రూప్-సి పోస్టుల భర్తీకి కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ (సీజీఎల్ఈ) నోటిఫికేషన్ విడుదల చేసింది! వీటికి బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో పోటీ పడొచ్చు! ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ -సీజీఎల్ఈ- 2023 నోటిఫికేషన్ సమాచారం, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 7,500 పోస్టుల భర్తీకి ఎస్ఎస్‌సీ సీజీఎల్ఈ నోటిఫికేషన్
» కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్-బి, గ్రూప్-సి ఉద్యోగాలు
» డిగ్రీ అర్హతతో దరఖాస్తుకు అవకాశం
» రెండు దశల రాత పరీక్షతో ఎంపిక ప్రక్రియ

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ప్రతి ఏటా క్రమం తప్పకుండా సీజీఎల్ఈ నోటిఫికేషన్ విడుదల చేస్తోంది. తాజాగా 2023 సంవత్సరానికి సంబంధించి 7,500 పోస్టుల భర్తీకి ప్రకటన ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల్లో వివిధ రకాల ఉద్యోగాలకు నియామక ప్రక్రియ నిర్వహిస్తుంది. వీటిల్లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్,అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సీబీడీటీలో ఇన్‌కంట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ (గ్రూప్–సి), అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్(గ్రూప్–బి),సీబీఐలో సబ్ ఇన్‌స్పెక్టర్(గ్రూప్–బి) తదితర పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఆగస్ట్ 1, 2023 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యుఏ, ఎంకాం, బిజినెస్ స్టడీస్‌లో పీజీ లేదా ఎంబీఏ(ఫైనాన్స్) లేదా బిజినెస్ ఎకనామిక్స్‌లో పీజీ చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.
- జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్మీడియెట్ స్థాయిలో మ్యాథమెటిక్స్‌లో 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసుకోవాలి.
- స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్–2 పోస్టులకు స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి
- జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులకు బ్యాచిలర్ డిగ్రీతోపాటు గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా ఇన్‌స్టిట్యూట్‌లో కనీసం ఏడాది రీసెర్చ్ అనుభవం, ఎల్ఎల్‌బీ లేదా హ్యూమన్ రైట్స్‌లో డిగ్రీ అభిలషణీయం అని పేర్కొన్నారు.
- అన్ని పోస్టులకు డిగ్రీ చివరి సంవత్సరం అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

- గ్రూప్–సి కేడర్ పోస్టులకు ఆగస్ట్ 1, 2023 నాటికి 18–27 ఏళ్లు ఉండాలి.
- మిగతా పోస్టులకు ఆయా పోస్టులను అనుసరించి 18–20ఏళ్లు, 20–30ఏళ్లు, 18–32ఏళ్ల మధ్యలో ఉండాలి.
- అన్ని పోస్టులకు గరిష్ట వయో పరిమితిలో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ(జనరల్) అభ్యర్థులకు పదేళ్లు, పీడబ్ల్యూడీ(ఓబీసీ) అభ్యర్థులకు 13 ఏళ్లు, పీడబ్ల్యూడీ (ఎస్సీ/ఎస్టీ) అభ్యర్థులకు 15 ఏళ్ల సడలింపు లభిస్తుంది.

వేతనం

- కనిష్ట ప్రారంభ వేతన శ్రేణి రూ.25,500 –రూ.81,100, గరిష్ట ప్రారంభ వేతన శ్రేణి రూ.47,600 –రూ.1,51,100గా ఉంది.

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

సీజీఎల్ఈ పరీక్షను టైర్–1, టైర్–2 పేరుతో రెండు దశల్లో నిర్వహిస్తారు. ఆ వివరాలు..



ఎస్ఎస్‌సీ సీజీఎల్ఈ 2023

టైర్-1 ఇలా

ఎంపిక ప్రక్రియలో తొలి దశ పరీక్ష టైర్–1. ఇందులో 100 ప్రశ్నలు–200 మార్కులకు ఉంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(25 ప్రశ్నలు–50 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు–50 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు– 50 మార్కులు), ఇంగ్లిష్ కాంప్రహెన్షన్(25 ప్రశ్నలు–50 మార్కులు) విభాగాల్లో పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి ఒక గంట. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఉంటుంది.

నాలుగు పేపర్లుగా టైర్-2

- టైర్–1లో చూపిన ప్రతిభ, నిర్దేశిత కటాఫ్‌లను పరిగణనలోకి తీసుకుంటూ.. మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి టైర్–2 పరీక్ష ఉంటుంది. టైర్–2 పరీక్షను నాలుగు పేపర్లుగా నిర్వహిస్తారు. వివరాలు..
- **పేపర్–1:** పేపర్–1ను సెషన్–1, సెషన్–2లుగా నిర్వహిస్తారు. అదే విధంగా ప్రతి సెషన్‌ను రెండు సెక్షన్‌లుగా వర్గీకరించారు. ప్రతి సెక్షన్‌లోనూ రెండు మాడ్యూల్స్ విధానాన్ని అనుసరిస్తారు.
- సెషన్–1(సెక్షన్–1)లో.. మ్యాథమెటికల్ ఎబిలిటీస్(మాడ్యూల్–1), రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్(మాడ్యూల్–2) విభాగాల నుంచి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 60 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున 180 మార్కులు ఉంటాయి.
- సెషన్–1(సెక్షన్–2)లో మాడ్యూల్–1లో.. ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌లో 45 ప్రశ్నలు, మాడ్యూల్–2లో జనరల్ అవేర్‌నెస్ విభాగాల్లో 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. మొత్తం 70 ప్రశ్నలకు 210 మార్కులు ఉంటాయి.
- సెషన్–1(సెక్షన్–3) మాడ్యూల్–1లో.. కంప్యూటర్ నాలెడ్జ్ నుంచి 20 ప్రశ్నలతో 60 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- సెషన్–2 సెక్షన్–3 మాడ్యూల్ 2లో.. డేటాఎంట్రీ స్పీడ్ టెస్ట్‌ను 15 నిమిషాల వ్యవధిలో నిర్వహిస్తారు. అభ్యర్థులు రెండు వేల పదాలతో ప్యాసేజ్‌ను టైప్ చేయాల్సి ఉంటుంది.
- పేపర్–2.. స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్‌పై 100 ప్రశ్నలు–200 మార్కులకు ఉంటుంది.
- పేపర్–3.. జనరల్ స్టడీస్(ఫైనాన్స్ అండ్ ఎకనామిక్స్)పై 100 ప్రశ్నలు– 200 మార్కులకు ఉంటుంది. ఈ పేపర్‌ను పార్ట్–ఎ(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్–80 మార్కులు); పార్ట్–బి(ఎకనామిక్స్ అండ్ గవర్నెన్స్–120 మార్కులు)గా రెండు విభాగాలుగా నిర్వహిస్తారు.
- పేపర్–1లోని అన్ని సెషన్స్, సెక్షన్స్, మాడ్యూల్స్‌కు అన్ని పోస్టుల అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుంది.
- పేపర్–2ను జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్, స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్–2 పోస్టుల అభ్యర్థులకు మాత్రమే నిర్వహిస్తారు.
- పేపర్–3ని అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు మాత్రమే ఉంటుంది.

నిర్దిష్ట ప్రణాళికతోనే రాణింపు

దాదాపు అయిదు లక్షల మంది పోటీ పడే ఎస్ఎస్‌సీ సీజీఎల్ఈలో రాణించాలంటే.. అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌ల వారీగా నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి. సబ్జెక్ట్‌ల వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలు..

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

అభ్యర్థుల్లోని విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో స్కోర్ కోసం కోడింగ్, డీ–కోడింగ్, అనలిటికల్ పజిల్స్, క్రిటికల్ రీజనింగ్ బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇంగ్లిష్ అక్షర క్రమాన్ని ముందు నుంచి వెనుకకు, వెనుక నుంచి ముందుకు ప్రాక్టీస్ చేయాలి. దీంతోపాటు ఏ అక్షరం ఎన్నో స్థానంలో ఉందో సులువుగా గుర్తించాలి. అదే విధంగా అనలిటికల్ రీజనింగ్, సిలాజిజమ్స్, ఇనీక్వాలిటీస్, ఇన్‌పుట్ అవుట్‌పుట్, డేటా సఫిషియెన్సీ విభాగాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో రాణించేందుకు హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ అంశాలపై పట్టు సాధించాలి. అదే విధంగా స్టాక్ జీకే, కరెంట్ అఫైర్స్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం హైస్కూల్ స్థాయి మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజెస్, యావరేజెస్, రేషియో–ప్రపోర్షన్, ప్రాఫిట్–లాస్, సింపుల్–కాంపౌండ్ ఇంట్రెస్ట్, టైమ్–వర్క్, టైమ్–డిస్టెన్స్, పర్ముటేషన్స్–కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, మిక్షర్ అండ్ అలిగేషన్స్, పార్టనర్ షిప్‌పై దృష్టిపెట్టాలి. భాగహారాలు, కూడికలు, తీసివేతలు వంటి ప్రాథమిక అంశాలను నోటితో గణించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. సింప్లిఫికేషన్స్‌కు సంబంధించి బోడ్‌మస్ రూల్స్‌ను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యల వర్గాలు, ఘనాలు గుర్తించుకోవాలి.

ఇంగ్లిష్ కాంప్రహెన్షన్

అభ్యర్థులు బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, రీడింగ్ కాంప్రహెన్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్ ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు స్పెల్లింగ్స్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, టెన్సెస్, ప్రిపోజిషన్స్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, వొకాబ్యులరీ, రీ రైటింగ్ ద సెంటెన్స్, సెంటెన్స్ రీ–అరేంజ్‌మెంట్, ఆల్ఫాబెటికల్ ఆర్డర్, ప్రెసిస్ రైటింగ్, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, యాక్టివ్–ప్యాసివ్ వాయిస్, కాంప్లెక్స్ సెంటెన్సెస్ వంటి ముఖ్యాంశాలపై దృష్టి సారించాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, వొకాబ్యులరీల్లోనూ పూర్తి స్థాయిలో నైపుణ్యం పొందాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగంలో రాణించేందుకు కంప్యూటర్ ఫండమెంటల్స్, బేసిక్ కంప్యూటర్ స్ట్రక్చర్, ఆపరేటింగ్ సిస్టమ్, నెట్‌వర్క్, ఇంటర్నెట్, సాఫ్ట్‌వేర్ కాన్సెప్ట్స్, డీబీఎంఎస్, ఎంఎస్ ఆఫీస్‌లకు సంబంధించి బేసిక్ టెర్మినాలజీపై పట్టు సాధించాలి. సిస్టమ్‌కు సంబంధించి హార్డ్‌వేర్ టూల్స్, వాటి ఉపయోగాలు వంటి వాటిపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.

పేపర్-2, పేపర్-3లకు ఇలా

జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్, స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ పోస్టుల అభ్యర్థులకు నిర్వహించే పేపర్–2, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు జరిపే పేపర్–3లలో రాణించేందుకు అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో అకడమిక్ పుస్తకాలను చదవాలి. అదే విధంగా గత ప్రశ్న పత్రాలు, నమూనా ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** మే 3, 2023
- **దరఖాస్తు సవరణ:** మే 7, 8 తేదీల్లో
- **టైర్–1 పరీక్ష:** జూలై, 2023లో నిర్వహించే అవకాశం
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి,విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in

క్లుప్తంగా...

కంటి పరీక్షలు చేయించుకున్న హిమాన్ష్



బంజారాహిల్స్: సీఎం కేసీఆర్ మనవడు, మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాన్ష్ సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. బంజారాహిల్స్‌లోని వైఎస్సార్ భవన్‌లో నిర్వహిస్తున్న శిబిరంలో ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఇక్కడ అందిస్తున్న సేవల గురించి ఎస్‌పీహెచ్‌వో డాక్టర్ అనురాధ.. హిమాన్ష్‌కు వివరించారు.

ఆస్పత్రికి వచ్చి.. అస్వస్థతకు గురై...

సీపీఆర్ చేసి మహిళ ప్రాణాలు కాపాడిన భైంసా వైద్యులు



భైంసాటౌన్: కూతురితో ఆస్పత్రికి వచ్చి, అస్వస్థతకు గురై, అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఓ మహిళకు వైద్యులు సీపీఆర్ చేసి ప్రాణం పోశారు. ఈ ఘటన నిర్మల్ జిల్లా భైంసా సామాజిక ఆసుపత్రిలో సోమవారం జరిగింది. ముథోల్ మండల కేంద్రానికి చెందిన శోభాబాయి కూతురు సుజాత ఇటీవల ప్రసవించింది. సిజేరియన్ కాన్పు కావడంతో... కుట్లు విప్పించేందుకు కూతురును తీసుకుని శోభాబాయి సోమవారం భైంసా ఆస్పత్రికి వచ్చింది. అక్కడికి రాగానే అస్వస్థతకు గురైన ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. చుట్టుపక్కలవారు గమనించి కేకలు వేయడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, డాక్టర్ మేఘన మహిళకు వెంటనే సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి శోభాబాయి స్పృహలోకి వచ్చింది. అనంతరం ఆమెకు ప్రాథమిక చికిత్స చేశారు.

జీ20 సమావేశాలు షురూ

సాక్షి, హైదరాబాద్: భారత్ అధ్యక్షతన జరుగుతున్న జీ20 సమావేశాల్లో భాగంగా డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూప్ రెండో దఫా చర్చలు సోమవారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. సుమారు 23 దేశాలకు చెందిన 130 మంది ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో మొబైల్ బ్రాడ్ బ్యాండ్ తోపాటు డిజిటల్ కనెక్టివిటీ సంబంధిత అంశాలపై చర్చించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అల్కేశ్ కుమార్ శర్మ అతిథులకు స్వాగతం పలికారు. టెలీ కమ్యూనికేషన్స్ విభాగపు కార్యదర్శి కె.రాజారామన్.. డిజిటల్ కనెక్టివిటీకీ దేశాల స్థూల జాతీయోత్పత్తికీ మధ్య ఉన్న సంబంధాన్ని, కనెక్టివిటీని పెంచాల్సిన ఆవశ్యకతను వివరించారు. కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి దేవు సింగ్ చౌహాన్ మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే దేశంలో 5జీ టెక్నాలజీని అమలు చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. దేశంలోని సుమారు 600 జిల్లాలకు కేవలం 200 రోజుల్లో 5జీ సేవలు విస్తరించగలిగామని ఆయన తెలిపారు. భారతదేశంలో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద టెలి కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ ఉన్నప్పటికీ డేటా రేట్లు మాత్రం అతి తక్కువని, ఇది సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఎంతో ఉపయోగకరమైన విషయమని వివరించారు.

గాడియం స్కూల్‌కు 'ఉద్యాన' బహుమతి



సాక్షి, హైదరాబాద్: ఉద్యానశాఖ నిర్వహించిన ఏడో గార్డెన్ ఫెస్టివల్–2023లో స్కూళ్ల విభాగంలో గాడియం పాఠశాలకు మొదటి బహుమతి లభించినట్లు ఆ స్కూలు వ్యవస్థాపకులు, డైరెక్టర్ కీర్తిరెడ్డి ఓ ప్రకటనలో చెప్పారు. పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రోఫీని వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డి, రైతుబంధు చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నట్టు తెలిపారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా ప్రభాకర్‌రావు

కాచిగూడ: తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా మచ్చ ప్రభాకర్‌రావును నియమిస్తూ అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి నియామకపు పత్రాన్ని అందజేశారు. సోమవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రతినిధులు, అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్మశాలీలందరినీ ఐక్యం చేస్తూ మే నెల చివరి వారంలో హైదరాబాద్‌లో 5లక్షల మందితో పద్మశాలి శంఖారావం పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు మచ్చ ప్రభాకర్‌రావు తెలిపారు.

ఎటుచూసినా భవనాలు... రోడ్లు.. వాహనాల రణగొణ ధ్వనులు.. ఉక్కిరిబిక్కిరి చేసే వాయుకాలుష్యం... ఉరుకుల పరుగుల జీవనం.. ఇదీ నేటి కాంక్రీట్ జంగిల్‌లా మారిన పట్టణ, నగరవాసుల దయనీయ పరిస్థితి.
దీన్నుంచి కాస్త ఉపశమనం పొందాలనుకుంటున్నారా?

ఎటుచూసినా పచ్చటి చెట్లు.. పక్షుల కిలకిలారావాలు... అక్కడక్కడా కనిపిస్తూ కనువిందు చేసే వన్యప్రాణులు, స్వచ్ఛమైన పిల్లగాలులు, ప్రకృతి సోయగాల నడుమ సూర్యోదయ, అస్తమయాలను కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలసి ఆస్వాదించాలనుకుంటున్నారా?
అయితే ఇంకెందుకు ఆలస్యం.. చలో నర్సాపూర్, పోచారం.

- నగరవాసులకు 36 గంటల నేచర్ క్యాంప్ అందుబాటులోకి
- నర్సాపూర్ అడవులు, పోచారం వైల్డ్‌లైఫ్ శాంక్చురీ, జీప్ సఫారీ, ట్రెక్కింగ్ తదితరాలతో ప్యాకేజీ
- 'కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం' ప్రాజెక్ట్‌కు మెదక్ అటవీ శాఖ, యూఎస్ఏఐడీ శ్రీకారం
- అడవులు, వన్యప్రాణులు, పర్యావరణం, జీవవైవిధ్యంపై అవగాహన కోసమే



ప్రకృతి ఒడిలో సేదతీరేలా..

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి ఒడిలో నగరవాసులు కాసేపు సేదతీరేందుకు వీలుగా మెదక్ అటవీ శాఖ, యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ఏఐడీ) సంయుక్తంగా 'కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం'నేచర్ క్యాంప్‌లను అందుబాటులోకి తెచ్చాయి. నర్సాపూర్ అటవీ ప్రాంతం, పోచారం వైల్డ్‌లైఫ్ శాంక్చురీ, జీప్ సఫారీ, ట్రెక్కింగ్ తదితరాలతో రెండు పగళ్లు, ఒక రాత్రి కలిపి మొత్తం 36 గంటలపాటు అడవిలో గడుపుతూ మధుర అనుభూతులను సొంతం చేసుకొనేలా ప్యాకేజీని సిద్ధం చేశాయి. పర్యాటకులు అడవుల్లోని చెట్లు, జంతువుల రకాలు, పర్యావరణ వ్యవస్థలు, స్థానిక ఆహారపు అలవాట్లు, గిరిజనుల సాంస్కృతిక జీవనం, వ్యవసాయ పద్ధతుల వంటి వాటిని ప్రత్యక్షంగా తెలుసుకోవడాన్ని ఇందులో అంతర్భాగం చేశాయి. స్థానికంగా తయారు చేసిన వస్తువులకు గిరాకీ కల్పించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాల పెంపుతోపాటు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించనున్నాయి.

పోచారం వైల్డ్‌లైఫ్ శాంక్చురీ ప్రత్యేకతలివే...

హైదరాబాద్‌కు 115 కి.మీ. దూరంలోని పోచారం వైల్డ్‌లైఫ్ శాంక్చురీ 130 చ.కి.మీ. విస్తీర్ణంలో మెదక్, కామారెడ్డి జిల్లాల పరిధిలో విస్తరించింది. ఇది పోచారం లేక్ వెంట విస్తరించి ఉండటం విశేషం. ఇక్కడ వివిధ రకాల జింకలు, చిరుతలు, ఎలుగుబంట్లు కూడా కనిపిస్తుంటాయి. పలు రకాల అరుదైన పక్షులకు సైతం ఇది కేంద్రంగా ఉంది.



ఫారెస్ట్ ప్లస్ 2.0 అంటే...

కేంద్ర అటవీ, పర్యావరణశాఖల సహకారంతో యూఎస్ఏఐడీ సంస్థ ప్రకృతిసిద్ధ పరిష్కారాల అభివృద్ధి ద్వారా అడవులపై ఆధారపడిన స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెంపొందించడంతోపాటు కమ్యూనిటీల పరంగా బలోపేతం కావడానికి వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. దీనికి ఫారెస్ట్ ప్లస్ 2.0గా నామకరణం చేసింది. ఇందులో భాగంగా తిరువనంతపురం (కేరళ), గయ (బిహార్), మెదక్ (తెలంగాణ)లో కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం నేచర్ క్యాంపులకు శ్రీకారం చుట్టింది.

కనీసం 20 మంది.. సొంత వాహనాల్లో వస్తేనే...

పర్యాటకులకు ప్రత్యక్షంగా ప్రకృతిని, వైల్డ్ లైఫ్‌ను అనుభవంలోకి తీసుకొచ్చేందుకు ఈ ప్రోగ్రామ్‌ను రూపొందించాం. ప్రజలకు అడవులు, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేసేందుకు ఈ క్యాంప్‌లకు ప్రాధాన్యతనిచ్చాం. నేచర్ క్యాంప్‌ల ద్వారా వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. కనీసం 20 మందితో కూడిన పర్యాటక బృందం ఈ క్యాంప్‌కు రావాల్సి ఉంటుంది. సొంత వాహనాల్లోనే వారు మొత్తం టూర్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. పిల్లలకు (పదేళ్ల పైబడిన వారే) రూ. 1,500, పెద్దలకు రూ. 2 వేలు చొప్పున చార్జీగా ఖరారు చేశాం. ఆహారం, ఎంట్రీ ఫీజు, సఫారీ తదితరాలన్నీ ఈ ప్యాకేజీలో ఉంటాయి.
– జి. సాయిలు, రీజినల్ డైరెక్టర్, ఫారెస్ట్–ప్లస్ 2.0



నేచర్ క్యాంప్ టూర్ ఇలా...

- ఉదయం 6 గంటలకు నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్కు నుంచి ప్రారంభం
- ఈ పార్కులో ట్రెక్కింగ్, బర్డింగ్, బటర్‌ఫ్లై వాక్, వెట్‌ల్యాండ్ విజిట్
- వాచ్‌టవర్ వద్ద అల్పాహారం. అక్కడే ఈ టూర్‌కు సంబంధించిన ఇంటరాక్షన్
- నర్సాపూర్ పార్క్‌కు ఎదురుగానున్న అటవీ ప్రాంతం సందర్శన, అక్కడ నుంచి నర్సాపూర్ పట్టణానికి పయనం.
- మెదక్ పట్టణానికి ప్రయాణ మార్గమధ్యంలో ఫారెస్ట్, ప్రైవేట్ నర్సరీల విజిట్. మెదక్ చర్చి సందర్శన, ఆ తర్వాత సమీపంలోనే లంచ్
- అక్కడి నుంచి పోచారం వైల్డ్‌లైఫ్ శాంక్చురీకి..
- స్థానిక పర్యావరణ వ్యవస్థలపై అవగాహన పెంచుకునేందుకు సిద్ధం చేసిన ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్ (ఈఈసీ) విజిట్
- వైల్డ్‌లైఫ్ సఫారీ, పోచారం డ్యామ్, నిజాం హెరిటేజ్ బిల్డింగ్స్ సందర్శన, సూర్యాస్తమయ వీక్షణ.
- ఈఈసీ సెంటర్ వద్ద సమావేశం. అక్కడే స్థానిక వంటకాలు, రుచులతో బార్బిక్యూ డిన్నర్, హోమ్‌స్టే లేదా టెంట్లలో రాత్రి నిద్ర.
- మరుసటి రోజు ఉదయం 6 గంటలకు పోచారం లేక్ వద్ద సూర్యోదయ వీక్షణ
- అల్పాహారం తర్వాత పోచారం వైల్డ్‌లైఫ్ శాంక్చురీలో బర్డ్ వాచింగ్, బటర్‌ఫ్లై వాక్
- ఉదయం 11 గంటలకు దంతేపల్లి లేదా మరోచోట గిరిజన గ్రామ సందర్శన
- మధ్యాహ్నం దంతేపల్లిలో 'ఫామ్ లంచ్' అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం

గురుకుల కొలువుల 'దరఖాస్తు'లు మొదలు!

- బోర్డు వెబ్‌సైట్‌లో జూనియర్, డిగ్రీ కాలేజీ పోస్టుల పూర్తిస్థాయి నోటిఫికేషన్లు
- ఎక్కువ మంది యూజర్లు తెరవడంతో సర్వర్‌పై ఒత్తిడి
- ఆలస్యంగా వెబ్‌పేజీ తెరుచుకుంటోందంటూ అభ్యర్థుల అసంతృప్తి



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో వివిధ రకాల పోస్టులకు గానూ తాజాగా ఆన్‌లైన్ దరఖాస్తులకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) సోమవారం నుంచి అనుమతిచ్చింది. ఈనెల 24వ తేదీ నుంచి వరుసగా మిగిలిన ఉద్యోగాల దరఖాస్తుల ప్రక్రియ మొదలు కానుంది.
☛రాష్ట్రంలోని ఐదు గురుకుల సొసైటీల పరిధిలో 9,231 ఉద్యోగాలకు సంబంధించి ఈనెల 5వ తేదీన గురుకుల నియామకాల బోర్డు ఏకంగా 9 నోటిఫికేషన్లు జారీ చేసింది. ఇందులో భాగంగా దరఖాస్తు ప్రక్రియను నెలరోజుల పాటు కొనసాగిస్తున్నట్లు ప్రకటించిన బోర్డు... ముందుగా జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ ఉద్యోగాలకు గాను దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. ఈ కేటగిరీలకు సంబంధించిన పూర్తిస్థాయి ఉద్యోగ ప్రకటనలను వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టింది. రోస్టర్ వారీగా ఉద్యోగ ఖాళీలు, దరఖాస్తు ప్రక్రియ, విద్యార్హతలు, ఫీజు, పరీక్షల సిలబస్, పరీక్షల విధానం(స్కీం ఆఫ్ ఎగ్జామినేషన్) తదితర పూర్తిస్థాయి సమాచారాన్ని అందులో పొందుపర్చింది.

ఓటీఆర్ కీలకం: గురుకుల కొలువుల దరఖాస్తులో ఓటీఆర్(వన్ టైమ్ రిజిస్ట్రేషన్)ను టీఆర్ఈఐఆర్‌బీ కీలకం చేసింది. దీంతో అభ్యర్థులంతా ముందుగా ఓటీఆర్ నమోదు చేసుకున్న తర్వాత దరఖాస్తు పేజీలోకి ఎంట్రీ కావాలి. దీంతో ఒకవైపు ఓటీఆర్ నమోదు చేసుకునే అభ్యర్థులు... మరోవైపు దరఖాస్తు సమర్పించే అభ్యర్థులు పెద్ద సంఖ్యలో వెబ్‌పేజీని తెరుస్తుండడంతో సర్వర్‌పై ఒత్తిడి తీవ్రమైంది. దీంతో వెబ్‌పేజీ తెరుచుకోవడంలో జాప్యం జరుగుతుండటంతో అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తొలిరోజు కావడంతో కాస్త ఇబ్బంది ఉన్నప్పటికీ నాలుగైదు రోజుల్లో పరిస్థితి చక్కబడుతుందని బోర్డు అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు రుసుము రూ.1200: గురుకుల ఉద్యోగాల దరఖాస్తుకు జనరల్ అభ్యర్థులు రూ.1,200 చెల్లించాలి. ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులు ఒక్కో దరఖాస్తు ఫీజు రూ.600 చొప్పున చెల్లించాలి. దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక సమస్యలుంటే బోర్డు ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ నంబర్‌ను సంప్రదించవచ్చు. 040–23317140 ఫోన్ నంబర్‌లో నేరుగా కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని టీఆర్ఈఐఆర్‌బీ సంప్రదించింది. లేకుంటే టీఆర్ఈఐఆర్‌బీహెల్ప్‌లైన్(ఎట్)జీమెయిల్.కామ్ కు లిఖిత పూర్వక ఫిర్యాదులు, వినతులు సమర్పించవచ్చని బోర్డు సూచించింది.

ఇరు రాష్ట్రాలూ సమస్యలు పరిష్కరించుకోవాలి

- జలవివాదాలపై అధికారులు సమన్వయంతో మాట్లాడుకోవాలి
- లేదంటే మేమే పరిష్కరిస్తాం
- కేఆర్ఎంబీ చైర్మన్ శివనందన్‌కుమార్



స్పిల్‌వే పరిశీలించి మాట్లాడుతున్న అధికారులు

నాగార్జునసాగర్: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు సమన్వయంతోనే పరిష్కారమవుతాయని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్ శివనందన్‌కుమార్ అభిప్రాయపడ్డారు. బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్ గుప్తాతో కలిసి సాగర్ ప్రధాన ఆనకట్ట, స్పిల్‌వే, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం, గ్యాలరీలను సోమవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రా–తెలంగాణ ప్రభుత్వాలు సంబంధిత అధికారులు స్నేహ పూర్వకమైన వాతావరణంలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. నీటి వినియోగంపై ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం తగదన్నారు. ప్రతి ఏడాదీ కృష్ణానది నీటి వినియోగం విషయంలో ఇదే సమస్య తలెత్తడం అంత మంచిది కాదన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు ఒకచోట చేరి సమస్యను పరిష్కరించుకోవడం ఉత్తమమని చెప్పారు. లేకుంటే తామే సమస్యను పరిష్కరించి వివాదాలు లేకుండా చూస్తామన్నారు. మంగళవారం కుడికాల్వ హెడ్ రెగ్యులేటర్‌తో పాటు విద్యుదుత్పాదన కేంద్రం టెలిమెట్రీలను పరిశీలించనున్నట్లు తెలిపారు. వారి వెంట డ్యాం ఎస్ఈ ధర్మానాయక్, ఈఈ మల్లికార్జున్‌రావు, డీఈలు పరమేశ్, శ్రీనివాసరావు, సుదర్శన్, జేఈలు సత్యనారాయణ, కృష్ణయ్య, హనుమంతరెడ్డి ఉన్నారు.

యూనివర్సిటీల్లో గిరిపుత్రులకు వసతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గిరిజన విద్యార్థులకు శుభవార్త. యూనివర్సిటీల్లో ఉన్నతవిద్య అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు ఉచిత వసతి కల్పించేందుకు గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక వసతి గృహాలు నిర్మించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని ఏడు యూనివర్సిటీల్లో బాల బాలికలకు వేర్వేరుగా వసతిగృహాలను నిర్మించి అందుబాటులోకి తీసుకురానుంది. ప్రస్తుతం వర్సిటీల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కామన్ హాస్టళ్లు ఉన్నాయి. ఈ హాస్టళ్లలో గిరిజన విద్యార్థులకు సీట్లు పరిమిత సంఖ్యలోనే ఉండటంతో మెజారిటీ విద్యార్థులు ప్రైవేటు హాస్టళ్లు, అద్దె గదుల్లో వసతి పొందాల్సి వస్తోంది. ఒక్కో హాస్టల్‌లో 500 మంది విద్యార్థులకు వసతి కల్పించేలా భవన నిర్మాణం ఉండనుంది. ఒక్కో భవనానికి రూ. 5 కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ లెక్కన ఏడు యూనివర్సిటీల్లో 14 భవనాల కోసం రూ. 70 కోట్లు ఖర్చు కానుంది.

వచ్చే నెలలో రోడ్డుపైకి ఎలక్ట్రిక్ బస్సులు

నమూనా బస్సును పరిశీలించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కొత్తగా సమకూర్చుకోబోతున్న 550 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులకు గాను వచ్చే నెలలో కొన్ని అందుబాటులోకి రాబోతున్నాయి. ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ సంస్థ వీటిని సరఫరా చేయబోతోంది. మొత్తం బస్సుల్లో నగరంలో 500 బస్సులను, ఏపీకి విజయవాడ మార్గంలో 50 బస్సులను నడపనున్నారు. నమూనా బస్సును ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఇతర అధికారులతో కలిసి బస్‌భవన్ ప్రాంగణంలో సోమవారం పరిశీలించారు. ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా బస్సులను రూపొందించాలని తయారీ సంస్థ ప్రతినిధులకు ఆయన సూచించారు. 12 మీటర్ల పొడవుండే ఈ బస్సులో 41 సీట్లు ఉంటాయని, ఒకసారి చార్జింగ్‌తో 325 కి.మీ. తిరుగుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి సీటు వద్ద మొబైల్ చార్జింగ్ పాయింట్, రీడింగ్ ల్యాంప్, బస్ ట్రాకింగ్ వ్యవస్థ, పానిక్ బటన్, మూడు చొప్పున సీసీటీవీ కెమెరాలు, ఎల్ఈడీ బోర్డులుంటాయి.



నమూనా ఎలక్ట్రిక్ బస్సును పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఇతర అధికారులు

పర్యాటక బస్సులు ప్రారంభం..
పర్యాటకాభివృద్ధి సంస్థ కొత్తగా కొనుగోలు చేసిన ఏసీ స్లీపర్ బస్సులను పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రవీంద్రభారతి ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు. హైదరాబాద్–తిరుపతి, హైదరాబాద్–షిర్డీలకు వీటిని తిప్పనున్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఎండీ మనోహర్ పాల్గొన్నారు.

'శిల్పం.. వర్ణం.. కృష్ణం'.. సర్వం సిద్ధం

- నేడు రామప్ప ఆలయంలో ప్రపంచ వారసత్వ దినోత్సవం
- హాజరుకానున్న పలువురు మంత్రులు, కళాకారులు

సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రపంచ వారసత్వ వేడుకలకు రామప్ప ఆలయం ముస్తాబైంది. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మంగళవారం 'శిల్పం.. వర్ణం.. కృష్ణం..'పేరిట ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఇక్కడ కూచిపూడి, పేరిణి నృత్యకళాకారులు తమ ప్రదర్శనలతో ఆహూతులను అలరించనున్నారు. ప్రముఖ సంగీత దర్శకులు, కళాకారులతో నిర్వహించే సంగీత విభావరికి వేదికకానుంది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. 800 ఏళ్ల నాటి రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు లభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని ఈసారి ఘనంగా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ముఖ్యఅతిథులుగా మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ హాజరుకానున్నారని నిర్వాహకులు వెల్లడించారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, ప్రముఖ డ్రమ్స్ వాయిద్యకారుడు శివమణి, సింగర్ కార్తీక్, ఫ్లూటిస్ట్ నవీన్‌తో పాటు పలువురు కళాకారులతో సంగీత విభావరి నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. 250 మంది కూచిపూడి కళాకారులతో నృత్య ప్రదర్శన, 75 మంది అరబీ ఇన్‌స్టిట్యూట్ వారి వయోలిన్‌తోపాటు పేరిణి నృత్యం, రావణ అన్ టోల్డ్ స్టోరీ ఆఫ్ది లెవన్ హెడ్, బెంగళూరుకు చెందిన సూర్య. ఎస్.రావు, హెరిటేజ్ ఆఫ్ ఇండియా శ్రావ్య మానస ప్రదర్శనలు ఉంటాయి. కాగా, గార్డెన్‌లో వేదిక, వీవీఐపీ, వీఐపీలకు ప్రత్యేకంగా, సామాన్యులకు మరోవైపు గ్యాలరీలు సిద్ధం చేశారు.

వారసత్వ సంపదకు నిలయం తెలంగాణ: సీఎం



సాక్షి, హైదరాబాద్: ఆదిమానవుని కాలం నుంచి ఆధునిక యుగం వరకు, ప్రతీ చారిత్రక దశకు సంబంధించిన మహోజ్వల చారిత్రక వారసత్వ సంపద తెలంగాణ నేలకు సొంతమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా రాష్ట్రానికున్న చారిత్రక ప్రాశస్త్యాన్ని సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. ప్రాచీన భారతదేశంలో ఆవిర్భవించిన షోడశ మహాజనపథాల్లో, దక్షిణ భారతదేశంలో విలసిల్లిన ఒకే ఒక జనపథమైన అస్మక మహాజనపథం తెలంగాణ ప్రాంతంలో నేటి బోధన్ కేంద్రంగా వెలుగొందడం తెలంగాణ గడ్డకున్న ప్రాచీనతను, ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటుతున్నదని సీఎం అన్నారు. తెలంగాణ చరిత్రను కాపాడుకోవడంలో చైతన్యవంతమైన యువత భాగస్వామ్యం మరింతగా పెరగాలని ఆకాంక్షించారు.

డాక్యుమెంట్ రైటర్ హత్య

కిడ్నాప్ చేసి చావబాదిన ప్రత్యర్థులు

- స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రికి తరలింపు
- చనిపోయాడని చెప్పడంతో పరారీ
- నిందితులు బీఆర్ఎస్ ఎంపీపీ సోదరులు, అనుచరులు
- రంగారెడ్డి జిల్లా కొత్తూరులో ఘటన

కొత్తూరు: ఆర్థిక లావాదేవీలు, పాతకక్షలతో డాక్యుమెంట్ రైటర్, మాజీ విలేకరి మామిడి కరుణాకర్ రెడ్డి హత్యకు గురయ్యాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులో సోమవారం వెలుగుచూసిన ఘటనపై పోలీసుల తెలిపిన వివరాలు.. కొత్తూరు మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డికి అధికార పార్టీ బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీపీ మధుసూదన్‌రెడ్డితో గొడవలు జరుగుతున్నాయి. ఇద్దరూ పలుమార్లు పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. కరుణాకర్‌రెడ్డి కదలికలపై మధుసూదన్ రెడ్డి సోదరులు విక్రమ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అనుచరులు ఆరిఫ్, అరుణ్‌రెడ్డి నిఘా పెట్టారు. ఆదివారం సాయంత్రం కరుణాకర్‌రెడ్డి తీగాపూర్ నుంచి మల్లాపూర్‌కు వస్తున్నాడన్న సమాచారంతో మార్గమధ్యలో అతడిని కిడ్నాప్ చేశారు. తమ కారులో ఎక్కించుకొని దాడికి చేశారు. దెబ్బలకు స్పృహకోల్పోయిన కరుణాకర్‌రెడ్డిని ప్రమాదం జరిగిందని చెప్పి హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు చెప్పడంతో.. నిందితులు జారుకున్నారు.

నిందితులను అరెస్టు చేయాలంటూ ధర్నా
కరుణాకర్‌రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి కాంగ్రెస్ నేతలు ధర్నా, రాస్తారోకోలు నిర్వహించారు. తన కుమారుడ్ని చంపిన దుండగులను అరెస్ట్ చేసేంతవరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించవద్దని మృతుడి తల్లి స్వరూప పోలీసులను కోరింది. ఆర్థికలావాదేవీల కారణంగానే హత్య జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చామని శంషాబాద్ డీసీపీ తెలిపారు. కరుణాకర్‌రెడ్డి కిడ్నాప్, హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేశారు.

మండుతున్న ఎండలు

రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలపైనే..

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్రంలో సోమవారం ఎండలు మండిపోయాయి. ఉదయం 10 గంటలకే నిప్పుల కొలిమిని తలపించాయి. చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియస్ కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో అత్యధికంగా 42.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రానున్న రెండ్రోజులు కూడా జీహెచ్ఎంసీ మినహా మిగతా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40నుంచి 43 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. మరోవైపు మంగళ, బుధవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం కూడా ఉన్నట్లు పేర్కొంది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పలుచోట్ల తేలికపాటి వానలు, కొన్నిచోట్ల వడగండ్ల వానలు కురిసినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

తెలంగాణ, ఏపీలో గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్ఠం
రెంటచింతల	45.6
రాజమహేంద్రవరం	43.5
నంద్యాల	42.7
ఆదిలాబాద్	42.5
భద్రాచలం	41.8
నిజామాబాద్	41.5
ఖమ్మం	41.2
హనుమకొండ	41.0
రామగుండం	41.0
మహబూబ్‌నగర్	40.8
నల్లగొండ	40.5
మెదక్	40.0
హైదరాబాద్	38.7
దుండిగల్	38.6
హకీంపేట్	38.5

పోలవరం ముంపుపై 'అథారిటీ' సర్వే జరపాలి

ఏపీతో సంబంధం లేకుండా నిర్వహించాలని కోరిన తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావంపై ఏపీతో సంబంధం లేకుండా పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) స్వయంగా సర్వే నిర్వహించాలని తెలంగాణ కోరింది. ఈ మేరకు పీపీఏకి రాష్ట్ర నీటిపారుదల శాఖ అంతర్రాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్ కుమార్ తాజాగా లేఖ రాశారు. కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఈ నెల 10న ఏపీ, తెలంగాణలో పీపీఏ సమావేశం నిర్వహించాల్సి ఉండగా, తాత్సారం చేసి 12వ తేదీన నిర్వహించిందని తప్పుబట్టారు. సమావేశంలో రెండు రాష్ట్రాలు పరస్పరం రికార్డులను మార్పిడి చేసుకోవాల్సి ఉండగా, ఏపీ ఉత్త చేతితో రావడంతో సమావేశం ఉద్దేశం నెరవేరలేదన్నారు. 14న రికార్డులను అందజేస్తామన్న ఏపీ ఇప్పటివరకు స్పందించలేదన్నారు. తెలంగాణ నిర్వహించిన సర్వేల రికార్డులను ఈ నెల 6న పీపీఏకి పంపిస్తే 12వ తేదీ వరకు ఏపీకి అందజేయకపోవడం సరికాదన్నారు. గరిష్ట నిల్వమట్టం మేరకు జలాశయంలో నీళ్లను నిల్వ చేస్తే బ్యాక్‌వాటర్ ముంపు ప్రభావాన్ని తేల్చాలని పీపీఏను కోరారు. సుప్రీం కోర్టు మధ్యంతర ఆదేశాలు, ఎన్జీటీ తీర్పు మేరకు పోలవరం ముంపు నివారణకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పీపీఏపై ఉందన్నారు. వర్షాలు రాకముందే సర్వే జరిపించాలని కోరారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.